www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 28-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 192 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి ఉ. 8.00 వరకు తదుపరి సప్తమి, నక్షత్రం: పూర్వాషాఢ మ.3:45 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.12:20-2:03, దుర్ముహూర్తం: ఉ.8:33-9:18, రా.9:49-10:38, అమృతఘడియలు: ఉ.10:29-12:14, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6:15, సూర్యాస్తమయం: 5:41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌తో ప్రమాణం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ప్రమాణ స్వీకారం

ప్రమాణం చేయించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ఠాకూర్

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణం చేయించారు. తొలుత రాష్ట్రానికి జస్టిస్ రాయ్ బదిలీకి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మిగతా 14వ పేజీలో...



19 వాహనాలు బైక్‌ను తప్పించాయి!

ఒక్క వి.కావేరి బస్సే బైకును ఈడ్చుకెళ్లింది

దీనికి డ్రైవర్ లక్ష్మయ్య నిర్లక్ష్యమే కారణం

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో పలు అంశాలపై పోలీసుల సందేహం

తెల్లవారుజామున 2:45కు డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

రోడ్డుకు అడ్డంగా పడిన బైక్.. తర్వాత అదే దారిలో లారీలు, బస్సులు

బైక్‌పై నుంచి వెళ్లింది ఆ బస్సు ఒక్కటే.. బైకు కనిపించలేదా?

కర్నూలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గత శుక్రవారం తెల్లవారు జామున 2:45 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై డోన్‌కు వెళ్తున్న శివశంకర్, ఎర్రిస్వామిలు కర్నూలులోని చిన్నటేకూరు దగ్గర డివైడర్‌ను ఢీకొట్టారు. బైకర్ శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డారు. బైక్ రోడ్డు మధ్యలో పడిపోయింది. అదే రోడ్డులో అర్ధరాత్రి దాటాక 2:55 నుంచి 3 గంటల మధ్య బెంగళూరు వైపు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను గుర్తించకుండా ఆ బైక్ పైనుంచి వాహనాన్ని నడిపించడంతో మంటలు చెలరేగి 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతయ్యారు. అంటే.. ఈ రెండు ఘటనల మధ్య 10-15 నిమిషాల వ్యవధి ఉంది. అయితే.. ఈ స్వల్ప వ్యవధిలో అదే మార్గంలో 19కి పైగా బస్సులు, లారీలు రోడ్డుపై పడిన బైక్‌ను గుర్తించి.. దానిని తప్పించుకొని ముందుకుసాగాయి. మరి కావేరి బస్సు డ్రైవర్ లక్ష్మయ్యకు రోడ్డుపై పడి ఉన్న బైకు కనిపించలేదా? లేదా నిర్లక్ష్యంగా ఆయన బస్సును నడిపారా? అనేది కీలక ప్రశ్న. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ లక్ష్మయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తే.. ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. మొదట్లో బైకర్ ఎదురుగా వచ్చి బస్సును ఢీకొట్టాడని, ఆ తర్వాత ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందని చెప్పారు. తర్వాత, శివశంకర్, ఎర్రిస్వామిలు ఓ బంకులో పెట్రోలు పోయించుకున్న సీసీ కెమెరా ఫుటేజీ వెలుగులోకి వచ్చాక రోడ్డుపై పడిన నల్లరంగు బైక్‌ను గుర్తించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని లక్ష్మయ్య వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పోలీసులు లక్ష్మయ్యను మరింత లోతుగా విచారిస్తున్నారు. "ప్రమాదం జరిగిన సమయంలో

మిగతా 14వ పేజీలో...

ముంచుకొస్తున్న మొంథా

హై అలర్ట్



కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్రతీరంలో తుఫాన్ పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణతేజ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్



శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం బందరువానిపేట తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నేడు తీవ్ర తుఫాన్‌గా మార్పు.. వాతావరణ శాఖ రెడ్ మెసేజ్ జారీ

తీరం వెంబడి పూర్తి స్థాయి అప్రమత్తత

17 కిలోమీటర్ల వేగంతో కదులుతూ కోస్తా వైపు

నేటి రాత్రికి కాకినాడ-యానాం మధ్య తీరంపైకి!

ఆ సమయంలో 100 కి.మీ. వేగంతో గాలులు

గుంటూరు-కృష్ణాలపైనా తీవ్ర ప్రభావం ఉండే వీలు

తీరం దాటే వేళ మధ్య కోస్తాలో కుంభవృష్టి

తుఫాన్ ప్రభావంతో రాష్ట్రమంతా వర్షాలు

భారీ సంఖ్యలో రైళ్లు, విమాన సర్వీసుల రద్దు

తీరంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ మోహరింపు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'మొంథా' తుఫాన్ ముంచుకొస్తోంది. సోమవారం ఉదయం నుంచి గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కోస్తా వైపు పయనిస్తోంది. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలు తడిసి ముద్దవుతున్నాయి. తీవ్ర ముప్పును సూచిస్తూ తీరమంతటా వాతావరణశాఖ రెడ్ మెసేజ్‌ను జారీ చేసింది. తీర ప్రాంతాల్లో రోజంతా వర్షాలు పడుతూనే ఉన్నాయి. దక్షిణ, ఉత్తర కోస్తాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం ముందుకు వస్తుండటంతో పర్యాటకులను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం సాయంత్రానికి తుఫాన్ చెన్నైకి 420 కిలోమీటర్లు తూర్పుగా, కాకినాడకు 450 కిలోమీటర్లు దక్షిణ ఆగ్నేయంగా, విశాఖపట్నానికి 500 కిలోమీటర్లు దక్షిణ ఆగ్నేయంగా పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో

మిగతా 13వ పేజీలో...

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం

తుఫాన్‌పై ఎన్ని రివ్యూలు చేశారనేది కాదు..

క్షేత్రస్థాయిలో ప్రభావం ఎంతనేదే ముఖ్యం

రియల్ టైంలో ప్రజలకు సమాచారం అందాలి

ప్రతి గంటకూ తుఫాన్‌పై బులెటిన్లు: సీఎం

సమగ్ర కథనాలు 12, 13లో



సోమవారం మొంథా తుఫాను పరిస్థితిపై ఆర్టీజీఎస్ నుంచి సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో మంత్రులు అనిత, లోకేశ్, అధికారులు

19 జిల్లాల్లోని తుఫాను ప్రభావిత మండలాలు	233
ముప్పు పొంచి ఉన్న గ్రామాలు	1,419
మోహరించిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల్లోని సభ్యుల సంఖ్య	965
ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు	2,194
రద్దయిన రైలు, విమాన సర్వీసులు వందేసి	100
తుఫాన్ బాధిత కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం, నిత్యావసర వస్తువులు	25

టెండర్లలో మార్కుల మతలబు!

ఆ కంపెనీలకు అనుగుణంగా నిబంధనల రూపకల్పన

ప్రజంటేషన్ మార్కులే కీలకం

'ఓకే' అన్న కంపెనీలకే కాంట్రాక్టులు

ఇతర కంపెనీలపై డిస్‌క్వాలిఫై ముద్ర

క్యూసీబీఎస్‌లోనే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఫీడ్ అంబులెన్సులు

సీటీ స్కాన్ సేవల్లోనూ ఇదే విధానం

కొన్ని శాఖల్లో క్యూసీబీఎస్ విధానం

మార్కుల ద్వారా కంపెనీలకు వర్కులు.. ముందుగానే 'ఫిక్సింగ్'

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కొన్ని ప్రభుత్వ శాఖల్లో ముఖ్యంగా ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ దక్కాలంటే అధికారుల దగ్గర మంచి 'మార్కులు' కొట్టేయాలి. ఎవరికి ఎక్కువ మార్కులు వస్తే వారికే కాంట్రాక్ట్ వస్తుంది. లేకుంటే అంతే సంగతులు. మరి కాంట్రాక్ట్ కోసం మార్కులు ఎలా సంపాదించాలి? ఇక్కడే అసలు మతలబు దాగుంది! అధికారుల చలువ ఉంటేనే మార్కులు వస్తాయి. ముందుగా 'ఫిక్సింగ్' చేసుకున్నవారికే కాంట్రాక్టులు. ప్రస్తుతం ఆరోగ్య శాఖలో చాలా వరకు ఈ మార్కుల విధానంలోనే కాంట్రాక్టులు కట్టబెడుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో వర్కుల కోసం ఎల్1 విధానంలో టెండర్లు పిలవడం సాధారణం. టెండర్లలో తక్కువ మొత్తానికి కోట్ చేసిన కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చేవారు. ఈ మధ్యకాలంలో కొన్ని శాఖల్లో కాంట్రాక్ట్ సంస్థలకు పరీక్షలు పెడుతున్నారు. ఇదే క్వాలిటీ కాస్ట్ బేస్డ్ సిస్టమ్ (క్యూసీబీఎస్). ఎప్పటి నుంచో

మిగతా 12వ పేజీలో...





రాష్ట్రం కోసం బాబు స్వార్థం!

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీలేని ధోరణి

వాజపేయి హయాంలో అత్యధిక లబ్ధి.. భారీగా ప్రాజెక్టులు, నిధులు, గ్రాంట్లు


ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టుల్లో 40% ఏపీకే.. 30% గ్రాంట్‌ను 100%గా మార్చుకున్నారు

ఆయన సామర్థ్యం, రాజకీయ చతురతతో ఉమ్మడి రాష్ట్రానికి ప్రయోజనం

కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి గార్గ్ వెల్లడి.. 'నో, మినిస్టర్'లో ఆసక్తికర అంశాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు... సంకీర్ణ సర్కారులో తెలుగుదేశానిదే కీలక పాత్ర! అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు కేంద్రం నుంచి సాధించుకున్న నిధులు, గ్రాంట్లు, ప్రాజెక్టుల గురించి సీనియర్ బ్యూరోక్రాట్లకు బాగా తెలుసు! నాటి రాజకీయ పరిస్థితులను, కేంద్రానికి తమతో ఉన్న అవసరాన్ని ఉపయోగించుకుని.. ఏపీకి గరిష్ఠ లబ్ధి చేకూర్చారని, చంద్రబాబు అడిగింది వాజపేయి కాదనకుండా చేశారనీ



మిగతా 14వ పేజీలో...

మద్యం స్కాం కేసులో కసిరెడ్డి ప్రాసిక్యూషన్‌కు

గ్రీన్‌సిగ్నల్!

ఐటీ సలహాదారు హోదాలో ప్రభుత్వం నుంచి జీతభత్యాలు

దీంతో ప్రాసిక్యూట్ చేయడానికి సర్కారు అనుమతి తప్పనిసరి

ఈ దిశగానే కూటమి ప్రభుత్వం నిర్ణయం



అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిపై సిట్ ఉచ్చు బిగిస్తోంది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాజ్ ఐటీ సలహాదారుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక మద్యం కుంభకోణంపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సిట్ రాజ్‌ను అరెస్టు చేసింది. ఆయన ప్రభుత్వ సలహాదారుగా ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...



10

శ్రేయాస్‌కు తీవ్ర గాయం

చివరి వన్డేలో డైవ్ చేసి క్యాచ్ పట్టే క్రమంలో పక్కటెముకల్లో బలంగా తగిలిన మోచేయి

ప్లీహానికి గాయం.. అంతర్గత రక్తస్రావం

తమిళనాడు, బెంగాల్‌లో ఎస్ఐఆర్

మరో 10 రాష్ట్రాలు/యూటీల్లో కూడా

4 నుంచి రెండో దశ ఓటర్ల జాబితా సవరణ.. డిసెంబరు 4దాకా ఎస్ఐఆర్

అదే నెల 9న ముసాయిదా జాబితా

ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెల్లడి

2

పరకామణిలో చోరీ కేసులో రాజీపై

సీఐడీ దర్యాప్తు

హైకోర్టు కీలక ఉత్తర్వులు.. విచారణాధికారి, టీటీడీ బోర్డు చైర్మన్, అధికారులు, ఫిర్యాదుదారు పాత్ర తేల్చండి

డీజీ స్థాయికి తగ్గని అధికారికి బాధ్యత అప్పగించండి

నిందితుడు, కుటుంబ సభ్యుల ఆస్తులపైనా విచారణ జరపాలి

స్థిర, చరాస్తులతో పాటు బ్యాంకు ఖాతాలూ పరిశీలించండి

ఆదాయానికి తగినట్లే ఆస్తులు ఆర్జించారా?

వేరేవారికి ఆస్తులు దఖలు పరిచారో లేదో దర్యాప్తు చేయండి

ఏసీబీకి కూడా న్యాయమూర్తి నిర్దేశం

సీల్డ్ కవర్‌లో నివేదికలను తమ ముందుంచాలని స్పష్టీకరణ

14

'స్పీడు' పెరిగింది!

పారిశ్రామిక ప్రగతిలో ఏపీ జోరు.. మోదీ వేగానికి చంద్రబాబు తోడు

'మేకిన్ ఇండియా'లో ఏపీ కీలకం.. ఉత్పత్తి కేంద్రాలుగా 3 పారిశ్రామిక కారిడార్లు.. పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు సిద్ధం

కర్నూలులో ప్రపంచంలోనే అతి పెద్ద డ్రోన్ సిటీ

కొప్పర్తితో మారనున్న సీమ ముఖచిత్రం

జగన్ ప్రభుత్వంలో కాలయాపనతోనే సరి

కృష్ణపట్నం టెండర్లకే మూడేళ్లు పట్టింది

కూటమి వచ్చాక విధాన నిర్ణయాల్లో వేగం



'ఆంధ్రజ్యోతి'తో ఎన్ఐసీడీసీ చైర్మన్ సైనీ

11

మీ అక్కాచెల్లెళ్ల అభ్యంతరకర ఏఐ చిత్రాలను

సోషల్ మీడియాలో పెడతా

» సైబర్ నేరగాడి బెదిరింపులతో హరియాణలో ఓ యువకుడి ఆత్మహత్య


రాహుల్ భారతి(ఫైల్)

ఫరీదాబాద్, అక్టోబరు 27: సైబర్ నేరగాళ్ల అకృత్యాలకు ఓ యువకుడు బలయ్యాడు. లక్షల్లో డబ్బులు పంపాలని లేకపోతే తన అక్కాచెల్లెళ్ల అభ్యంతరకర మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హరియాణలోని ఫరీదాబాద్‌లో జరిగింది. రాహుల్ భారతి (19) అనే యువకుడి ఫోన్‌ను రెండు వారాల క్రితం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులో ఉన్న ఆ యువకుడితో పాటు అతడి ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఫొటోలు, వీడియోలను ఏఐతో మార్ఫింగ్ చేసి, ఆ చిత్రాలను ఆ యువకుడికి పంపి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ యువకుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాహుల్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాహిల్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు.

భారతీయుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి..!

» 50 మందిని వెనక్కి పంపిన అమెరికా

న్యూఢిల్లీ, అక్టోబరు 27: అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. దేశవ్యాప్తంగా తనిఖీలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా 50 మంది భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి వెనక్కి పంపించారు. వీరంతా అక్రమ పద్ధతుల్లో అగ్రరాజ్యానికి చేరుకున్నవారే కావడం గమనార్హం. శనివారం అర్ధరాత్రి వీరంతా ఢిల్లీకి చేరుకోగా.. పోలీసులు వారిని విచారించి స్వస్థలాలకు పంపించారు. వీరిలో ఎక్కువ మంది హరియాణాలో కైతాల్, కర్నాల్, కురుక్షేత్ర జిల్లాలకు చెందిన వారే ఉన్నట్టు అధికారులు తెలిపారు. మిగిలిన వారిలో గోవా, గుజరాత్, హైదరాబాద్‌కు చెందిన వారు ఉన్నారని పేర్కొన్నారు. వీరిని భారత్‌కు తిరిగి పంపించడానికి ముందు కొన్ని నెలల పాటు వీరిని నిర్బంధ కేంద్రాల్లో ఉంచారు.

అమెరికాలో స్తంభించిన 8వేల విమానాలు

వాషింగ్టన్, అక్టోబరు 27: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా విమాన సర్వీసులు స్తంభించాయి. భారీగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు గైర్హాజరు కావడంతో ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 8 వేల సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 22 ప్రదేశాల్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడిందని అమెరికా రవాణా కార్యదర్శి శాన్ డఫీ వెల్లడించారు. రానున్న రోజుల్లో సిబ్బంది కొరతతో విమానాల ఆలస్యం, సర్వీసుల రద్దు మరింత పెరగొచ్చని తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల (అమెరికా కాలమానం) నాటికి 8 వేలకు పైగా విమానాల సేవలకు అంతరాయం ఏర్పడిందని ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ తెలిపింది.

సహజీవనంలో ఉన్న యువకుడిని మాజీ ప్రియుడితో కలిసి చంపిన యువతి

» నిందితురాలు అమృతా చౌహాన్ ఫోరెన్సిక్ విద్యార్థిని

» ఆ జ్ఞానంతోనే హత్యకు ప్లాన్..అగ్నిప్రమాదంగా చిత్రీకరణ


రాంకేశ్ మీనా, అమృత చౌహాన్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: యూపీలోని మొరాదాబాద్‌కు చెందిన ఫోరెన్సిక్ విద్యార్థిని, తన మాజీ ప్రియుడితో కలిసి ప్రస్తుత సహజీవన భాగస్వామిని కిరాతకంగా హత్య చేసి, ఆపై అగ్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించిన ఘటన ఢిల్లీలో వెలుగు చూసింది. ఢిల్లీలోని గాంధీ విహార్‌లో ఈ నెల మొదటివారంలో ఓ అపార్ట్‌మెంట్‌లో కాలిపోయిన స్థితిలో లభ్యమైన యూపీఎస్సీ అభ్యర్థి రాంకేశ్ మీనా హత్యకేసును పోలీసులు సోమవారం ఛేదించారు. ఫోరెన్సిక్ విద్యార్థిని అమృతా చౌహాన్(21), రాంకేశ్ మీనా(32)తో గత మే నుంచి సహజీవనంలో ఉంది. తన ప్రైవేటు వీడియోలను మీనా రహస్యంగా రికార్డ్ చేశాడని అమృత గుర్తించింది. డిలీట్ చేయమని పదేపదే విజ్ఞప్తి చేసినా మీనా నిరాకరించడంతో.. అమృత అతనికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది. మాజీ ప్రియుడు సుమిత్, మరో స్నేహితుడి సాయంతో హత్యకు వ్యూహ రచన చేసింది. అమృత ఫోరెన్సిక్ సైన్స్ నేపథ్యం, క్రైం వెబ్ సిరీస్‌ల పట్ల ఉన్న ఆసక్తితో ఆధారం దొరకకుండా హత్యకు ప్లాన్ చేసింది. సుమిత్ వంట గ్యాస్ సిలిండర్ డిస్ట్రిబ్యూటర్. వారి స్నేహితుడు సందీప్ కుమార్‌తో కలిసి అక్టోబర్ 5న మొరాదాబాద్ నుంచి ఢిల్లీలోని మీనా అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. మీనాను కొట్టి, ఆపై గొంతు నులిమి చంపారు. మృతదేహంపై మంటలు వేగంగా వ్యాపించడానికి బాధితుని శరీరంపై నెయ్యి, నూనె, ఆల్కహాల్ పోశారు. గ్యాస్ సిలిండర్ ద్వారా పేలుడు సృష్టించారు. పోలీసులు మొదట షార్ట్ సర్క్యూట్ లేదా ఏసీ పేలుడుగా భావించినప్పటికీ, ఫోరెన్సిక్ ఇతర ఆధారాలతో హత్యేనని నిర్ధారించుకున్నారు. ప్రస్తుతం నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

టీడీపీ రాజోలు ఇన్‌చార్జికి వరకట్న వేధింపులు

» భర్త దొమ్మేటి సునీల్‌పై పోలీసులకు ఫిర్యాదు

» రెండుసార్లు హత్యాయత్నం... పిల్లల్నీ చంపేస్తానని, మార్ఫింగ్ ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులు

» బాధితురాలు అమూల్య గొల్లపల్లి సూర్యారావు కుమార్తె



రాజోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య తన భర్త నుంచి రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. వరకట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. 'భర్త దొమ్మేటి సునీల్ దురలవాట్లకు బానిసయ్యాడు. ఆయనతో నేనున్న ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని, పరువు తీస్తానని బెదిరిస్తున్నాడు. నన్ను, నా పిల్లలను చంపేస్తానని బెదిరించాడు. నా భర్త నుంచి నా పిల్లలకు, నాకు ప్రాణహాని ఉంది' అని అమూల్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఆమె సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై రెండుసార్లు హత్యాయత్నం చేశాడని వాపోయారు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకకు చెందిన అమూల్య... వైసీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు పెంపుడు కుమార్తె. ఆమెకు, దొమ్మేటి సునీల్‌తో 2009, మార్చి 4న పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరిది కులాంతర వివాహం. వీరికి ఇద్దరు అబ్బాయిలు. పెళ్లి సమయంలో కట్నం కింద రూ.50 లక్షల నగదు, 100 తులాల బంగారు ఆభరణాలు, ఎకరం భూమి ఇచ్చారు. పెళ్లి తర్వాత కొంతకాలం బానే ఉన్న సునీల్... ఆ తర్వాత డబ్బు కోసం వేధించసాగాడు. రూ.10 లక్షలు తేవాలంటూ హింసించాడు. ఆ బాధలు చూడలేక అమూల్య తండ్రి సూర్యారావు దఫదఫాలుగా రూ.3 లక్షలు ఇచ్చారు. అమూల్య పేరున ఉన్న ఆస్తులను సునీల్ పేరుతో రాయించాలంటూ ఆమె అత్త దొమ్మేటి మణి డిమాండ్ చేసింది. 100 తులాల బంగారు ఆభరణాలు భర్త దగ్గరే ఉన్నాయి. ఆమె సిమ్‌కార్డును, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాలను సునీల్ తన ఈమెయిల్‌తో లింక్ చేసి భార్యపై నిఘా పెట్టాడు. మద్యం సేవించి ఆమెను చిత్రహింసలు పెట్టేవాడు. ఈఏడాది జూన్ 16న రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసి చంపాలని ప్రయత్నించాడు. తల్లిదండ్రులకు తెలియజేయగా పెద్ద సమక్షంలో భర్తను మందలించారు. తప్పు ఒప్పుకొని బానే ఉంటానని చెప్పిన సునీల్... పెద్దల దృష్టికి తీసుకొని వెళ్లినందుకు చిత్రహింసలు పెట్టాడు' అని అమూల్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తమిళనాడు, బెంగాల్‌లో ఎస్ఐఆర్!

మరో 10 రాష్ట్రాలు/యూటీల్లో కూడా.. 4 నుంచి రెండో దశ ఓటర్ల జాబితా సవరణ

» సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెల్లడి


మీడియా సమావేశంలో ఎస్ఐఆర్‌పై వివరాలను వెల్లడిస్తున్న జ్ఞానేశ్‌కుమార్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: దేశవ్యాప్తంగా రెండో దశ 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)'ను చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమబెంగాల్ సహా 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల్లో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపింది. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. తొలిదశలో బిహార్‌లో ఎస్ఐఆర్‌ను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. నవంబరు 4 నుంచి డిసెంబరు 4 వరకు రెండో దశ ఎస్ఐఆర్ చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబరు 9న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 7న ప్రచురిస్తామని వెల్లడించారు. రెండో దశలో అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ దశలో 51 కోట్ల మంది ఓటర్లు ఈ సవరణ పరిధిలోకి వస్తారన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్‌తో పాటు పుదుచ్చేరి, కేరళలో 2026లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా మోదీకి వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తున్న మమత, స్టాలిన్‌లు పాలిస్తున్న బెంగాల్, తమిళనాడుల్లో ఎస్ఐఆర్‌ను చేపట్టాలని నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. అయితే, అర్హులంతా ఓటరు జాబితాలో ఉండేలా చూడడం, అనర్హులందరినీ తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. 1951 నుంచి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని 8 సార్లు నిర్వహించారన్నారు. తాజాగా చేపట్టనున్న ఎస్ఐఆర్ కోసం అధికారులకు మంగళవారం నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బెంగాల్ ప్రభుత్వంతో తమకెలాంటి గొడవా లేదని, రాజ్యాంగ బద్ధంగా తాము విధులు నిర్వర్తిస్తున్నామని చెప్పారు. కేరళలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలన్న డిమాండ్లపై స్పందిస్తూ.. అక్కడ ఇంకా స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. కాగా, అసోంలో కూడా 2026లోనే ఎన్నికలు ఉన్నాయి. అయితే, అక్కడ ఎస్ఐఆర్‌పై విడిగా ప్రకటన చేస్తామని సీఈసీ చెప్పారు. "పౌరసత్వ చట్టం కింద అసోంలో పౌరసత్వానికి సంబంధించి ప్రత్యేక నిబంధనలు వర్తిస్తాయి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పౌరసత్వ గుర్తింపు ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది" అని జ్ఞానేశ్ తెలిపారు. రెండో దశ ఎస్ఐఆర్ ప్రకటనపై కాంగ్రెస్ స్పందించింది. ఈసీ ఇప్పుడు 12 రాష్ట్రాల్లో ఓట్ల చోరీకి సిద్ధమవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ధ్వజమెత్తారు. మరోవైపు, 'సర్'లో ఓటరు గుర్తింపునకు 12 పత్రాలను పేర్కొనగా అందులో ఆధార్ కూడా ఉంది. వీటితో పాటుగా బిహార్‌లో 'సర్' అనంతరం ప్రచురించిన ఓటరు జాబితాను కూడా గుర్తింపు పత్రంగా ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ ఎవరైనా ఈ 12 రాష్ట్రాల్లోని ఒకదాంట్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని అనుకుంటే, అలాంటి వారి తల్లిదండ్రుల పేర్లు బిహార్ తాజా ఓటరు జాబితాలో ఉంటే దానిని అసలైన ధ్రువపత్రంగా పరిగణిస్తారు. అలాంటి వారు పౌరసత్వ నిరూపణ కోసం కేవలం జననధ్రువపత్రాన్ని సమర్పిస్తే సరిపోతుంది.

ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కుట్ర: స్టాలిన్

ఎస్ఐఆర్ చేపట్టాలన్న ఈసీ నిర్ణయాన్ని ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రగా తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించారు. బీజేపీకి సాయం చేసేందుకు ఈసీ పౌరుల హక్కులను దోచుకుంటోందని ఆరోపించారు. బిహార్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల ఓట్లను తొలగించివేశారని విమర్శించారు. వచ్చే నెల 2న చెన్నైలో అఖిలపక్షం ఏర్పాటు చేసి, ఈసీ నిర్ణయంపై తదుపరి కార్యాచరణ గురించి చర్చిస్తామన్నారు. ఓటు హక్కును కాలరాసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా తమిళనాడు పోరాడి గెలుస్తుందని స్టాలిన్ చెప్పారు.

3 గంటల్లో 49 కోట్లు కొట్టేశారు..!

మనీ వ్యూ యాప్‌పై సైబర్ ముఠా పంజా

» ఏపీఐ సిస్టమ్‌లోకి చొరబడి కోట్లు బదిలీ

» ఇద్దరిని అరెస్టు చేసిన బెంగళూరు సీసీబీ పోలీసులు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత రుణాలు అందించే ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థకు చెందిన యాప్‌నకే సైబర్ నేరగాళ్లు మస్కా కొట్టారు. యాప్‌నకు చెందిన అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేజ్ (ఏపీఐ) సిస్టమ్‌లోకి చొరబడి.. 3 గంటల వ్యవధిలో రూ.49 కోట్ల మేర కొల్లగొట్టారు. హ్యాకర్లు ఏపీఐ కీని ఉపయోగించి సొమ్మును నకిలీ ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. ఈ సైబర్ ఘరానా మోసానికి సంబంధించి కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. సీసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. విజ్డమ్ అనే ఫైనాన్స్ కంపెనీ 'మనీవ్యూ' అనే యాప్‌ను నిర్వహిస్తోంది. ఆ యాప్‌ను దుబాయ్, చైనా, హాంకాంగ్, ఫిలిప్పైన్స్ దేశాల నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా లక్ష్యంగా చేసుకుంది. ఏపీఐ కీని ఉపయోగించి మూడు గంటల వ్యవధిలో రూ.49 కోట్ల మేర సొమ్మును వందలాది నకిలీ ఖాతాలకు బదిలీ చేశారు. దుబాయ్ కేంద్రంగా ఉండే భారత సంతతికి చెందిన ఓ వ్యక్తిని ఈ దాడికి మాస్టర్ మైండ్‌గా గుర్తించారు. ఇతను అక్కడి నుంచి సైబర్ దాడిని సమన్వయం చేశాడు. ఇందు కోసం బెళగావికి చెందిన ఇస్మాయిల్ రషీద్ అత్తార్ అనే వ్యక్తి నుంచి వర్చువల్ ప్రైవేట్ సర్వర్ల (వీపీఎస్) ఒక్కోదాన్ని రూ.2 వేల చొప్పున రెంట్‌కు తీసుకున్నారు. ఆ తర్వాత ఏపీఐ సిస్టమ్‌లోకి చొరబడేందుకు సర్వర్లను ఫ్రాన్స్‌కు చెందిన ఐపీ అడ్రస్‌తో లింక్ చేశారని అధికారులు వివరించారు. ఈ సైబర్ దాడికి సంబంధించి ఇస్మాయిల్ రషీద్ అత్తార్‌తో పాటు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన సంజయ్ పటేల్‌ను అరెస్టు చేశారు. వారిద్దరి నుంచి ల్యాప్‌టాప్‌లు, పెన్‌డ్రైవ్‌లు సీజ్ చేశారు. అలాగే నకిలీ ఖాతాల్లోకి బదిలీ అయిన రూ.10 కోట్ల మేర అధికారులు ఫ్రీజ్ చేశారు. ఈ గ్యాంగ్‌కు సంబంధించి దుబాయ్‌లో ముగ్గురు, హాంకాంగ్‌లో ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వీరిని పట్టుకొనేందుకు అంతర్జాతీయ ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నట్లు సీసీబీ పోలీసులు తెలిపారు.

లోకం తీరు



లండన్‌లో భారత సంతతి యువతిపై అత్యాచారం!

» జాత్యహంకారంతో రగిలిపోయి దుశ్చర్యకు పాల్పడ్డ దుండగుడు

» బాధితురాలు 20 ఏళ్ల పంజాబీ యువతి

లండన్, అక్టోబరు 27: బ్రిటన్‌లో దారుణం జరిగింది. జాత్యహంకారంతో రగిలిపోయిన ఓ వ్యక్తి, భారత సంతతికి చెందిన 20 ఏళ్ల యువతిని తీవ్రంగా కొట్టి, ఆమెపై దారుణ అత్యాచారానికి పాల్పడ్డాడు. లండన్‌కు దగ్గర్లోని వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ పరిధిలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. వాల్సల్‌లోని పార్క్ హాల్ ప్రాంతంలో బాధితురాలు నివసిస్తోంది. తలుపులు బద్దలు కొట్టి మరీ యువతి ఇంట్లోకి చొరబడ్డ దుండగుడు, ఆమెపై ఘోరానికి పాల్పడ్డాడు. "ఇది యువతిపై జరిగిన అత్యంత భయానకమైన దాడి" అని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం సీసీ ఫుటేజీని పరిశీలించాయి. ఈ మేరకు పొట్టి జుట్టు, నల్లని దుస్తులతో పార్క్‌లో తచ్చాడుతున్న 32 ఏళ్ల వయసున్న ఓ శ్వేత జాతీయుడిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి తాలూకు సీసీ ఫుటేజీని విడుదల చేశారు. బాధితురాలు పంజాబీ యువతి అని స్థానిక సిక్కు సమాఖ్య పేర్కొంది. అత్యాచార ఘటన తనను తీవ్రషాక్‌కు గురిచేసిందని ప్రవాస భారతీయురాలు, వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ సభ్యురాలు ప్రీతీకౌర్ పేర్కొన్నారు. వెస్ట్ మిడ్‌లాండ్స్‌లో పదే పదే మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబరు 9న వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌లో 20 ఏళ్ల యువతిపై జాత్యాహంకారంతో పెట్రేగిపోయిన ఓ 49 వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని, 65 ఏళ్ల మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

డిజిటల్ అరెస్టు కేసులు సీబీఐకే

» దర్యాప్తును పర్యవేక్షిస్తాం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 27: దేశంలో ఆందోళనకరంగా మారిన డిజిటల్ అరెస్టు కేసులన్నింటి దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి మోసాలకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన కేసుల వివరాలను తమకు సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. హరియాణాకు చెందిన ఓ వృద్ధ దంపతులను సైబర్ మోసగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.1.05 కోట్లు దోచుకున్న ఘటనపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం సుమోటోగా విచారణ జరుపుతోంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి దుండగులు ఈ మోసాలను నడిపిస్తున్నారన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఇటువంటి కేసులను దర్యాప్తు చేసేందుకు సీబీఐ తగిన ప్రణాళికతో ముందుకు రావాలని నిర్దేశించింది. ఈ దర్యాప్తును తాము పర్యవేక్షిస్తామని, ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేస్తామని తెలిపింది. దర్యాప్తు కోసం సైబర్ నిపుణులు వంటి మరిన్ని వనరులేవైనా అవసరమైతే చెప్పాలని సీబీఐకి సూచించింది. కాగా, డిజిటల్ అరెస్టు అనేది దేశ పౌరులకు అత్యంత భయంకరమైన ముప్పుగా పరిణమించిందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. మోసగాళ్లు తాము విచారణ అధికారులమని, బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడతారని, కేసులను ఎదుర్కోకుండా ఉండాలంటే జరిమానా, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలంటూ ప్రజలను మభ్యపెడతారని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

బంగ్లా మ్యాప్‌లో ఈశాన్య రాష్ట్రాలు

భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన యూనస్.. 'ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్' పుస్తకంపై వక్రీకరించిన మ్యాప్

» పాక్ జనరల్ షంషాద్ మీర్జాకు పుస్తకం బహూకరణ


షంషాద్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న యూనస్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ మరో దౌత్య వివాదానికి తెరలేపారు. అధికారం చేపట్టినప్పటి నుంచి భారత్‌పై విషం చిమ్ముతూనే ఉన్న ఆయన తాజాగా భారత ఈశాన్య ప్రాంత సమస్యలోకి అడుగుపెట్టడం ద్వారా మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌లో భాగంగా చూపిస్తూ ఉన్న వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు బహూకరించారు. పాక్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్‌పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా ఇటీవల ఢాకాలో యూనస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్' అనే పుస్తకాన్ని యూనస్.. మీర్జాకు బహూకరించారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలను యూనస్ ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఆ పుస్తకం కవర్‌పేజీపై వక్రీకరించిన బంగ్లాదేశ్ మ్యాప్ కనిపించడం తాజా వివాదానికి కారణమైంది. ఈ మ్యాప్ భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ భూభాగంలో భాగంగా చూపించడం భారత్ ఆగ్రహానికి కారణమైంది. భారత సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక చీఫ్ చర్యలపై సోషల్ మీడియాలో విశ్లేషకులు, జర్నలిస్టులు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ఇంకా స్పందించలేదు.

యూనస్.. ఇదే తొలిసారి కాదు

ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా పర్యటన సందర్భంగా.. 'ఈశాన్య భారతదేశం భూపరివేష్టితమై ఉన్నందున.. వారు సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదు. కాబట్టి ఈ ప్రాంతంలో సముద్రానికి మేమే ఏకైక సంరక్షకులం' అని అన్నారు. అయితే దీనిపై భారత్ అప్పట్లోనే దీటుగా బదులిచ్చింది. భారతదేశ ఈశాన్య ప్రాంత ప్రాముఖ్యతను విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌తోపాటు భూటాన్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలతో సరిహద్దు సంబంధం ఉన్న ఈ ప్రాంతం బిమ్‌స్టెక్ కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అలాగే బంగ్లాదేశ్ వస్తువులను భారత భూభాగం నుంచి భూటాన్, నేపాల్, మయన్మార్‌లకు తరలించడానికి అనుమతించే ట్రాన్స్‌షిప్‌మెంట్ ఒప్పందాన్ని కూడా భారత్ రద్దు చేసుకుంది.

జకీర్ నాయక్‌కు ఆహ్వానం!

ఢాకా ఉగ్రదాడి తర్వాత తొమ్మిదేళ్లకు వివాదాస్పద మతబోధకుడు, భారత్ నుంచి పరారైన జకీర్ నాయక్ నవంబరు 28నుంచి సుమారు నెల రోజులపాటు బంగ్లాదేశ్‌లో పర్యటించేందుకు యూనస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. 2016లో ఢాకాలోని హోలీ ఆర్టిసన్ బేకరీ వద్ద ఉగ్రదాడి జరిగింది. యూట్యూబ్‌లో జకీర్ నాయక్ ప్రసంగాలు విని ప్రేరణ పొందానని ఆ ఉగ్రదాడి నిందితుల్లో ఒకరు దర్యాప్తు అధికారులకు వెల్లడించిన నేపథ్యంలో నాటి షేక్ హసీనా ప్రభుత్వం జకీర్ నాయక్ నేతృత్వంలోని పీస్ టీవీ ప్రసారాలను బంగ్లాదేశ్‌లో నిషేధించింది. విద్వేష ప్రసంగాలతో మతాల మధ్య చిచ్చు పెట్టారంటూ అతనిపై భారత్‌లోనూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

మా ఆదేశాలపై ఇంత నిర్లక్ష్యమా?

» కుక్కలకు ఇంజక్షన్లు వేయించాలన్న ఆదేశాలను పట్టించుకోరా?

» 3వ తేదీన మా ముందుకు రండి

» రాష్ట్రాల సీఎస్‌లకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సుప్రీంకోర్టు మండిపడింది. వాటిని ఎక్కడికక్కడ పట్టుకుని.. స్టెరిలైజ్ ఇంజక్షన్లు చేసి విడిచిపెట్టాలని, దీనిపై అఫిడవిట్లు దాఖలుచేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆగస్టు 22న ఆదేశాలు జారీచేస్తే.. తమిళనాడు, బెంగాల్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ తప్ప మిగతా రాష్ట్రాలు, యూటీలేవీ ఇంతవరకు అఫిడవిట్లు వేయకపోవడాన్ని ఆక్షేపించింది. ఆ మిగతా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులంతా వచ్చే నెల 3వ తేదీన జరిగే విచారణ సందర్భంగా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. జంతువుల జనన నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా కుక్కల షెల్టర్లు, అందుబాటులో ఉన్న వెటర్నరీ డాక్టర్లు, కుక్కలు పట్టే సిబ్బంది, ప్రత్యేక వాహనాలు, బోన్లు తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్రాలు, యూటీల పురపాలక అధికారులను ఆగస్టు 22న ఆదేశించింది. ఈ ఆదేశాలు జారీచేశాక కూడా పలు చోట్ల వీధికుక్కల దాడులు జరిగాయని తెలిపింది. 'గత నెలలో మహారాష్ట్రలోని పుణేలో ఓ చిన్నారిపై దాడిచేశాయి. అంతకు కొన్ని రోజుల ముందు భండారా జిల్లాలో 20 కుక్కలు ఓ అమ్మాయిపై దాడిచేశాయి. గత వారం కేరళలో కన్నూర్ జిల్లాలో వీధికుక్కలపై వీధినాటకం ప్రదర్శిస్తున్న వ్యక్తిపైనే దాడిచేశాయి. యూపీలోని లఖ్‌నవూలో ఒకే కుటుంబంలో ముగ్గురిని కరిచాయి. గత 48 గంటల్లో తెలంగాణలోని వరంగల్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అయినా రాష్ట్రప్రభుత్వాల నుంచి స్పందన లేదు. ఆగస్టు 22న మేమిచ్చిన ఆదేశాలపై విస్తృతంగా ప్రచారం జరిగింది. రెండు నెలలు గడువిచ్చినా స్పందన లేదు. అధికారులు దినపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియాలో చూడడం లేదా? పేరుపేరునా నోటీసులివ్వాలా' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. 3వ తేదీన సీఎస్‌లు తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వకుంటే.. బహిరంగంగా కోర్టు నిర్వహిస్తామని హెచ్చరించింది. 3న అఫిడవిట్ వేస్తామని ఢిల్లీ ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలుపగా.. 'ఆయన అఫిడవిట్ వేస్తే వేయనివ్వండి. ఆయన రాకుంటే ఖర్చులు విధించడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయి' అని పేర్కొంది.


అన్ని విధాలా ఆదుకుంటా

» 'కరూర్' మృతుల కుటుంబాలకు విజయ్ హామీ

చెన్నై, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబాలకు తాను అన్నివేళలా అండగా ఉంటానని, అన్ని విధాలా ఆదుకుంటానని తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత, సినీ నటుడు విజయ్ భరోసా ఇచ్చారు. గతనెల 27వ తేదీన తొక్కిసలాటలో మృతిచెందినవారి కుటుంబీకులను విజయ్ సోమవారం మహాబలిపురం సమీపంలోని ఓ రిసార్ట్‌కు పిలిపించుకుని పరామర్శించారు. రిసార్ట్‌లోని 50 గదుల్లో బాధిత కుటుంబసభ్యులకు బస కల్పించిన విజయ్.. ఒక్కో కుటుంబంతో సుమారు పావుగంట సేపు మాట్లాడారు. వారితో మాట్లాడేటప్పుడు విజయ్ భావోద్వేగానికి గురయ్యారు. వారి ఇళ్లకు వెళ్లకుండా మహాబలిపురానికి పిలిపించుకుని పరామర్శించడంపై క్షమాపణ తెలిపారు. పరిస్థితులు అనుకూలించనందునే అందరినీ మహాబలిపురానికి పిలిపించుకోవాల్సి వచ్చిందని వివరించారు. మృతుల కుటుంబాలకు జరిగిన నష్టం చెప్పనలవికాదన్నారు. బాధితుల కుటుంబాల్లో ఒకడిగా ఉంటూ, వారి కష్టనష్టాల్లో పాలుపంచుకుంటానని, వారి బాగోగులకు అయ్యే ఖర్చులన్నింటినీ తాను భరిస్తానని హామీ ఇచ్చారు.

సుప్రీం తదుపరి సీజేగా జస్టిస్ సూర్యకాంత్!

» ఆయన పేరును కేంద్రానికి సూచించిన చీఫ్ జస్టిస్



న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును సిఫారసు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ లేఖ రాశారు. సంప్రదాయం ప్రకారం సుప్రీంకోర్టులోని సెకండ్ సీనియర్ మోస్ట్ జడ్జిని తన వారసుడిగా ప్రస్తుత చీఫ్ జస్టిస్ ప్రతిపాదించాలి. సీజే గవాయ్ తర్వాత జస్టిస్ సూర్యకాంతే సీనియర్. ఈ నేపథ్యంలో ఆయన పేరును జస్టిస్ గవాయ్ సిఫారసు చేశారు. ఈ సిఫారసును కేంద్ర న్యాయశాఖ ఆమోదించి తత్సంబంధ ప్రక్రియను ప్రారంభిస్తే, 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నవంబరు 24న బాధ్యతలు చేపడతారు. దానికి ఒకరోజు ముందు, జస్టిస్ గవాయ్ పదవీకాలం ముగిస్తుంది. జస్టిస్ సూర్యకాంత్ 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. అంతా అనుకున్నట్టు జరిగితే ప్రధాన న్యాయమూర్తిగా ఆ పదవిలో ఆయన 15 నెలలు కొనసాగుతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీతో ఆయన పదవీకాలం ముగిస్తుంది.



పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయంలో జస్టిస్ సుజాత

పెదకాకాని మల్లన్నకు జస్టిస్ సుజాత ప్రత్యేక పూజలు

పెదకాకాని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత సోమవారం దర్శించారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆమె మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజ్ఞాన్‌కు ప్రతిష్ఠాత్మక అక్రిడిటేషన్



ఆచార్య నాగభూషణ్

గుంటూరు విద్య అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ మరో మైలురాయిని అందుకుంది. ఉన్నత విద్యా సంస్థలకు జాతీయస్థాయిలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో అర్హత కలిగిన అన్ని ప్రోగ్రాంలకు టైర్-1 అక్రిడిటేషన్ లభించిందని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. విజ్ఞాన్ యూనివర్సిటీ మొదటి నుంచి విద్యా నాణ్యతతో ముందుకు సాగుతోందన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో డాక్టర్ మేఘనా కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో మరో నిందితుడికి పోలీసు కస్టడీ

విజయవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మరో నిందితుడిని ఎక్సైజ్ కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. ఈ కేసులో 13వ నిందితుడిగా ఉన్న తిరుమలశెట్టి శ్రీనివాసరావును పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు విజయవాడలోని 6వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాద ప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి లెనిన్‌బాబు.. శ్రీనివాసరావును 5 రోజుల కస్టడీకి ఇస్తూ తీర్పునిచ్చారు. కాగా.. నకిలీ మద్యం కేసులో నిందితులకు నవంబరు ఆరో తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఆదేశాలు ఇచ్చారు. నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణను మూడో తేదీకి వాయిదా వేశారు.

దాచాలంటే కుదరదు!

ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, కళాశాలల సమాచారం సైట్‌లో!

- అడ్మిషన్ల నుంచి ఆడిట్ వరకు ఫీజులు, విరాళం, ఖర్చులు కూడా
- కోర్సులు, ఫ్యాకల్టీ, వీసీ వివరాలు, క్యాంపస్ విస్తీర్ణం కూడా చెప్పాల్సిందే
- లాగిన్, పాస్‌వర్డ్‌లకు చాన్స్ లేదు
- ఉన్నత విద్యామండలి కీలక ఆదేశం
- యూజీసీ మార్గదర్శకాలతో చర్యలు
- సమాచారం అప్‌లోడ్‌కు 31 ఆఖరు తేదీ

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల సమాచారంపై ఉన్నత విద్యామండలి కీలక ఆదేశాలు జారీ చేసింది. జాతీయ విద్యా విధానంలో భాగంగా యూజీసీ ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరించి ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇకపై ప్రతి యూనివర్సిటీ, అన్ని ఉన్నత విద్యా సంస్థలు తమ సమాచారాన్ని తప్పనిసరిగా ఆ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని తెలిపింది. ఈ నెల 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాల ప్రకారం ఆయా విద్యా సంస్థలకు సంబంధించిన సమాచారం మొత్తం వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. అడ్మిషన్లు, ఫీజులు, ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాలు, ఉన్నత విద్యా సంస్థ ఆర్థిక పరిస్థితి ఇలా అన్ని వివరాలను ప్రజలు, విద్యార్థులు చూసి తెలుసుకునేందుకు వీలుగా.. వారికి అర్థమయ్యేలా పేర్కొనాలి. ప్రస్తుతం ప్రైవేటు విద్యా సంస్థలు తమ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నాయి. ప్రతి విషయానికీ విద్యార్థులు ఆయా సంస్థల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పైగా ఏ కాలేజీ ఎలాంటి స్థితిలో ఉందో తెలుసుకునే సమాచారం కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదు. ఫలితంగా అడ్మిషన్ తీసుకునే సమయంలో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో యూజీసీ ఆదేశాలను అనుసరించి సమగ్ర సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి స్పష్టం చేసింది. విద్యా సంస్థ చిరునామా, ఆ సంస్థకు అఫిలియేషన్ ఎవరు ఇచ్చారు?, సంస్థ గవర్నింగ్ బాడీ, వీసీ, ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలు, డైరెక్టర్లు, హెచ్‌ఆర్, ఫైనాన్స్ వివరాలు అందుబాటులో ఉంచాలి.

కోర్సులు.. క్రెడిట్లు కూడా..

ఆయా విద్యాసంస్థలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వాటికి క్రెడిట్ల పంపిణీ, అభ్యసన ఫలితాలు, పరిశ్రమలతో అనుసంధానం, స్కిల్ కోర్సులు, అకడమిక్ పార్టనర్‌షిప్ వివరాలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఉన్నత విద్యామండలి తెలిపింది. ఎంత మంది ఫ్యాకల్టీ ఉన్నారు? వారిలో నిపుణులు, సంస్థ పరిశోధన అంశాలు కూడా అందుబాటులో ఉంచాలి. అడ్మిషన్ల పాలసీ, ప్రవేశ పరీక్షలు, సీట్ల వివరాలు, ఫీజులు, ఉపకార వేతనాలు, విదేశీ సంస్థలతో ఒప్పందాలు, అంతర్జాతీయ విద్యార్థుల వివరాలను కూడా స్పష్టం చేయాలి. అలాగే, క్యాంపస్ ఎంత విస్తీర్ణంలో ఉంది?. అందులో భవనాల విస్తీర్ణం ఎంత?. తరగతి గదుల పరిమాణం, లైబ్రరీ, డిజిటల్ ఇన్‌ఫ్రా, గ్రీన్ క్యాంపస్, సీసీటీవీలు, విద్యార్థినుల భద్రత వివరాలు కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. విద్యా సంస్థ వార్షిక బడ్జెట్, గత మూడు సంవత్సరాల ఆడిట్ స్టేట్‌మెంట్లు, ఆదాయ మార్గాలు, గ్రాంట్లు, ఫీజులు, విరాళాలు, వాటిని ఎలా వినియోగించారు అనే సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచాలి. విద్యా సంస్థలకు న్యాక్, ఎన్‌బీఏ, ఇతర జాతీయ సంస్థల ర్యాంకింగ్ వివరాలు కూడా వెల్లడించాలి. ఈ వివరాలను చూసుకునేందుకు ఎలాంటి లాగిన్, పాస్‌వర్డ్ వంటివి పెట్టకూడదు. ప్రజలకు సులభంగా కనిపించేలా సమాచారం ఉండాలని మండలి స్పష్టం చేసింది. ప్రతి సెమిస్టర్‌కు సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని పేర్కొంది. చివరిసారిగా ఎప్పుడు అప్‌డేట్ చేశారో కూడా పేర్కొనాలి. అలాగే ఈ సమాచారం డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని కూడా స్పష్టం చేసింది.

దుర్గగుడిలో జోగి అత్యుత్సాహం

- నకిలీ మద్యం కేసుతో సంబంధం లేదంటూ అమ్మవారి మీద ప్రమాణం... భక్తుల ఆగ్రహం



కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రమాణం చేస్తున్న మాజీ మంత్రి జోగి రమేశ్

విజయవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రాంగణంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ అత్యుత్సాహం ప్రదర్శించారు. తనకు నకిలీ మద్యం కేసులో ఎటువంటి సంబంధం లేదని ఆయన కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రమాణం చేశారు. సోమవారం కనక దుర్గమ్మను జోగి రమేశ్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. టోల్‌గేట్ సమీపంలో ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద దీపం వెలిగించిన జోగి... 'నకిలీ మద్యం కేసులో నా ప్రమేయం లేదు. నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారు. వారికి మంచి బుద్ధి ప్రసాదించాలి' అని ప్రమాణం చేశారు. జోగి రమేశ్ వ్యవహార శైలి పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేవస్థానం ప్రాంగణంలో రాజకీయాలా..?

పవిత్రమైన కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో రాజకీయ ఉపన్యాసాలు, ఆరోపణలు చేయరాదని దేవస్థానం పాలకమండలి పేర్కొంది. దుర్గగుడి ఆలయ ప్రాంగణంలోని ఘాట్ రోడ్డు, కామధేను అమ్మవారి ఆలయం, మహామండపం, కనకదుర్గనగర్ ప్రాంతాలలో ఎటువంటి రాజకీయ అంశాలకు తావులేదని పాలక మండలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఐదేళ్ల చిన్నారి హత్య

- గొంతు నులిమి చంపిన పొరుగింటి వ్యక్తి
- బాలుడి తల్లిపై కోపంతో దారుణం



పెన్నయ్య



నాగ సుశాంత్

అనంతపురం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల చిన్నారిని దారుణంగా హత్య చేశాడో వ్యక్తి. భార్య తన నుంచి దూరం కావడానికి కారణమైందంటూ... మరో మహిళ కుమారుడిని దారుణంగా చంపేశాడు. అనంతపురం నగరంలోని అరుణోదయ కాలనీలో నివాసం ఉంటున్న గోవింద హరి, నాగవేణి దంపతుల కుమారుడు నాగ సుశాంత్ (5)ను పక్కింట్లో ఉంటున్న ఆటో డ్రైవర్ పెన్నయ్య దారుణంగా హత్య చేశాడు. ఈ నెల 25న అర్ధ రాత్రి గోవింద హరి దంపతులు సుశాంత్ నిద్రపోతుండగా ఇంట్లోనే వదిలేసి టిఫిన్ కోసం ఆర్టీసీ బస్టాండుకు వెళ్లారు. వారు తిరిగి వచ్చి చూసేసరికి బాబు ఇంట్లో కనిపించలేదు. ఆచూకీ దొరక్కపోవడంతో ఆదివారం అనంతపురం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గోవింద హరి ఇంటి సమీపంలో పెన్నయ్య, సావిత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. సావిత్రి, నాగవేణి స్నేహితులు. సావిత్రి భర్తతో గొడవ పడినపుడు నాగవేణి వారి ఇంటికి వెళ్లేది. తన భార్య సావిత్రికి లేనిపోనివి చెప్పి.. తమ మధ్య మనస్పర్థలు పెరిగేలా చేసిందని పెన్నయ్య.. నాగవేణిపై పగ పెంచుకున్నాడు. ఆమెపై ఎలాగైనా పగ తీర్చుకోవాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి బాబును ఇంట్లో ఉంచి నాగవేణి దంపతులు బయటకు వెళ్లడం గమనించాడు. బాబును ఎత్తుకెళ్లి గొంతు నులిమి చంపి గోనె సంచిలో చుట్టి దోబీ ఘాట్‌లోకి విసిరేశాడు. పోలీసుల దర్యాప్తులో హత్యోదంతం వెలుగు చూసింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీశైలంలోని పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం

శ్రీశైలం.. కార్తీక శోభితం

- వైభవంగా లక్ష దీపోత్సవం

శ్రీశైలం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం కార్తీక శోభ సంతరించుకుంది. పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాస తొలి సోమవారం కావడంతో శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి పుష్పాలతో అలంకరించిన వేదికపై ఉంచారు. అనంతరం దశ విధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగు వైపులా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

- వైకుంఠ ద్వార దర్శనాలపై నిర్ణయం

తిరుమల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం తిరుమలలో మంగళవారం జరుగనుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో అన్నమయ్య భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా వైకుంఠ ద్వార దర్శనాలపై చర్చించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన 10 రోజుల వైకుంఠ ద్వార దర్శనాలనే కొనసాగించాలా లేక పూర్వం నుంచి అమలవుతున్న ఏకాదశి, ద్వాదశికి మాత్రమే వైకుంఠ ద్వారాలను తెరిచి ఉంచాలా అనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో లేఅవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు మరో మూడు నెలల గడువు(జనవరి 23 వరకు) పొడిగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చింది.

'స్త్రీనిధి' ఇంటర్వ్యూలు వాయిదా

స్త్రీనిధిలో కాంట్రాక్టు ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల మంగళవారం(28వ తేదీ) నుంచి 31 వరకు నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలను తుఫాను కారణంగా వాయిదా వేసినట్లు స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ జీవీటీడీ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని డిసెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అయితే నవంబరు 1 నుంచి 29 వరకు నిర్వహించే షెడ్యూల్స్‌లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

వర్సిటీ స్కిల్ టెస్ట్ నవంబరుకు వాయిదా

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాల స్కిల్ టెస్ట్‌ను నవంబరు 5,6 తేదీలకు వాయిదా వేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధిక సోమవారం ఒక ప్రకటన తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29, 30వ తేదీల్లో స్కిల్ టెస్ట్ నిర్వహించాల్సి ఉందని, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో షెడ్యూల్‌ను మార్చామని తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజుల చెల్లింపునకు గడువు పెంపు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫీజులు చెల్లింపు గడువును ఇంటర్ విద్యామండలి పొడిగించింది. ఈ నెలాఖరు వరకు అపరాధ రుసుము లేకుండా, నవంబరు 6 వరకు రూ.వెయ్యి అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించవచ్చని తెలిపింది.



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు

దళితులను వేధించిన జగన్: ఎంపీ ప్రసాదరావు

- మడకశిరలో ఘనంగా విగ్రహాల ఆవిష్కరణ

మడకశిర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దళితులను వేధించడమే పనిగా జగన్ ఐదేళ్ల పాలన సాగించారని చిత్తూరు ఎంపీ ప్రసాదరావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లిలో బాబూజగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 15 మంది దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో చట్టాలను తుంగలోకి తొక్కారని, దళితులను అవమానించారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి, అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా ఉద్భవించిందని తెలిపారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. భారతదేశ తలరాతను మార్చింది బాబూ జగ్జీవన్‌రామ్ అనీ, ప్రపంచ దేశాల్లోకి ఉన్నత రాజ్యాంగాన్ని రచించి అందించిన మహానుభావుడు అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీధర్, కుమార రాజవర్ల, విజయచంద్ర, మురళీమోహన్, రోషన్, దస్తగిరి, జయసూర్య, విజయశ్రీ, ఎమ్మెల్సీ గ్రీష్మ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి పాల్గొన్నారు.

సానుకూల నిర్ణయం ఆశిస్తున్నాం

- ట్రాన్స్‌జెండర్ల రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు ధర్మాసనం
- కర్ణాటక విధానంపై అధ్యయనం చేసి వివరాలివ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు
- ధర్మాసనం ముందు హాజరైన హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. సమాజంలో వారు ఎదుర్కొంటున్న వివక్ష, అనుభవిస్తున్న మానసికవేదనను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ కల్పన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని, కర్ణాటక రాష్ట్రం ఒకశాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న విధానంపై అధ్యయనం చేస్తోందని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ చెబుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించేందుకు వీలుగా విచారణను నాలుగువారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018నాటి ఎస్‌ఐ పోస్టుల నోటిఫికేషన్‌లో ట్రాన్స్‌జెండర్‌కు ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ గంగాభవాని అనే ట్రాన్స్‌జెండర్ 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా నోటిఫికేషన్ ఉందని పేర్కొన్నారు. 'పిటిషనర్ పురుషుడిగా జన్మించారు. ఆ తరువాత లింగమార్పిడి ద్వారా ట్రాన్స్‌జెండర్‌గా మారారు. ఎస్‌ఐ ఉద్యోగ దరఖాస్తులో స్త్రీ, పురుష ఐచ్ఛికం మాత్రమే ఇవ్వగా, పిటిషనర్ స్త్రీగా ఐచ్ఛికాన్ని ఎంచుకున్నారు. ప్రాథమిక పరీక్ష రాసి బీసీ రిజర్వేషన్ కోటాలో 35 మార్కులు సాధించారు. అయితే అధికారులు తరువాతి ప్రక్రియకు అనుమతించలేదు' అని పిటిషనర్ తరఫు న్యాయవాది సాల్మన్‌రాజు నాడు వాదనలు వినిపించారు. వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ 2022 జనవరి 21న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ 2022 లో గంగాభవానీ ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌పై గత ఏడాది డిసెంబరు 12న విచారణ జరిపిన ధర్మాసనం.. రాష్ట్ర హోంశాఖ ఆధ్వర్యంలో నవంబరు 22 సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా గంగాభవాని ఉద్యోగంపై నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఈ నెల 6న జరిగిన విచారణకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి నివేదిక సమర్పించకపోవడంపై వివరణ ఇచ్చేందుకు నేరుగా హాజరుకావాలని ఆదేశించింది. అప్పీల్ సోమవారం మరోసారి విచారణకు రాగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్ ధర్మాసనం ముందు హాజరయ్యారు. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపిస్తూ.. 'ట్రాన్స్‌జెండర్ల విషయంలో 2017లోనే రాష్ట్ర ప్రభుత్వం ఓ పాలసీ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే పిటిషనర్ వినతిని తిరస్కరిస్తూ డీజీపీ ఉత్తర్వులు ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్లకు కర్ణాటక అమలుచేస్తున్న ఒక శాతం రిజర్వేషన్‌పై అధ్యయనం జరుగుతోంది. వివరాలు సమర్పించేందుకు సమయమివ్వండి' అని కోరారు.

5.44 లక్షల మంది రైతులకు ఆధార్ సీడింగ్ ఫీజు మినహాయింపు

- వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెబ్‌ల్యాండ్‌లో రైతుల సాగు భూముల ఆధార్ సీడింగ్‌లో లోపాలు సరిదిద్దేందుకు వీలుగా మీ-సేవ ఫీజు 50 రూపాయలు మినహాయింపు ఇస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వెబ్‌ల్యాండ్ పరిధిలోని రికార్డుల్లో 5.44 లక్షల మంది రైతుల భూముల రికార్డులతో ఆధార్ డేటా సరిగ్గా లేదు. కొందరు ఇతరుల ఆధార్‌ను సీడింగ్ చేయగా, మరికొందరు తప్పుగా చేశారు. దీని వల్ల ఆ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి ప్రయోజనం దక్కడం లేదు. ఈ నేపథ్యంలో ఆ రైతులకు ఒకసారి అవకాశం ఇచ్చి వెంటనే మీ-సేవా కేంద్రాల ద్వారా ఆధార్ సీడింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖలు కోరుతున్నాయి. రైతులకు ఊరట కల్పించేందుకు మీ-సేవలో చెల్లించే ఆధార్ సీడింగ్ ఫీజు 50 రూపాయలను మినహాయింపు ఇస్తూ సోమవారం రెవెన్యూ శాఖ ఇన్‌చార్జి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఆధార్ తప్పున్న 5.44 లక్షల మంది రైతులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏనే ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కసారి ఫీజు మినహాయింపు వల్ల సర్కారుకు 2.72 కోట్ల భారం పడనుంది.

రబీలో రాయితీ పశుగ్రాసానికి 25.16 కోట్లు

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో కరువు పరిస్థితులు ఏర్పడితే 50% రాయితీతో పశుగ్రాసం పంపిణీ చేయడానికి రూ.25.16 కోట్లు ఖర్చు చేయడానికి ప్రభుత్వం పరిపాలన ఆమోదం మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ది హేబిటాట్స్ ట్రస్ట్ సౌజన్యంతో సీఎంఎస్ వాతావరణ్ ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో 'ఆంధ్రప్రదేశ్ లైఫ్ ఫర్ నేచర్' సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ప్రీతి కశ్యప్ తెలిపారు.

స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

- రూ.410 కోట్లు విడుదల చేస్తూ గ్రామీణాభివృద్ధి సంస్థ ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థానికసంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.410 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.365 కోట్లు, అదనపు నిధులు మరో రూ.45 కోట్లు వెరసి మొత్తం రూ.410 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం వేరువేరుగా ఆదేశాలిచ్చింది.

సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి: ఆప్టా

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించేలా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

టెన్త్ పరీక్షల సాఫ్ట్‌వేర్ సంస్థ ఎంపికకు టెండరు

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా డేటా ప్రాసెసింగ్ చేసే సాఫ్ట్‌వేర్ సంస్థ ఎంపికకు టెండర్లు పిలవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం కమిటీని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పరీక్షలకు ముందు, పరీక్షల అనంతరం డేటా ప్రాసెసింగ్, ఫలితాల ప్రక్రియ, స్కానింగ్, మూల్యాంకనాన్ని డిజిటలైజ్ చేయడం, రీకౌంటింగ్‌కు దరఖాస్తులు, సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తుల అంశాల్లో ఈ సంస్థ పనిచేస్తుంది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, డైరెక్టర్ సభ్య కార్యదర్శిగా ఉంటారు.

సహాయ చర్యల్లో పాల్గొనండి: సీపీఐ

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నుంచి ప్రజలను రక్షించేందుకు ముందు జాగ్రత్త చర్యలు, సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాధితులకు అండగా నిలవాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టణ డిజిటల్ ప్లాన్ అమలుకు నోడల్ అధికారి

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ సేవలు మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్రంలో స్టేట్ అర్బన్ డిజిటల్ ప్లాన్ అమలుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ప్రామాణీకరణ సాధించడం, డూప్లికేషన్ లేకుండా చేయడం, పట్టణ పరిపాలనలో డిజిటల్ గవర్నెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్రం నేషనల్ అర్బన్ డిజిటల్‌ను ప్రారంభించడంతో రాష్ట్రంలో కూడా దీన్ని అమలు చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మృత్యుశకటాలు

కర్నూలు ఘోరప్రమాదానికి కారణమైన ఆ ప్రైవేటు బస్సు మూడు రాష్ట్రాల్లో తన రూపురేఖలు మార్చుకొని మూడుమార్లు రిజిస్టరైందని అధికారులు అంటున్నారు. డ్రైవర్ చదువు అర్హతల నుంచి యజమాని బాధ్యతారాహిత్యం వరకూ రోజుకో కొత్త అంశం వెలుగుచూస్తోంది. పందొమ్మిదిమంది ప్రయాణికులు నిస్సహాయస్థితిలో సజీవంగా తగలబడిపోయిన ఈ ఘోర దుర్ఘటనకు డ్రైవర్ నుంచి రవాణాశాఖ వరకూ ప్రతీ ఒక్కరూ బాధ్యులే. దీనికి పదిరోజుల ముందే, రాజస్థాన్ జైసల్మేర్‌లో ఇటువంటి ఘోరమే జరిగింది. బస్సులో అమర్చిన చవుకబారు ఎయిర్ కండిషనర్ నిప్పురాజేసిన కారణంగా భారీ ప్రాణనష్టం సంభవించింది. మొన్న ఆదివారం ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్ హైవేమీద ఒక బస్సు పూర్తిగా తగలబడి, ప్రయాణికులు అదృష్టవశాత్తూ బతికిబయటపడ్డారు. వేర్వేరు ఘటనలే అయినప్పటికీ, ఉల్లంఘనల్లో ఆరితేరిన ప్రైవేటు బస్సుల విషయంలో పర్యవేక్షక వ్యవస్థల ఉదాసీనతకు ఇవన్నీ తార్కాణాలు.

నగరాలు, మహానగరాలు ఉద్యోగ ఉపాధి అవకాశాల కేంద్రాలుగా వృద్ధిచెందుతున్నక్రమంలో, నల్లగా మెరిసే పలువరుసల జాతీయరహదారులమీద పరుగులుతీసే ఈ 'లగ్జరీకోచ్'ల సంఖ్య కూడా అతివేగంగా పెరుగుతూ వచ్చింది. రాత్రివరకూ ఉద్యోగం చేసుకొని, తెల్లారేసరికల్లా ఊళ్ళో వాలగలిగే వీలు వీటితో ఉంది. కొద్దిగంటల్లోనే గమ్యస్థానానికి చేర్చడం, అంతవరకూ సుఖంగా నిద్రించగల సదుపాయం ఉన్నందున ప్రయాణికులు సైతం సౌకర్యాన్ని పరిగణిస్తున్నారే తప్ప ఈ లగ్జరీ బస్సుల అతివేగాన్నీ, ప్రమాదావకాశాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. గంటకు 80కిలోమీటర్లు కూడా దాటని ఆర్టీసీ బస్సుల్లో అధిక సమయం పట్టడమే కాదు, ఎక్కడపడితే అక్కడ ఆగవు, ప్రైవేటు బస్సుల మాదిరిగా హంసతూలికాతల్పాలూ హంగులూ ఆర్భాటాలూ కూడా వాటిలో కనబడవు. మిగతా కంపెనీ బస్సులతో పోటీపడేందుకూ, అధికసంపాదనకూ వీలుగా ప్రైవేటు బస్సులన్నీ ప్యాసింజర్ల కంఫర్ట్ పేరిట సీట్లు, రగ్గుల నుంచి, నాజూకైన కిటికీ తెరలవరకూ అన్నింటికీ భగ్గునమండే మెటీరియల్‌నే వాడతాయి. బస్సులో ఏసీలు, టీవీలు, మొబైల్ చార్జింగ్ యూనిట్లు వంటివి కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఒక చిన్న నిప్పురవ్వను కార్చిచ్చుగా మార్చేందుకు కూడా ఇవన్నీ దోహదం చేస్తున్నాయి. ఇక, ప్రైవేటు బస్సు గర్భంలో ఏ విష రసాయనాలు దాగివున్నాయో, ఏ విస్ఫోటక పదార్థాలు పేలడానికి సిద్ధపడుతున్నాయో ఎవరికీ తెలియదు. భూమికి అంత ఎత్తున ఉండే ఈ లగ్జరీ కోచ్‌ల ఇరుకైన నిర్మాణం ప్రమాదం జరిగినవెంటనే తప్పించుకొనేందుకు అవకాశం ఇవ్వదు. రాకపోకలకు ఒకే రాజమార్గం తప్ప, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అగ్నిమాపకయంత్రాలు, అద్దాలుబద్దలు కొట్టే హేమర్లు ఉండవు. ఉన్నా కూడా, నిద్రలోంచి మేలుకొని, ఏదో జరిగిందని గుర్తించేలోగానే విషవాయువులు కమ్ముకుంటాయి. ఊపిరాడని ఆ స్థితిలో తోపులాటల మధ్యన ప్రయాణికులు ప్రాణాలు వదిలేయాల్సి వస్తోంది.

లాభమే ప్రైవేటుకు పరమావధి కనుక అన్ని విధాలైన ఉల్లంఘనలూ జరుగుతున్నాయి. ఫ్యాక్టరీ ప్రమాణాలకు, రిజిస్ట్రేషన్ నిబంధనలకు పూర్తి భిన్నంగా డిజైన్, సీటింగ్, బాడీ ఇత్యాదివన్నీ మారిపోతున్నాయి. బయలుదేరేటప్పుడు అనేకచోట్ల ఆగుతూ, ఆలస్యంగా ప్రయాణం మొదలెట్టే ఈ లగ్జరీకోచ్‌లు గమ్యస్థానాన్ని మాత్రం ఎంతోముందు చేరుకుంటాయి. గమ్యం కాదు, వేగమే వీటి లక్ష్యం కనుక, నిర్లక్ష్యంగా నడిపేవారినీ, మద్యానికి అలవాటుపడ్డవారినీ, తగిన అనుభవం లేని వారిని డ్రైవర్లుగా కూచోబెట్టడానికి కూడా యజమానులు సందేహించరు. కనీస విశ్రాంతి ఇవ్వకుండా వారితో గొడ్డుచాకిరీ చేయించుకోవడానికీ వెనుకాడరు. ఏఐ నుంచి అత్యాధునిక సాంకేతికతలవరకూ హైవేలమీద వేటిని వినియోగించినా, ప్రయాణికుల ప్రాణాలపట్ల బస్సు యజమానులకు కాస్తంత ప్రేమ, బాధ్యత లేనిదే ఈ ప్రమాదాలను నివారించడం అసాధ్యం. భద్రతకంటే లాభార్జనకే ప్రాధాన్యం ఇచ్చే ఈ వ్యవస్థను దాడులు, తనిఖీలు, నిరంతర పర్యవేక్షణతోనే నియంత్రించడం సాధ్యం. ఆర్టీసీ తరహాలో స్పీడ్‌లాక్ అమలు చేసి, నిబంధనలను ఉల్లంఘిస్తున్నవారిని కఠినంగా శిక్షించాలి. విమానాల్లో మాదిరిగా ప్రయాణికులకు క్షేమంగా బయటపడే మార్గాలను ముందుగా తెలియచెప్పాలి. ప్రతీ ప్రమాదానికీ మానవనిర్లక్ష్యమే కారణం. ప్రతీ తప్పిదం మనకు ఒక పాఠం కావాలి. ప్రజాభద్రత ప్రభుత్వాల బాధ్యత. దానిని నష్టపరిహారాలకు పరిమితం చేయడం సరికాదు.

బాలలకు 'కృత్రిమ మేధ' అవసరమా?



వచ్చే విద్యా సంవత్సరం (2026–27)లో పాఠశాల విద్యలో మూడవ తరగతి నుంచి కృత్రిమ మేధ (ఏఐ) పాఠ్యాంశాలను ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ప్రకటించింది. డిజిటల్ టెక్నాలజీల ఏకీకరణతో రూపొందే ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా భావి శ్రామికశక్తిని తీర్చిదిద్దే లక్ష్యంతో పాఠశాల స్థాయి నుంచి ఏఐ పాఠ్య ప్రణాళికను అమలు పరచనున్నట్టు కేంద్రం వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రాల విద్యా మంత్రిత్వశాఖలు కూడా ఏఐ పాఠ్య ప్రణాళికలను రూపొందించేందుకు పూనుకున్నాయి.

విద్యార్థులకు ఏఐ పరిజ్ఞానాన్ని బోధించేందుకు కేంద్ర ప్రభుత్వం జూలై 2025లో 'SOAR Initiative (Skilling for AI Readiness)'ను ప్రారంభించింది. దీని ద్వారా సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)కు అనుబంధంగా ఉన్న దాదాపు 18 వేల పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి ఏఐను ఒక 'నైపుణ్య విషయం'గా బోధిస్తున్నారు. 6, 7, 8 తరగతులకు మూడు విభిన్న '15 గంటల' బోధనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కృత్రిమ మేధపై బాలలకు అవగాహన కలిగించడం, దానిని ఆచరణాత్మకంగా అనువర్తింప చేయడం, ఏఐ వినియోగంలో ఉత్పన్నమయ్యే సామాజిక చిక్కులను పిల్లలు అర్థం చేసుకోవడమే ఈ కార్యక్రమాల లక్ష్యంగా ఉన్నది. ఇక 9, 10, 11, 12 తరగతులకు '150 గంటల' ఎలెక్టివ్ కోర్సుల (విద్యార్థులు తమ వ్యక్తిగత ఆసక్తులు, భావి వృత్తి జీవిత లక్ష్యాలు లేదా తమ ప్రధాన పాఠ్యాంశాలతో సంబంధం లేకుండా కొత్త విషయాలను అధ్యయనం చేయడం ఆధారంగా ఎంచుకునే ఐచ్ఛిక కోర్సులు)ను బోధిస్తున్నారు. చాలా కొద్ది విశ్వవిద్యాలయాలు ఈ ఏడాది సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ కోర్సులను తప్పనిసరి చేశాయి. సమస్త విద్యా విభాగాలకు ఏఐ బోధన తప్పనిసరి కాదు. కనుక ఆలోచనాపరులు ఒక ప్రశ్న అడిగి తీరాలి: పాఠశాలల్లో ఏఐ బోధనకు ఇంత తొందర ఎందుకు? కృత్రిమ మేధ మన జీవితాలను పలు విధాలా ప్రభావితం చేయనున్నదనడంలో సందేహం లేదు. 'ప్రపంచ ఏఐ ప్రమాణాలను రూపొందించడంలోను, ఏఐ సాంకేతికతల అభివృద్ధి, అనువర్తనాలలోను ప్రధాన పాత్ర వహించాలని భారత్ ఆకాంక్షిస్తోంది. దీనిపై ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. అయితే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏఐ బోధన తప్పనిసరా?

డిజిటల్ అంతరాలను తగ్గించేందుకు, గ్రామీణ ప్రాంతాల; వనరులు తక్కువగా ఉన్న సామాజిక వర్గాల విద్యార్థులకు అవకాశాలను అందించేందుకు 'SOAR Initiative' ఇతోధికంగా తోడ్పడుతుందని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డిజిటల్ సాధనాలను ఉపయోగించనివారు, అసలు వాటిని ఎలా ఉపయోగించాలో తెలియని విద్యార్థులు, ఉపాధ్యాయులే మన విద్యారంగంలో అత్యధికంగా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో డిజిటల్ అంతరాలను తగ్గించడమనే లక్ష్యం నెరవేరుతుందా? ఒక సాదృశ్యంతో ఈ విషయాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం. గత మూడు దశాబ్దాలుగా మొబైల్ ఫోన్ మన జీవితాలను అనేక రీతుల్లో అమితంగా ప్రభావితం చేస్తోంది. మన వైయక్తిక జీవితాలనే కాకుండా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను మౌలికంగా మార్చివేసింది. అంతమాత్రాన 'మొబైల్ ఫోన్ ఎలా పనిచేస్తుంది?' అనే అంశాన్ని బాలలకు మూడవ తరగతి నుంచే బోధించి తీరాలా? మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాల్సిన తీరుతెన్నులను పాఠశాల బాలలకు బోధించాలి. అయితే ఎప్పుడు? ఆ సాంకేతికతను మెరుగ్గా అర్థం చేసుకుని, ఉపయోగించుకోగల సామర్థ్యాన్ని అలవరచుకున్నప్పుడు. భద్రంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడాన్ని బాలలకు పాఠశాలలు నేర్పాలి. అది సమకూర్చే విద్యా ప్రయోజనాలను బాలలు పొందగలిగేలా చూడాలి.

'పాఠశాలల్లో ఏఐ బోధన' అనే మాటను పలువురు పలు విధాలుగా ఉపయోగిస్తున్నారు. ఉద్దేశించిన అర్థాల వెనుక ఉన్న గణనీయమైన గందరగోళాన్ని ఆ మాట దాచిపెడుతోంది. 'ఏఐ అక్షరాస్యత' అని కొంత మంది అస్పష్టంగా నిర్వచిస్తుండగా మరికొంత మంది తరగతి గదుల్లో ఏఐ సాధనాలను మరింత ఎక్కువగా ఉపయోగించాలనే అర్థంలో ఆ మాటను వాడుతున్నారు. ఉపాధ్యాయుల బోధనా కౌశలాలు, ఇతర విధుల నిర్వహణా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏఐను ఉపయోగించుకోవాలనే అర్థంలో వాడుతున్నారు. వ్యక్తిగతీకరించిన అభ్యాసం (Personalised learning- ప్రతి విద్యార్థి ప్రత్యేక అవసరాలు, ఆసక్తులు, సామర్థ్యాలను తీర్చడానికి బోధనా పద్ధతులు, బోధనాంశాలను అనుకూలంగా చేసే విద్యా విధానం) గురించి ఏఐని అభివృద్ధిపరుస్తున్న నిపుణులు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యక్తిగత విద్యా పురోగతి గురించి మాట్లాడుతోంది. ఈ అయోమయ పరిస్థితిలో సమగ్ర అవగాహనతో ఏఐ సాధనాలను ఉపయోగించడాన్ని బాలలకు ఏఐని బోధించడం నుంచి తప్పని సరిగా వేరు చేయాలి.

ప్రస్తుతం అమలుపరుస్తున్న ఏఐ పాఠ్య ప్రణాళికను నిశితంగా పరిశీలిద్దాం. ప్రాథమికోన్నత పాఠశాల ఏఐ పాఠ్య ప్రణాళిక మూడు ఏఐ సాంకేతిక విభాగాలను ప్రవేశపెట్టింది. అవి: కంప్యూటర్ విజన్, సహజ భాషా ప్రాసెసింగ్, స్టాటిస్టికల్ డేటా. ఏడవ తరగతి పాఠ్య పుస్తకం సుస్థిరాభివృద్ధికి పరిస్థితులను అనుకూల పరచడంలోను, సామాజిక అభివృద్ధి సాధనలోను ఏఐ వినూత్న పాత్ర గురించి ప్రముఖంగా ప్రస్తావించింది. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సిస్టమ్స్ థింకింగ్ (సమస్యల పరిష్కారానికి సమగ్రమైన రీతిలో ఆలోచించడం), సిస్టమ్స్ మ్యాప్స్ (ఒక సంక్లిష్ట వ్యవస్థ భాగాలు ఎలా పరస్పరం అనుసంధానమై ఉన్నాయో వివరించే దృశ్య ప్రాతినిధ్యాలు) మొదలైన భావనలకు కూడా ప్రాధాన్యమిచ్చింది. 8వ తరగతి విద్యార్థులు 'ఏఐ ప్రాజెక్టులు', 'ఏఐ నైతికత, బాధ్యతాయుతమైన ఏఐ ఆచరణలు' గురించి నేర్చుకుంటారు. 9వ తరగతి పుస్తకం ఏఐకు అవసరమైన గణితం, జెనరేటివ్ ఏఐ గురించి చర్చించింది. 10వ తరగతి పాఠ్యపుస్తకంలో పర్యవేక్షిత, పర్యవేక్షించని అభ్యాస నమూనాలు, క్లస్టరింగ్ (సారూప్యత ద్వారా డేటాను సమూహపరచడానికి పర్యవేక్షితంకాని అభ్యాస పద్ధతి), న్యూరల్ నెట్‌వర్క్‌లు (సంక్లిష్ట నమూనాను గుర్తించేందుకు తోడ్పడే శక్తిమంతమైన సాధనాలు) మొదలైన అంశాలు ఉన్నాయి. ప్రశ్న ఏమిటంటే ఈ అంశాలన్నిటినీ పాఠశాల స్థాయి బాలలు అర్థం చేసుకోగలరా? వాటి సారాన్ని గ్రహించగలరా? సాఫ్ట్‌వేర్ వ్యవస్థలలో ఏకీకరణ ప్రక్రియ ద్వారా పొందుపరిచి ఉండే అభ్యాస నమూనాలను వారు అవగాహనతో అనుసరించగలుగుతారా? తాము నేర్చుకుంటున్న గణితం, సైన్స్‌తో వీటిని వారు ఎలా జోడించగలుగుతారు? 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సామాజిక అభివృద్ధి' అనే అంశాలను బాలలు ఎలా అర్థం చేసుకుంటారు? సిస్టమ్ మ్యాప్స్‌ను వారు ఎలా ఉపయోగించగలుగుతారు? ఈ భావనలు, పద్ధతులను అర్థం చేసుకునేందుకు మానసిక పరిణతి అవసరం. మరి వాటిని బాలలకు సుబోధకం చేసేందుకు ఎటువంటి బోధనాశాస్త్ర విధానాలు అవసరమవుతాయి?

సీబీఎస్‌ఈ ఏడవ తరగతి ఏఐ పాఠ్య ప్రణాళికలోని ఈ ప్రశ్నను పరిశీలనలోకి తీసుకోండి: 'జెండర్ సమానత్వం, మహిళల, బాలికల సాధికారతను ఏఎస్‌డీజీ (సుస్థిరాభివృద్ధి లక్ష్యం) స్పష్టంగా నిర్దేశించింది? (1) ఎస్‌డీజీ–3; (2) ఎస్‌డీజీ–5; (3) ఎస్‌డీజీ–8; (4) ఎస్‌డీజీ–10'. సదరు ఎస్‌డీజీ సంఖ్య ఏదనేది అంత ముఖ్యమా? అలాగే, ఏఐ ఎలా పనిచేస్తుందో విద్యార్థులు అవగాహన చేసుకోవాలి. ఈ అభ్యసన ప్రక్రియ కృత్రిమ మేధను ఉపయోగించడంపై బాలల్లో విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. అయితే పైన ప్రస్తావించిన 'ప్రశ్న పద్ధతి' అటువంటి మేధో ప్రావీణ్యాన్ని బాలల్లో వికసింపజేస్తుందా? విజ్ఞాన శాస్త్రాల బోధన ద్వారా విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని విద్యార్థులకు అలవర్చడంలో మనం పెద్దగా సఫలం కాలేదు. మరి ఏఐ అక్షరాస్యత ద్వారా విమర్శనాత్మక వివేచనను వికసింపజేయడమనేది అవాస్తవిక ఆశాభావం అవుతుంది. పాఠశాలల్లో ఏఐ బోధనకు సంబంధించిన ప్రశ్న 'అవును లేదా కాదు' అనే సమాధానం వచ్చే రీతిలో వేయవలసిన ప్రశ్న కాదు. అంతకంటే వివరణాత్మక సమాధానాన్ని చెప్పవలసిన రీతిలో ఆ ప్రశ్న ఉండి తీరాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే విద్యాపరమైన శిక్షణకు సంబంధించిన ప్రశ్నగా ఉండాలి. జ్ఞాన/ నైపుణ్యాల సముపార్జనకు దోహదం చేసే అంశాలు అన్నిటినీ సమగ్రంగా పరిగణనలోకి తీసుకునే ప్రశ్నగా ఉండాలి. అభ్యసన ప్రక్రియల్లో బాలల మానసిక సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం.

ఏఐ బోధన విషయమై కొన్ని ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. కృత్రిమ మేధ కేవలం 'తాత్కాలిక నవ సాంకేతికతా సంచలనమే' అని కొంతమంది వాదిస్తున్నారు. గత శతాబ్ది తుదినాళ్ల 'డాట్ కామ్ బబుల్'తో కూడా దీనికి పోలిక తెస్తున్నారు. పాఠశాలలు జ్ఞాన/ నైపుణ్యాల సముపార్జనా నెలవులు. భవిష్యత్తుకు దృఢమైన పునాదులు నిర్మాణమయ్యే ప్రదేశాలవి. కొట్టివేయలేని ఈ వాస్తవం దృష్ట్యా నవ సాంకేతికతల విజృంభణ (టెక్నలాజికల్ బూమ్) ఒత్తిడితో పాఠశాలల విధులను నిర్దేశించడం లేదా ప్రభావితం చేయడం విద్యారంగ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు దోహదం చేయదు. సమాజానికి మేలు జరగదు. కృత్రిమ మేధ బలీయమైన ఆకర్షణ గల అధునాతన సాంకేతికత. అంతేకాదు, దాన్ని వినియోగించుకునే అలవాటు వదిలించుకోలేని వ్యసనంగా మారుతుంది. భావి పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాలలో ఈ నవ సాంకేతికతను ఉపయోగించడంపై నిర్ణయాలను నిష్పాక్షిక వివేచన, సమగ్ర అవగాహన, నిశిత అంతర్దృష్టితో కూడిన సామాజిక వివేకంతో తీసుకోవల్సివుంది. మరి మనం అటువంటి జ్ఞానశీలురమేనా?

> కృత్రిమ మేధ బలీయమైన ఆకర్షణ గల అధునాతన సాంకేతికత. దాన్ని వినియోగించుకునే అలవాటు వదిలించుకోలేని వ్యసనంగా మారుతుంది. భావి పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాలలో ఈ నవ సాంకేతికతను ఉపయోగించడంపై నిర్ణయాలను నిష్పాక్షిక వివేచన, సమగ్ర అవగాహన, నిశిత అంతర్దృష్టితో కూడిన సామాజిక వివేకంతో తీసుకోవల్సివుంది. మరి మనం అటువంటి జ్ఞాన-శీలురమేనా?

■ **ఆర్. రామానుజం**
అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం, బెంగళూరు
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

ప్రపంచ దేశాలకు భారత స్వరం

అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలకు భారత స్వరాన్ని వినిపించే అరుదైన అవకాశం మన తెలుగు బిడ్డ, మాజీ కేంద్రమంత్రి, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి దక్కటం విశేషం. ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొనే 16 మంది పార్లమెంటు సభ్యుల బృందానికి ఆమె నాయకత్వం వహిస్తున్నారు. "Peace and security to human rights development and international cooperation" అనే అంశంపై పురందేశ్వరి ప్రధాన ప్రసంగం చేయడం తెలుగు వారికి గర్వకారణం. 1991 డిసెంబర్ 3న నాటి బాపట్ల ఎంపీ డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఇదే ఐరాస వేదికపై 'జాతి వివక్ష' అంశం గురించి ప్రసంగించారు. ఒకే అంతర్జాతీయ వేదికపై భార్యాభర్తలు ఇద్దరూ భారతదేశం తరఫున ప్రసంగించడం అరుదైన విశేషం.

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న పురందేశ్వరి... పార్లమెంటులో మహిళా బిల్లు, విద్యా బిల్లు, వ్యవసాయ రంగం వంటి వాటికి సంబంధించిన అనేక సమస్యలపై అనర్గళంగా మాట్లాడి పలువురి ప్రశంసలు పొందారు. 2005లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందారు. కేంద్రంలో మాజీ మంత్రిగా, విదేశీ వ్యవహారాలపై ఆమెకున్న లోతైన అవగాహన, అంతర్జాతీయ వేదికలపై చూపిన అసమాన ప్రతిభ, ప్రాతినిధ్యం ఆమె గొప్పతనానికి నిదర్శనం. లారా బుష్ ఆహ్వానం మేరకు అమెరికాలోని వైట్‌హౌస్‌లో "అడ్వాన్సింగ్ గ్లోబల్ లిటరసీ" అనే అంశంపై ప్రసంగించిన తొలి మహిళగా పురందేశ్వరి రికార్డుకెక్కారు.



ఉగ్రవాదంపై భారతదేశ వైఖరి, 'ఆపరేషన్ సిందూర్'కు దారి తీసిన పరిస్థితులు, దేశ భద్రతకు తాము తీసుకుంటున్న చర్యలను ప్రపంచానికి తెలియజేయడానికి ఈ ఏడాది మే 25న ఎనిమిది మందితో కూడిన అఖిలపక్ష బృందం పలు దేశాల్లో పర్యటించింది. ఈ బృందంలో పురందేశ్వరి సభ్యురాలిగా ఉన్నారు. ఈ పర్యటనలలో యూరప్‌లోని జర్మనీ, బెల్జియం, యునైటెడ్ కింగ్‌డమ్, డెన్మార్క్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాలలోని అధ్యక్షులు, ప్రవాస భారతీయ సంఘాలతో ఆమె సమావేశమయ్యారు. పాకిస్థాన్ పోషిస్తున్న ఉగ్రవాదం వల్ల భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లను, దేశంలోని 'జీరో టాలరెన్స్' విధానాన్ని విపులంగా వివరించారు.

విదేశాలలో అక్టోబర్ 5 నుంచి 12 వరకు జరిగిన కామన్వెల్త్ సదస్సుల్లో... కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) 'ఇండియా రీజియన్ ఎగ్జిక్యూటివ్ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా, మహిళా పార్లమెంటేరియన్ల స్టీరింగ్ కమిటీ అధ్యక్షురాలిగా భారతదేశం తరఫున పురందేశ్వరి ప్రాతినిధ్యం వహించారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన, సహకారం ద్వారా మహిళా సాధికారతను ప్రోత్సహించటం, సురక్షితమైన వాతావరణం సృష్టించటం, శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం వంటి ముఖ్యమైన అంశాలపై చర్చించారు. బహమాస్‌లో ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో 'మహిళా సాధికారత'పై జరిగిన అర్థవంతమైన చర్చల్లో ఆమె చురుకుగా పాల్గొన్నారు. అంతర్జాతీయ వేదికలపై పురందేశ్వరి భారతీయ ప్రతినిధిగా వ్యవహరించిన తీరు, ముఖ్యంగా ఉగ్రవాదం వంటి సున్నితమైన అంశాలపై ఆమె ప్రసంగించిన విధానం దేశానికి గౌరవాన్ని తెచ్చిపెట్టింది.

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలిగా పార్టీని సమర్థంగా నడిపించడం, 2024లో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో పురందేశ్వరి కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవడం ఆమెలోని నాయకత్వ లక్షణాలకు నిదర్శనం. ఆమె కేవలం ఒక రాజకీయ నాయకురాలిగా కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం వైఖరిని, శక్తిని, మహిళా సాధికారతను ప్రపంచానికి తెలియజేసేందుకు ఈ వేదికలపై కృషి చేస్తున్నారు. ఆమె అనుభవం, నిబద్ధత, అంకితభావం కారణంగా, తెలుగు రాజకీయాల్లోనే కాక, భారత రాజకీయాల్లోనూ గౌరవప్రదమైన స్థానాన్ని పొందుతున్నారు.

– సందిరెడ్డి కొండలరావు

అలంకారప్రాయం ఆ నిఘా నేత్రాలు!

వ్యక్తిగతంగా కంటే సమాజపరంగా సీసీ కెమెరాల అవసరం పెరిగింది. కర్మాగారాల్లో, అత్యంత క్లిష్టమైన నిర్మాణాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఎంతో సహాయకారిగా ఉంది. ప్రధానమైన కూడళ్ళలో, హైవే రహదారుల్లో సీసీ కెమెరాల వల్ల ప్రమాదాలకు గల కారణాలతో పాటు నిందితుల/నేరస్తుల గుర్తింపునకు ఇవి కీలక సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అయితే పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మాత్రం అలంకారప్రాయంగా మారాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పల్నాడు జిల్లాలో ఒక కేసు విషయమై నిందితుణ్ణి సీసీ కెమెరాలు పనిచేస్తున్న స్టేషన్‌లోనే విచారించమని ఆదేశించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం 2020 డిసెంబర్‌లో సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ సహా దర్యాప్తు సంస్థల కార్యాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యమని ఇచ్చిన ఆదేశాలు అమలుకు నోచుకోలేదు.

హైవేలపై, షాపింగ్ మాల్స్‌లో నేరాల విషయంలో సీసీ ఫుటేజ్‌ని ప్రధాన సాక్ష్యంగా చూపుతున్న పోలీస్ యంత్రాంగం, తమ స్టేషన్లలో ఫుటేజ్ ఇవ్వడానికి నిరాకరించడం చాలా విడ్డూరం. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, లేదా అది బయటకు ఇచ్చేది కాదని, లేదా రికార్డు మా వద్ద ఉండదని డీజీపీ ఆఫీసులో పొందమని చెబుతున్నారు. ఒక్కోసారి విచిత్రంగా సీసీ కెమెరాలు పోలీసుల, స్టేషన్ల భద్రత కోసం పెట్టామని, ప్రజలకు సమాచారం ఇవ్వడానికి కాదని వింత సమాధానం ఇస్తున్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వచ్చే వారిని, లేదా అనుమానితులను గంటల తరబడి స్టేషన్‌లో ఉంచడం, రోజూ స్టేషన్‌కు రమ్మని వేధించడాన్ని ఆపాలంటే, ప్రతి పోలీస్‌స్టేషన్, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, అవి సక్రమంగా పనిచేసేలా చూడాలి. వాటిని డీజీపీ ఆఫీస్‌తో అనుసంధానం చేసి, ఆ రికార్డు కనీసం సంవత్సరం పాటు ఉంచేలా చూడాలి. ఆర్టీఐ చట్టం క్రింద ప్రజలు కోరినప్పుడు దానిని ఇవ్వగలిగితే, ఖచ్చితంగా పోలీసులు హింసకు, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడకుండా ఉంటారు. రాజ్యాంగాన్ని నెత్తిన పెట్టుకోవడంతో సరిపెట్టకుండా నిజమైన స్ఫూర్తితో పనిచేసినప్పుడే ప్రజల ప్రాథమిక హక్కును మన్నించడం అవుతుంది.

– మారిశెట్టి జితేంద్ర

మొబైల్ లేకుండా ఒక రోజు

ఒకప్పుడు మనం గడియారాన్ని చూసేవాళ్లం, పత్రిక చదివేవాళ్లం, మనుషులతో మాట్లాడేవాళ్లం. ఇప్పుడు మనం స్క్రీన్ చూస్తున్నాం, స్క్రోల్ చేస్తున్నాం, మెసేజ్‌లకు బానిసలమయ్యాం. మన అసలైన జీవనానుభూతిని కోల్పోతున్నాం. ఈ నేపథ్యంలో 'ఒక రోజు చరవాణి లేకుండా జీవించగలమా?' అనే ప్రశ్నను మనకు మనమే వేసుకోవాల్సిన సమయం ఇది.

ఒక రోజు మొబైల్‌ను పక్కన పెట్టి జీవించడమంటే మొదట్లో భయంగా అనిపించవచ్చు. కాని కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక రోజు మొబైల్ లేకుండా ఉండటం వల్ల ఎదురయ్యే సమస్యలు– యూపీఐ చెల్లింపులు, అత్యవసర కాల్స్. వీటికి పరిష్కారంగా కొంత నగదు చేతిలో ఉంచుకోవటం, సమీప వ్యక్తులతో కనెక్ట్ అవ్వడం, ముందుగా ముఖ్యమైన కొన్ని నంబర్లు రాసి ఉంచడం లాంటివి చేస్తే సరిపోతుంది. మొబైల్‌ను పక్కన పెట్టిన తరువాత పుస్తకాన్ని తిరగేయడం మొదలవుతుంది, కుటుంబంతో మాట్లాడే సమయం పెరుగుతుంది, మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. మొబైల్ వాడకం తగ్గించమన్నాం కదా అని టీవీకి అతుక్కుపోకూడదు. ప్రతి నిమిషం స్క్రీన్‌కి అంకితమవ్వాల్సిన అవసరం లేదు. మన జీవితంలో 'నిశ్శబ్దం' కూడా ఒక విలువైన అనుభవం. పాఠశాలలు, కళాశాలలు నెలలో ఒక రోజు 'నో మొబైల్ డే'గా పాటించాలి, విద్యార్థులకు డిజిటల్ డిటాక్స్ గురించి అవగాహన కల్పించాలి. ఇంట్లో కుటుంబంగా కలిసి గడిపే సమయాన్ని ప్రోత్సహించాలి. ఐస్ బకెట్ ఛాలెంజ్, మూడు మొక్కలు నాటే సవాల్ లాగా, 'నో మొబైల్ డే' కూడా ఒక ఉద్యమంగా మారాలి. ఈ చిన్న ప్రయోగం ఒక పెద్ద మార్పునకు నాంది కావచ్చు. మనం మనల్ని తిరిగి కనుగొనాలంటే, కొన్నిసార్లు టెక్నాలజీని పక్కన పెట్టాల్సిందే. మొబైల్ లేకుండా ఒక రోజు... ఒక కొత్త జీవనానుభూతికి మొదటి అడుగు కావచ్చు.

– ఆచార్య శివకుమార్ నన్నపనేని

సహకార స్ఫూర్తితోనే దేశ శ్రేయస్సు

తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ తొక్కి పెట్టడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, దానిపై భారత రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు లేఖ రాయడం వంటివి ఇటీవల కేంద్ర–రాష్ట్ర సంబంధాలను మరోసారి చర్చనీయాంశం చేశాయి. ఈ వివాదాన్ని మరింత పెంచాయి. పహల్గాం ఉగ్రదాడి తరువాత దేశమంతా రాజకీయాలకు అతీతంగా, ఐక్యంగా నిలబడింది. కానీ కశ్మీర్‌లో కేంద్ర హోం మంత్రి జరిపిన సమీక్షా సమావేశానికి మాత్రం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని పిలవకపోవడం 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న విలువ'కు అద్దం పడుతోంది. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు కావాలంటే ఏకీకృత మార్కెట్, జీఎస్టీ ఏక పన్ను వంటి కేంద్రీకృత విధానాలు అవసరం. రాష్ట్రాలు వేర్వేరు విధానాలు అవలంబించడం వీటి అమలుకు ప్రతిబంధకంగా ఉంటుంది.

కేంద్రం, రాష్ట్రాలు పరస్పర విభేదాలతో కాకుండా సహకారంతో పనిచేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఫెడరల్ వ్యవస్థ అయినా, అమెరికా, కెనడా వంటి క్లాసికల్ ఫెడరల్ వ్యవస్థలతో పోలిస్తే భిన్న స్వభావం కలిగి ఉంది. ఇది సహకార ఫెడరలిజం అనే భావనపై ఆధారపడినా, ఆచరణలో కేంద్రాధిపత్యంగా మారింది. ఈ కారణంగా కాలక్రమంలో కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో విభేదాలు, వివాదాలు, ఆర్థిక అసమానతలు, గవర్నర్ల రాజకీయ పాత్ర వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

నేడు రాష్ట్రాల అభివృద్ధి ప్రాధాన్యాలకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం తన విధానాలను అమలు చేస్తోంది. రాష్ట్రాలను సంప్రదించకుండానే వాటి పరిధిలోని సహకార రంగం, ఉమ్మడి జాబితాలోని విద్య, వైద్యం వంటి రంగాలలో ఏకపక్ష నిర్ణయాలు చేస్తోంది. అంతర్ రాష్ట్ర మండలి అటకెక్కింది. ప్లానింగ్ కమిషన్ రద్దయి, దాని స్థానంలోని నీతీ ఆయోగ్ పూర్తిగా ఏకపక్ష సంస్థగా రూపుదిద్దుకుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే పథకాలకు కేంద్ర నిధులు నిలిపివేయడం లేదా రాజకీయ ప్రేరణతో ఆలస్యం చేయడం వంటివి సాధారణమయ్యాయి. రాజ్యాంగంలోని ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు, నీతీ ఆయోగ్ సాయంతో వచ్చే నిధుల పంపిణీ పక్షపాత ధోరణితో ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు తాము ఎక్కువ పన్ను వసూలు చేస్తున్నా, తమకు కేంద్రం నుంచి తక్కువ నిధులు వస్తున్నాయని విమర్శిస్తున్నాయి. రాష్ట్రాల అధికారాలను నామమాత్రం చేసి, మోదీ ప్రభుత్వం పెత్తనం చెలాయిస్తోంది. ఫైనాన్స్ కమిషన్ ప్రతి అయిదేళ్లకోసారి కేంద్ర–రాష్ట్ర ఆదాయాన్ని పంచుతుంది. జనాభా ఆధారంగా దీనిని పంచడంతో, జనాభా నియంత్రణ పటిష్ఠంగా పాటించిన తమకు నష్టం జరుగుతోందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు వంటి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలలో రాష్ట్రాల వాటాను మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా పెంచడం వల్ల పేద రాష్ట్రాలకు భారమవుతోంది. జీఎస్టీ పరిహారం నిలిపివేయడం కూడా రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యంపై ప్రభావం చూపుతోంది. ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్ఐఏ వంటి కేంద్ర సంస్థలు రాష్ట్ర అనుమతి లేకుండా దర్యాప్తులు, అరెస్టులు చేయడం ద్వారా రాజకీయ దుర్వినియోగం జరుగుతోంది.

గవర్నర్ పదవిని రాజ్యాంగం 'రాష్ట్ర నామమాత్ర ప్రధాన అధికారి'గా పేర్కొన్నప్పటికీ, వాస్తవంలో అది కేంద్రానికి అనుబంధమైన రాజకీయ సాధనంగా మారింది. కేంద్రం నియమించిన గవర్నర్, చాలాసార్లు ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలతో విభేదిస్తూ పనిచేస్తున్నారు. బిల్లులను దీర్ఘకాలం అడ్డుకోవడం, సభలో మెజారిటీ నిరూపణపై జోక్యం, ప్రభుత్వం ఏర్పాటు, రద్దు విషయాల్లో రాజకీయ ప్రభావం వంటి వివాదాస్పద నిర్ణయాలకు గవర్నర్లు కేంద్రంగా మారారు. ఇటీవల తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఇటువంటి ఉదాహరణలు కనిపించాయి.

రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండేలా గవర్నర్లను నియమించాలని, రాజకీయ నియామకాలు తగ్గించాలని 1983లో సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. కానీ అవి ఆచరణలోకి రాలేదు. తరువాత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మదన్ మోహన్ పూంఛీ సారథ్యంలో ఏర్పడిన కమిషన్ 2010లో నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో దాదాపు 273 సిఫార్సులు చేసింది. నేటి సమస్యకు అవి పరిష్కారం చూపుతాయి.

ఆ సిఫార్సుల ప్రకారం... గవర్నర్ నియామకానికి, సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. గవర్నర్‌ను 'కేంద్ర ప్రతినిధి'గా కాకుండా రాష్ట్ర రాజ్యాంగ అధికారిగా చూడాలి. జాతీయ భద్రత, ఉగ్రవాదం, అంతర్గత భద్రత వంటి అంశాలపై కేంద్ర–రాష్ట్రాల సహకారం బలపరచాలి. అంతర్రాష్ట్ర మండలిని స్థిరమైన సంస్థగా చేయాలి. ఇది కేంద్ర–రాష్ట్రాల మధ్య సమన్వయ వేదికగా ఉపయోగపడాలి. దీని సమావేశాలు క్రమబద్ధంగా జరగాలి. ఆర్థిక వనరుల పంపకాన్ని న్యాయంగా చేయాలని, రాష్ట్రాలకు మరింత పన్నుల వాటా ఇవ్వాలని ఈ కమిషన్ సూచించింది. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు, ప్రాంతీయ అసమానతల దృష్ట్యా పునఃపరిశీలన చేయాలి. కేంద్ర పథకాల రూపకల్పనలో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంచాలి. కేంద్ర బలగాలను రాష్ట్రాలకు పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం తప్పనిసరని పేర్కొంటూ, ఉగ్రవాదం, వలసలు, జాతీయ భద్రత వంటి అంశాలు 'కాన్కరెంట్ లిస్ట్'లోకి తేవాలని కమిషన్ సూచించింది. కేంద్రం–రాష్ట్రాల మధ్య వివాదాలు త్వరగా పరిష్కరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పింది.


> కేంద్ర–రాష్ట్ర సంబంధాలు భారత ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటివి. నేడు అవి అత్యంత బలహీనంగా, అపనమ్మకాలతో ఉన్నాయి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. అందుకే రాజ్యాంగం ఉద్దేశించిన 'సహకార ఫెడరలిజం' స్ఫూర్తిని అమలు చేయడం, రాజకీయ అవసరాలకు గవర్నర్ పదవిని వాడుకోకుండా ఉండడం, ఆర్థిక సమానత సాధించడం అత్యవసరం.



కేంద్ర–రాష్ట్ర సంబంధాలు భారత ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటివి. నేడు అవి అత్యంత బలహీనంగా, అపనమ్మకాలతో ఉన్నాయి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. అందుకే రాజ్యాంగం ఉద్దేశించిన 'సహకార ఫెడరలిజం' స్ఫూర్తిని అమలుచేయడం, రాజకీయ అవసరాలకు గవర్నర్ పదవిని వాడుకోకుండా ఉండడం, ఆర్థిక సమానత సాధించడం అత్యవసరం. కేంద్రం, రాష్ట్రాలు ఒకదానికొకటి ప్రతిబంధకంగా కాకుండా, భాగస్వామిగా చూడాలి.

వీటిని దృష్టిలో ఉంచుకుని సర్కారియా కమిషన్, పూంఛీ కమిషన్ వంటివి చేసిన సిఫార్సులు అమలుకాకపోవడం విచారకరం. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా కేంద్ర పెత్తనం పెరుగుతూ, రాష్ట్రాల హక్కులు కుంచించుకుపోతూ సహకార ఫెడరలిజానికి భిన్నంగా కేంద్రాధిపత్యం పెరుగుతోంది. దీన్ని సరిచేసి, అసలైన ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా విధానాలు మారాలి. అప్పుడు మాత్రమే దేశ శ్రేయస్సు, అభివృద్ధి, ఐక్యత సాధ్యం.

● **ఎ. అజశర్మ**
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



మొంథా తుఫాను ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. మంగళవారం సాయంత్రానికి తుఫాను తీరం దాటే అవకాశం ఉండటంతో, అతి భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తమైంది. విజయవాడలో 16 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉండటంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డేంజర్ అలారం మోగించారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాసాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే స్కూళ్లకు సెలవులు ప్రకటించిన అధికారులు.. ప్రభుత్వ ఉద్యోగుల సెలవులను రద్దు చేశారు. కూరగాయలు, మందుల షాపులు మినహా అన్ని దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని అధికారులు ప్రకటించడంతో సర్వత్రా టెన్షన్ వాతావరణం నెలకొంది.

రెడ్ అలర్ట్

ఉమ్మడి కృష్ణాజిల్లా యంత్రాంగం అప్రమత్తం

నేడు తీరం దాటనున్న మొంథా తుఫాను.. అంతటా టెన్షన్



కృష్ణాజిల్లాలోని కోడూరు మండలం హంసలదీవి వద్ద అల్లకల్లోలంగా సముద్రం

- కృష్ణాలోని తీరప్రాంతాలు సహా విజయవాడపై ప్రభావం
- నగరంలో 16 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం
- గంటకు 35-40 కిలోమీటర్ల వేగంతో గాలులు
- డేంజర్ అలారం మోగించిన మున్సిపల్ కార్పొరేషన్
- కూరగాయలు, మెడికల్ వ్యాపారాలకే అనుమతి
- తీర ప్రాంతాల్లో గస్తీ.. ప్రభుత్వ సిబ్బందికి సెలవులు రద్దు



కొండ ప్రాంతాల్లో మైకుల ద్వారా ప్రచారం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాను మొంథా తుఫాను గండం వెంటాడుతోంది. ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న సముద్రం ఎప్పుడు అల్లకల్లోలంగా మారుతుందోనని సర్వత్రా భయాందోళనలు వెంటాడుతున్నాయి. మచిలీపట్నం కేంద్రంగా తీరం దాటుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. తర్వాత ఇది కాకినాడ సమీపానికి మారడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయినప్పటికీ ఆ ప్రభావం ఉమ్మడి కృష్ణాజిల్లాపై ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాను కారణంగా సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. జిల్లా మొత్తం చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాత వర్షం విరామం ఇచ్చింది. ఈ ప్రభావం ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడపైన, కృష్ణాజిల్లాలో సముద్రతీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాలపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు వెల్లడించారు.

నగరంలో డేంజర్ అలారం

తుఫాను కారణంగా నగరంలో భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని హెచ్చరించింది. దీంతో నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తయ్యారు. ముందే ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. బయటకు రావొద్దని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే అన్ని విద్యాసంస్థలకు కలెక్టర్ మూడు రోజులు సెలవు ప్రకటించారు. గత ఏడాది బుడమేరు బీభత్సాన్ని చూసిన అధికారులు ఈసారి దానికి తగ్గట్టుగానే మిగతా 6లో..



నగరంలో కొండ ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

ఇలాగైతే నష్టమే..

తుఫాను అంటేనే చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు వాలిపోవడం ఎక్కువగా జరుగుతుంది. అటువంటి పరిస్థితి ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఉండబోదని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తే విద్యుత్ స్తంభాలు నేలకు వాలిపోతాయని స్పష్టం చేస్తున్నారు. అదే 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తే చిన్నచిన్న చెట్లతో పాటు భారీ వృక్షాలు పడిపోతాయని వివరిస్తున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉన్నప్పటికీ అంత తీవ్రత ఉండదని స్పష్టం చేశారు.

రోజంతా ముసురు



రామలింగేశ్వరనగర్ కరకట్టపై జోరువాన

విజయవాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావం సోమవారం జిల్లా అంతటా విస్తరించింది. తెల్లవారుజాము నుంచే ఆకాశంలో మేఘాలు కమ్మేశాయి. నగరంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభమైన చిరుజల్లులు మధ్యాహ్నం 12 గంటలకు మోస్తరు వానగా మారాయి. జిల్లావ్యాప్తంగా 48.5 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించింది. అత్యధికంగా విజయవాడ రూరల్‌లో 6.2, విజయవాడ పశ్చిమలో 6.1, సెంట్రల్‌లో 5.9, తూర్పులో 5.4, ఉత్తరంలో 5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జగ్గయ్యపేట, వీరులపాడు, తిరువూరు, కంచికచర్ల మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైంది. వత్సవాయి, మైలవరం మండలాల్లో ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. సగటు 2.4 మిల్లీమీటర్లుగా నమోదైంది.

పునరావాస కేంద్రాలు సిద్ధం
- జిల్లాలో కలెక్టర్ లక్ష్మీశ సుడిగాలి పర్యటన 6

ముంచుకొస్తున్న ముప్పు
- భారీ వర్షాలతో పంటలన్నీ కకావికలమే

మొత్తం అప్రమత్తం
- తుఫాను జోనల్ ప్రత్యేక అధికారి ఆర్పీ సిసోడియా 8

కిక్కిరిసిన రైతుబజార్లు
- రికార్డుస్థాయిలో మధ్యాహ్నానికే వెయ్యి టన్నుల అమ్మకం

లక్ష రూపాయల పెట్టుబడి పెడితే నెలకు రూ.6 వేలు వడ్డీ వస్తుందని ఆశ చూపించి అనేక మందిని మోసం చేసిన అద్వికా ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కథ ముగిసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని బయటకు లాగడానికి ఏర్పాటైన సిట్ దర్యాప్తును ముగించింది. డబ్బు వసూలుకు మాస్టర్‌మైండ్‌ను ఉపయోగించిన కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య, ఆయన భార్య సుజాతతో పాటు 15 మందిని పోలీసులు అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఈ అరెస్టులను రెండు రోజుల్లో అధికారికంగా ధ్రువీకరించనున్నారు.

ముగిసిన అద్వికా విచారణ



అద్వికా ఎండీ ఆదిత్య

నిందితులుగా 15 మంది నిర్ధారణ

- ఏ1గా ఎండీ ఆదిత్య, ఏ2గా ఆయన భార్య సుజాత
- అధిక వడ్డీల పేరుతో పెట్టుబడుల వసూళ్లు
- రూ.500 కోట్ల వరకు వసూలు చేసినట్టు ధ్రువీకరణ
- రెండు రోజుల్లో అరెస్టు చూపే అవకాశం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసే తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య కొన్నేళ్ల క్రితం నగరంలో అద్వికా ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశాడు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి ఎదురుగా ఉన్న భారీ భవనంలో ఈ సంస్థ కార్యకలాపాలు సాగాయి. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.6 వేలను వడ్డీగా చెల్లిస్తానని సులువుగా డబ్బు సంపాదించాలనుకునే వారికి ఎర వేశాడు. అతడి మాటలు నమ్మిన చాలామంది ఒకరిని చూసి మరొకరు పెట్టుబడులు పెట్టారు. ప్రారంభంలో మాత్రం.. ఇచ్చిన మాట ప్రకారం రూ.6 వేల వడ్డీని చెల్లించాడు. తర్వాత ఆశలు అంతస్థులకు ఎదగడంతో చాలామంది రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది జూలైలో ఖాతాదారులకు ఆదిత్య షాక్‌లు ఇచ్చాడు. ఒక్కొక్కరికీ భారీగా బకాయిలు పెట్టాడు. తెలంగాణ, ఏపీలో కలిసి మొత్తం 2 వేల మంది నుంచి రూ.500 కోట్ల వరకు వసూలు చేసినట్టు తేలింది. కంపెనీ ప్రారంభంలో ఖాతాదారులుగా చేరినవారు తర్వాత ఏజెంట్ల అవతారమెత్తారు. కొత్తగా ఖాతాదారులను తీసుకొచ్చిన వారికి కమీషన్లుగా 12 నుంచి 20 శాతం వరకు ఇస్తానని హామీలు ఇచ్చాడు. ఇలా ఎడాపెడా ఆశలు చూపించిన ఆదిత్య ఒక్కసారిగా బోర్డు తిప్పేశాడు. కమీషన్లకు ఆశపడిన ఏజెంట్లు తమకు పరిచయం ఉన్న వారందరినీ సభ్యులుగా చేర్పించారు. తర్వాత ఏజెంట్లు రూ.లక్షలు వెనుకేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు, మిగతా 6లో..





కార్తీక శోభ

కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని చల్లపల్లి బంగ్లా వద్ద ఉన్న శివాలయంలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) వన్‌టౌన్ పాత శివాలయంలోని శివయ్యకు అభిషేకం

రవాణాకు బ్రేక్

మొంథా తుఫానుతో అతలాకుతలంగా..

- రికార్డుస్థాయిలో రైళ్ల రద్దు.. బస్సులు స్వల్పంగా..
- 36 విమానాలు కూడా క్యాన్సిల్
- అత్యవసర ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మొంథా తుఫాను ప్రభావం రవాణా రంగంపై భారీగా పడుతోంది. తుఫాను తీరం దాటక ముందే ముఖ్యమైన రవాణా వ్యవస్థలు బంద్ అవుతున్నాయి. భారీగా రైళ్లు, ఆర్టీసీ బస్సులు రద్దయ్యాయి. అలాగే, విజయవాడ విమానాశ్రయం నుంచి విమానాలు సైతం రద్దయ్యాయి.

రికార్డుస్థాయిలో 100 రైళ్లు రద్దు

విజయవాడ డివిజన్ పరిధిలో రికార్డు స్థాయిలో 95 రైళ్లు రద్దయ్యాయి. సోమవారం నాటి మొదటి బులెటిన్‌లో 54 రైళ్లు, రెండో బులెటిన్‌లో 16 రైళ్లు, మూడో బులెటిన్‌లో మరో 25 రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. ఇవన్నీ విజయవాడ డివిజన్ పరిధిలో మిగతా 6లో..



శివాలెత్తి..

కానిస్టేబుల్ 'ధన'కార్యాలపై అధికారులు సీరియస్

- విజిలెన్స్ నుంచి వెనక్కి పంపించే ఆలోచనలు
- అంతర్గత విచారణ.. వీఆర్‌కు పంపే యోచన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజిలెన్స్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కానిస్టేబుల్ 'శివతాండవాలను' అధికారులు ఒక్కొక్కటిగా బయటకు తీస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి గుంటూరు జిల్లా వరకు ఆయన చేసిన ఘనకార్యాల జాబితాలను పరిశీలిస్తున్నారు. ఆయన చెప్పినట్టుగా ఆడిన పేషీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'విజిలెన్స్‌లో శివతాండవం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇంతకుముందు ఆ కానిస్టేబుల్ పనిచేసిన ప్రదేశాల్లో విచారణ చేశారు. అన్ని వ్యవహారాల గురించి పక్కాగా తెలుసుకున్న అధికారులు విజిలెన్స్ నుంచి ఆ కానిస్టేబుల్‌ను తిరిగి మాతృ విభాగానికి పంపేయాలని నిర్ణయించారు.

అధికారులతో సమానంగా నెట్‌వర్క్

సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలో అయినా రాష్ట్రస్థాయి అధికారులకే నెట్‌వర్క్ ఉంటుంది. ఆయా జిల్లాల్లో పనిచేసే అధికారులతో సంబంధాలు ఉంటాయి. అలాంటి నెట్‌వర్క్‌ను ఈ కానిస్టేబుల్ నడిపినట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ గుంటూరు, ప్రకాశం జిల్లా వరకు ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడని సమాచారం. ఇతర జిల్లాల్లో పీడీఎస్ బియ్యం లారీలను ఆపినా, క్రికెట్ బెట్టింగ్ ముఠాలను పట్టుకున్నా వారు నేరుగా విజిలెన్స్‌లో ఉన్న ఈ కానిస్టేబుల్‌కు ఫోన్ చేసేవారు. పట్టపగలైనా, అర్ధరాత్రయినా ఈయన ఆయా ఏరియాల పోలీసులతో ఫోన్లలో మాట్లాడి అప్పటికప్పుడు విడుదల చేయించేవాడు. ఇలా చేసినందుకు భారీగానే ముడుపులు అందుకున్నాడని మిగతా 6లో..

అంతర్గత విచారణకు ఆలోచనలు

ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేసే ఆ కానిస్టేబుల్ ఎన్నికలకు ఏడాది ముందు విజిలెన్స్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లాడు. అక్కడ ఆయన సేవలను ఉపసంహరించడానికి రంగం సిద్ధం చేశారు. ఆయన్ను విజిలెన్స్ నుంచి ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌కు పంపడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయన ఇక్కడ రిపోర్టు చేయగానే ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత ఆయన చేసిన ఘనకార్యాలపై అంతర్గత విచారణ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, ఉద్యోగులు, సేవాబృందం

దుర్గమ్మకు భారీ ఆదాయం

- 44 హుండీల ద్వారా రూ.4.33 కోట్ల కానుకలు 6
- 420 గ్రాముల బంగారం, 6 కిలోల వెండి కూడా..



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

కనకదుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను కార్తీక సోమవారం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనానాయక్, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్తీకమాసం సందర్భంగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మల్లేశ్వరస్వామికి కార్తీక దీపాన్ని సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, కార్తీకమాసంలో అమ్మవారిని, స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణం



ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వాముల లీలా కళ్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారికి షష్టి తిధి జన్మతిధి రోజున విశేష అర్చనలు చేస్తారు. ఈ క్రమంలో కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం మేళ, తాళాల మధ్య భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్త, వేదోక్తంగా నిర్వహించారు. వివాహం కావాల్సిన వారికి ఆటంకాలు తొలగి త్వరగా వివాహాలు కావాలని రాహు, కేతు బాధలు తొలగాలని, కుజ దోష నివారణ నుంచి సంతాన ప్రాప్తి కోసం, వంశాభివృద్ధి కోసం సంకల్పం చెబుతూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదిక పై ఉంచి ఆగమోక్త, శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని జరిపించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పాలకమండలి సభ్యులు, ఈవో శీనానాయక్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లేశ్వరాలయంలో..

మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పాలక మండలి సభ్యులు, ఈవో శీనానాయక్‌లు పాల్గొని ఆలయ స్థానాచార్యుడు విష్ణుబొట్ల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 2,500 మందికి అన్న ప్రసాదం అందజేశారు.

భక్తుల భద్రతే ముఖ్యం.. : ఈవో



దుర్గగుడి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి : మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత నిమిత్తం ఆలయ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈవో వీకే శీనానాయక్ ఆదేశించారు. సోమవారం ఇంజనీరింగ్ అధికారులు, ఇతర విభాగాల ఉద్యోగులతో కలిసి ఆయన ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం క్యూలలో భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలన్నారు. ప్రధాన ఆలయం, మహామండపం, దేవస్థానం చుట్టుప్రక్కల ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈవో వెంట ఏఈవో, పీఆర్వో కె.గంగాధర్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

100 రైలు సర్వీసులు రద్దు!



- మొంథా తుఫాను ఎఫెక్ట్.. రవాణా బంద్
- రైళ్లన్నీ ఎక్కడివి అక్కడే నిలిపివేత

విజయవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం కారణంగా మంగళవారం కోస్తా జిల్లాల మీదుగా నడిచే 95 రైళ్ల సర్వీసులను విజయవాడ డివిజనల్ రైల్వే రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైళ్లు రద్దు చేసినట్టుగా ప్రకటించింది. ఈ మేరకు వేర్వేరుగా మూడు బులెటిన్లు విడుదల చేసింది. వీటితో పాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో.. విజయనగరం, విశాఖపట్నం మీదుగా రాజమండ్రి, మచిలీపట్నం, గుంటూరు, తిరుపతి, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే కొన్ని రైళ్లను రద్దు చేశారు. దీంతో కోస్తా జిల్లాల పరిధిలో 100కు పైగా రైలు సర్వీసులు రద్దు కావడం గమనార్హం.

రద్దు చేసిన రైళ్ల వివరాలు..

విజయవాడ-భీమవరం టౌన్(67281), భీమవరం టౌన్-నిడదవోలు (67283), నిడదవోలు-భీమవరం (67284), భీమవరం టౌన్-విజయవాడ(67282), విజయవాడ-రాజమండ్రి(67262), గుంటూరు-విజయవాడ(67230), విజయవాడ-కాకినాడ పోర్టు(17257), కాకినాడ పోర్టు-రాజమండ్రి(07523), విజయవాడ-తెనాలి (67221), తెనాలి-రేపల్లె (67231), రేపల్లె-తెనాలి (67232), తెనాలి-రేపల్లె (67233), రేపల్లె-గుంటూరు (67234),గుంటూరు-తెనాలి (67235), తెనాలి-రేపల్లె (67237), రేపల్లె-మార్కాపూర్ రోడ్డు(67238),మార్కాపూర్ రోడ్డు-తెనాలి(67239), తెనాలి-గుంటూరు(67236), గుంటూరు-విజయవాడ(67230), విజయవాడ-మచిలీపట్నం(67265), మచిలీపట్నం-గుడివాడ(67271), గుడివాడ-మచిలీపట్నం(67272), మచిలీపట్నం-విజయవాడ(67266), విజయవాడ-నర్సాపూర్ (67258), నర్సాపూర్-రాజమండ్రి(67246), విజయవాడ-రాజమండ్రి (67202), విజయవాడ-ఒంగోలు(67273), ఒంగోలు-విజయవాడ (67274), విజయవాడ-మచిలీపట్నం(67267), మచిలీపట్నం- విజయవాడ(67268), నర్సాపూర్-విజయవాడ(67276), విజయవాడ-మచిలీపట్నం(67269), భీమవరం టౌన్-నిడదవోలు(67277), నిడదవోలు-భీమవరం టౌన్(67278), భీమవరం టౌన్-నర్సాపూర్(17263), నర్సాపూర్- గుంటూరు (67247), గుంటూరు-రేపల్లె (67249), రేపల్లె-గుంటూరు (67250), మచిలీపట్నం-విజయవాడ(67256), విజయవాడ-నర్సాపూర్ (67257), నర్సాపూర్-నిడదవోలు(67244), నిడదవోలు-నర్సాపూర్ (67245), విజయవాడ-మాచెర్ల(67227), మాచెర్ల-విజయవాడ (67228), రాజమండ్రి-విజయవాడ(67201), రాజమండ్రి-విశాఖపట్నం(67285), విశాఖపట్నం-రాజమండ్రి (67286), రాజమండ్రి-విజయవాడ (67261), రాజమండ్రి-భీమవరం టౌన్(67241), భీమవరం టౌన్-నిడదవోలు (67242), నిడదవోలు-నర్సాపూర్ (67243), కాకినాడ పోర్టు-విజయవాడ(17258), కాకినాడ పోర్టు-విశాఖపట్నం(17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు (17268), తిరుపతి-విశాఖపట్నం(08584), విశాఖపట్నం-గుంటూరు(22875), గుంటూరు-విశాఖపట్నం(22876), తిరుపతి-విశాఖపట్నం(22708), మచిలీపట్నం-విశాఖపట్నం(17219), హైదరాబాద్-విశాఖపట్నం(12728), మహబూబ్‌నగర్-విశాఖపట్నం(12862), చెన్నై సెంట్రల్-విశాఖపట్నం (22870), భువనేశ్వర్-బెంగుళూరు(18463), సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), భువనేశ్వర్-పాండిచ్చేరి (20851), విశాఖపట్నం-కాకినాడ పోర్ట్(17268), కాకినాడ పోర్ట్-విశాఖపట్నం (17267), లింగంపల్లి-విశాఖపట్నం(12806), చర్లపల్లి-షాలిమార్ (18046), నర్సాపూర్-భీమవరం(17264), సికింద్రాబాద్-భువనేశ్వర్ (17016), సికింద్రాబాద్-హౌరా(12704), గుంటూరు-రాయగడ(17243), రాయగడ-గుంటూరు (17244), హైదరాబాద్-భువనేశ్వర్ న్యూ(07165), భువనేశ్వర్ న్యూ-హైదరాబాద్(07166), తిరుపతి-పూరి(17480),పూరి-తిరుపతి(17479), కడప-విశాఖపట్నం(18522) తదితర రైళ్లను రద్దు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.



ముప్పు!

పొట్ట దశలో వరి పొలం

మొంథా తుఫాను అన్నదాత వెన్నులో వణుకు పుట్టిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ వర్షాలు పడితే మెట్ట పంటలు కకావికలం కానున్నాయి. పత్తి, మొక్కజొన్న చేతికి దక్కటం కష్టమేనని రైతులు అంటున్నారు. మిర్చి తోటలు, మాగాణి వరి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని, తుఫాన్‌తో మెట్ట రైతులు నిలువునా మునిగే పరిస్థితి నెలకొంది.

- భారీ వర్షాలతో పంటలన్నీ కకావికలమే
- మొక్కజొన్న చేతికి రావటం కష్టం
- మాగాణి వరి, మిర్చి తోటలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం
- 81,875 ఎకరాల్లో పత్తి, 30 వేల ఎకరాల్లో మిర్చి సాగు
- జిల్లా వ్యాప్తంగా 30 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/ఇబ్రహీంపట్నం)

ఈ ఏడాది జిల్లాలో 81,875 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఇప్పటికే అధిక వర్షాలు పత్తి చేలను దెబ్బతీశాయి. కాయలు పక్వానికి వచ్చే తరుణంలో వర్షాలు పత్తి చేను ఊసురుతీస్తున్నాయి. పల్లపు, లోతట్టు



భూముల్లో చెట్లు నిలువునా చచ్చిపోతున్నాయి. ఒకవైపు చేలు గుబురుగా ఉండటం, మరోవైపు గాలి తగలక ఫంగస్ తెగులు వ్యాపించటంతో తొలి కాపు దెబ్బతిన్నది. అడుగు భాగంలో పక్వానికి వచ్చిన కాయలు బూజు పట్టి నల్లగా మారాయి. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల లోపు గుడ్డి పత్తి, కాయ పత్తి వస్తుంది. పత్తి నాణ్యత తక్కువ కావటం వల్ల మార్కెట్లో వ్యాపారులు కొనకపోవటంతో రైతులకు నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో తుఫాన్ విరుచుకుపడితే పత్తి చేలు సర్వనాశనం అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షాలతో మిర్చికి నష్టమే..

జిల్లాలో సుమారుగా 30 వేలఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారు. ప్రస్తుతం తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. కౌలుతో కలుపుకుని ఎకరాకు సగటున



రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పూత, పిందె దశలో తోటలు కళకళలాడుతున్నాయి. అయితే గాలులతో కూడిన భారీ వర్షాలు పడితే తోటలు దెబ్బతింటాయని, గాలులకు పూత, పిందెలతో కూడా చెట్లు దూసుకుపోతాయని రైతులు పేర్కొంటున్నారు. అసలే గిట్టుబాటు ధర లభించకపోవటం వల్ల రెండేళ్ల నుంచి తీవ్రంగా నష్టపోయామన్నారు. తుఫాన్ వల్ల మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుంటంతో రైతులకు కంటి మీద కునుకు ఉండటం లేదు.

చేలల్లోనే మొక్కజొన్న..



మొక్కజొన్న రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఖరీఫ్ సీజన్‌లో నందిగామ డివిజన్‌లోనే పదివేల ఎకరాల్లో పైగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పక్షం రోజుల క్రితమే పంట కోతకు వచ్చింది. రెండు మూడు రోజులు పొడి వాతావరణంలో పలువురు రైతులు యంత్రాల ద్వారా పంట కోయించారు. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రోజూ వర్షం పడుతుండటంతో మొక్కజొన్న కోయటానికి వీలుపడటం లేదు. చేలల్లోనే పంట తడుస్తున్నది. అక్కడక్కడ కంకుల నుంచి మొలకలు వస్తున్నాయి. ఎకరానికి కౌలు కాకుండా రూ. 25వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ తరుణంలో తుఫాన్ వల్ల భారీ వర్షాలు పడితే భారీ నష్టమే అంటున్నారు..

ముంపు భయంలో వరి రైతులు

జిల్లాలో చెరువులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాల కింద లక్ష ఎకరాలకు పైగా రైతులు మాగాణి వరిసాగు చేశారు. ఎకరానికి రూ. 35వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పలుచోట్ల వరి కోత దశకు రాగా, కొన్ని ప్రాంతాల్లో పొట్ట దశలో ఉంది. ఈదురుగాలులు, వర్షాలు పడితే పంట వెన్ను విరుగుతుంది. పూర్తిగా నేలపై పడిపోవటం వల్ల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంటుందని, గింజ కూడా చేతికి దక్కదని రైతులు వాపోతున్నారు.

30 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు..

ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 30 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలకు మొంథా తుఫాను వల్ల నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. జిల్లా వ్యాప్తంగా మామిడి 22 వేలు, మిర్చి 8 వేలు, కూరగాయలు వెయ్యి, పసుపు 400, అరటి 150, బొప్పాయి 200, పువ్వులు 400, జామ, సపోట, డ్రాగన్‌ఫ్రూట్, నిమ్మ ఇతర రకాల పండ్ల తోటలు వెయ్యి, పామాయిల్ 4 వేల హెక్టార్లలో సాగవుతోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.బాలాజీ కుమార్ తెలిపారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం..

- జిల్లాలో కలెక్టర్ లక్ష్మీశ సుడిగాలి పర్యటన
- క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం

కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ లక్ష్మీశ సోమవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. మొంథా తుఫాను నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షేత్రస్థాయిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విజయవాడ అర్బన్ పరిధిలో సున్నపుబట్టీల సెంటర్, గ్రంథాలయ రోడ్డు ప్రాంతంలో ఈనెల 24న కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, పరిస్థితిని అంచనా వేసి నివాసితులను పునరావాస శిబిరాలకు తరలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. మొగల్రాజపురం బీఎస్‌ఆర్‌కే మున్సిపల్ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, బెడ్డింగ్ మెటీరియల్, పారిశుద్ధ్యం ఉండాలని స్పష్టం చేశారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని విపత్తు ప్రతిస్పందన పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.



వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాల్లో వర్షపు నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డ్రెయిన్లను సిద్ధంగా వుంచాలన్నారు. గుర్రపుడెక్క వెంటనే తొలగించేలా చూడాలన్నారు. గ్రామ ప్రజల సమాచారం ఆధారంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో షిఫ్టుల వారీగా సిబ్బంది అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ పరిశీలన

జి.కొండూరు : మొంథా తుఫాన్ ప్రభావంతో బుడమేరు పరీవాహక ప్రాంతాల్లోని మండలాల్లో అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. గతేడాది బుడమేరుకు వచ్చిన ఫ్లాష్ ఫ్లడ్‌ను దృష్టిలో ఉంచుకొని అలాంటి పరిస్థితులు మరలా వస్తే ఎలా ఎదుర్కోవాలో రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందికి ఆయన వివరించారు. బుడమేరుకు వరద పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జి.కొండూరు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు నీరు నిలిపివేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కృష్ణా డెల్టాకు సాగునీటిని నిలిపివేసినట్టు కృష్ణా రివర్ కన్జర్వేటివ్ ఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కాలువలకు నీటి సరఫరా నిలిపివేశామన్నారు. సాగునీటి కాలువలతో పాటు డ్రెయినేజీలలోనూ ప్రస్తుతం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈఈ వివరించారు. ఈ నెలాఖరు వరకు పంట కాలువలకు నీరు విడుదల ఉండదని, వర్షం పరిస్థితులకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తామన్నారు. కాలువలు, డ్రెయిన్ల వద్ద క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి..

జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి



తుఫాను ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారిణి డి.ఎం.ఎఫ్.విజయకుమారి రైతులకు సూచించారు. ప్రస్తుతం వరి, పత్తి పంటలకు ఈ తుఫాను ప్రభావం ఉంటుందని, అయితే అధైర్య పడకుండా పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. చిన్నచిన్న యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను కాపాడుకోచ్చని వివరిస్తున్నారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో..

రైల్వేస్టేషన్ : మొంథా తుఫాను నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా, దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, ప్రయాణీకులు, సిబ్బంది రైల్వే ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాలను హై అలర్ట్ చేసింది. 29 వరకు తీరప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున, ప్రయాణికులు ఖచ్చితంగా అవసరమైతే మాత్రమే ప్రయాణించాలని అధికారులు సూచించారు. ప్రయాణికులు రైలు నడుస్తున్న స్థితిని తనిఖీ చేయాలని అభ్యర్థించారు. రైలు రద్దు, మళ్లింపులకు సంబంధించిన వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. విజయవాడ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే ఎప్పటికప్పుడు సమాచారాలను ప్రకటిస్తాయన్నారు.

కొండపల్లి స్టేషన్‌లో పనులకు ఆమోదం

రైల్వేస్టేషన్ : కొండపల్లి స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి ఫలితంగా పనులను చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే నుంచి అంబ్రెల్లా వర్క్స్ 2024-25లో ఆమోదం లభించింది. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ విషయాన్ని లేఖ ద్వారా ఎంపీ శివనాథ్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

రవాణాకు బ్రేక్

(5వ పేజీ తరువాయి)

కోస్తా ప్రాంతాలను అనుసంధానం చేసేవే. ఇవికాకుండా ఈస్ట్‌కోస్ట్ రైల్వే కూడా మచిలీపట్నం, విజయవాడ.. ఆపైకి వెళ్లే రైళ్లను రద్దు చేసింది. రాత్రి 8 గంటల నాటికి మొత్తం 100కు పైగా రద్దు చేశారు. విజయవాడ నుంచి విశాఖపట్నం, గుంటూరు, తెనాలి, మచిలీపట్నం, నర్సాపూర్, భీమవరం, తిరుపతి, కడప, కాకినాడ పోర్టు, రాజమండ్రి, రేపల్లె, తెనాలి, నిడదవోలు, భీమవరం టౌన్, ఒంగోలు మధ్య రాకపోకలు సాగించే రైళ్లన్నీ దాదాపు రద్దయ్యాయి. అలాగే, భువనేశ్వర్, షాలిమార్, హౌరా, పూరి, బెంగళూరు, పుదుచ్చేరి, చెన్నై మధ్య కూడా రైళ్ల రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వేషన్ ప్రయాణికులకు రిఫండ్ చెల్లించేందుకు రైల్వే అధికారులు ప్రత్యేక కౌంటర్లు సిద్ధం చేశారు.

రోడ్డు రవాణాపై స్వల్ప ప్రభావం

తుఫాను ప్రభావం ఆర్టీసీపై కాస్త తక్కువగా ఉంది. విజయవాడ నుంచి విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రికి నడిచే 22 సర్వీసులు రద్దయ్యాయి. ఇందులో విశాఖపట్నం నడిచేవి రెండు ఏసీ బస్సులు కాగా, మిగిలినవన్నీ అల్ట్రా డీలక్స్ సూపర్ లగ్జరీ బస్సులు. రోజూ విజయవాడ నుంచి విశాఖపట్నం 70 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో 10 మాత్రమే తగ్గించారు. కాకినాడ, రాజమండ్రి రూట్లలో 54 ఆర్టీసీ బస్సులు తిరుగుతుండగా, 12 తగ్గించారు. ప్రస్తుతం రవాణా అధికారుల తనిఖీల నేపథ్యంలో ప్రైవేట్ బస్సులు చాలావరకు నిలిచిపోయాయి. ప్రైవేట్ బస్సుల్లో టికెట్లు బుక్ చేసుకున్న వారంతా ఆర్టీసీ బస్సులవైపు వస్తున్నారు. మంగళవారం పరిస్థితిని బట్టి మరిన్ని ఆర్టీసీ సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉంది.

విమానాలు సగం రద్దు

విజయవాడ విమానాశ్రయం నుంచి భారీగా విమానాలు రద్దయ్యాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి మొత్తం మంగళవారం నడిచే 36 విమాన సర్వీసులు రద్దయ్యాయి. రద్దు చేసిన వాటిలో విజయవాడ నుంచి షార్జా, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు సర్వీసులు ఉన్నాయి. 80 శాతం విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రెడ్ అలర్ట్

(5వ పేజీ తరువాయి)

ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలో మంగళవారం అన్ని వాణిజ్య సముదాయాలను మూసివేయాలని వీఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కూరగాయలు, మందుల షాపులు మాత్రమే తెరుచుకోవాలని స్పష్టం చేశారు. ఈ వర్షపాతం ఎంత సమయంలో కురుస్తుందన్న ఆందోళనలో అధికారులు ఉన్నారు. 24 గంటల పాటు నమోదైతే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అంతకు తక్కువ సమయంలో కురిస్తే అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడతాయని అనుమానిస్తున్నారు. నీటమునిగే ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

గాలుల వేగం 35-40 కిలోమీటర్లు

ఉమ్మడి జిల్లాలో సోమవారం వరకు వాతావరణం ప్రశాంతంగానే ఉన్నప్పటికీ మంగళవారం సాయంత్రం నుంచి మొత్తంగా మార్పులు వస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం మొంథా తుఫాన్ కాకినాడకు 480 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది తీరం దాటేటప్పుడే అల్లకల్లోల పరిస్థితులు ఉంటాయి. జిల్లా మొత్తం సాధారణం నుంచి అతిసాధారణ వర్షపాతం నమోదవుతుంది. సుమారు 35-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు.

ముగిసిన అద్విక విచారణ

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ అధికారులు, పలువురు పోలీసులు అద్వికలో పెట్టుబడులు పెట్టారు. తెలంగాణాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.29 కోట్లను అద్వికలో పెట్టాడు. బాధితులంతా క్యూ కట్టడంతో మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదిత్య కుట్రపూరితంగా ఈ పెట్టుబడులు సేకరించినట్టు ప్రాథమికంగా గుర్తించిన పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు దర్యాప్తునకు సిట్‌ను నియమించారు. అద్విక ఖాతాల్లో వచ్చిన డబ్బు, ఈ ఖాతాల నుంచి ఎవరెవరి ఖాతాలకు ఎంతెంత వెళ్లిందన్న లెక్కలను సిట్ సాంకేతికంగా తేల్చింది.

సిట్ విచారణలో నిజాలు

ఈ కేసు దర్యాప్తునకు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి చీఫ్‌గా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆగస్టులో ఏర్పాటు చేశారు. ఈ సిట్ అద్విక లెక్కలను సాంకేతికంగా నిర్ధారించింది. లెక్కలు పూర్తిగా తేలడంతో ఆదిత్య, సుజాతతో పాటు వారికి సహకరించిన ఏజెంట్లు, ఉద్యోగులు మొత్తం 15 మందిని నిందితులుగా తేల్చారు. వారిలో కొంతమంది వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంతో వారికోసం ప్రత్యేకంగా పోలీసు బృందాలను పంపారు. అందరికీ సంకెళ్లు పడ్డాక సంయుక్తంగా మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రైవేట్ బ్యాంక్‌లో రికవరీ మేనేజర్‌గా పనిచేసిన ఆదిత్య భార్య సుజాత ఓ ప్రైవేట్ బ్యాంకు లాకర్‌లో తమ బంగారు ఆభరణాలు ఉంచారు. పోలీసులు బ్యాంకులకు వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆమె తెలివిగా వాటిని విడిపించుకుని తీసుకెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సిట్ సిబ్బంది కొద్దిరోజుల క్రితం ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

దుర్గమ్మకు భారీ ఆదాయం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ భారీగా ఆదాయం లభించింది. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. మహామండపం ఆరో అంతస్థులో ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. 44 హుండీల్లోని 167 సంచులను తెరిచి లెక్కించారు. రూ.4కోట్ల33 లక్షల85వేల655లతో పాటు 420 గ్రాముల బంగారం, 6 కిలోల 614 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ లభించాయి. 582 యూఎస్‌ఏ డాలర్లు, 22 సింగపూర్ డాలర్లు, 215 కెనడా డాలర్లు, 485 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దిర్హామ్స్), 15 సౌదీ రియాల్స్, 1 ఒమన్ బైసా, 18 ఖతార్ రియాల్స్, 23 మలేషియా రింగిట్స్, 15 యూరోప్ యూరోలు, 2 1/4 కువైట్ దీనార్‌లు, 250 ఆస్ట్రేలియా డాలర్లు, 15 ఇంగ్లండ్ పౌండ్లు లభించాయి. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ఎస్పీఎఫ్, వన్‌టౌన్ పోలీసులు, అమ్మవారి సేవాదారులు పాల్గొన్నారు.

నైపుణ్య పరీక్షలు వాయిదా

ప్రభుత్వాసుపత్రి : ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్య పరీక్షలను నవంబరు 5, 6 తేదీలకు వాయిదా వేసినట్టు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వి.రాధికరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేసినట్టు వివరించారు. ఈ మార్పును అభ్యర్థులు గమనించాలని కోరారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

ఇబ్రహీంపట్నం: దొనబండలోని రాతి క్వారీలో పనిచేస్తున్న కాచవరం గ్రామానికి చెందిన ఉప్పుతల కృష్ణ (25) సోమవారం ప్రమాద వశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని చికిత్స నిమిత్తం నిమ్రా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే కృష్ణ కిందపడి చనిపోయాడని, మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నేతలు డిమాండ్ చేశారు.

శివాలెత్తి..

(5వ పేజీ తరువాయి)

అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ముఖ్యంగా విజయవాడలో కీలక విభాగంలో పని చేసే అధికారుల పేర్లు చెప్పి బుకీల నుంచి భారీగా వసూళ్లు చేసినట్టు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వన్‌టౌన్‌లోని బంగారం మాఫియాతో ఈయనకు బంధం ఉన్నట్టు ప్రాథమికంగా తేలింది. వసూళ్లకు సంబంధించి ఒక జాబితాను ప్రత్యేకంగా సమకూర్చుకున్నట్టు వినికిడి. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విదేశీయానాలు చేయడం వాస్తవమేనని అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఈ ప్రయాణాలకు సంబంధించిన టికెట్ల డబ్బు అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించే ముఠాల నేతల ఖాతాల నుంచి చెల్లించినట్టు విజిలెన్స్‌లో ప్రచారం జరుగుతోంది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతడిని విజిలెన్స్ నుంచి కమిషనరేట్‌కు సరెండర్ చేసి వీఆర్‌లో ఉంచాలని నిర్ణయించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక సమాచారం సేకరించిన అధికారులు వాటిపై మరింత లోతుగా విచారణ చేయబోతున్నారని తెలిసింది.

విజయవాడ తూర్పు

'నిఘా' కార్యాలయంలో అవగాహన ప్రతిజ్ఞ

విజయవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాలనీలో ఉన్న జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది దీనికి సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం నుంచి నవంబరు 2 వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బంగారురాజు, వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఉమర్, డీఈ తులసి, ఏవో కిరణ్‌కుమార్, ఏఈలు విశ్వనాథ్, ఐశ్వర్యలు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లోని జిల్లా పరిశ్రమల కేంద్రం భవనం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు(ఫైల్ ఫొటో), డ్రెయినేజీలో పూడికతీత పనులు, ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

డీఐసీ వద్ద పూడికతీత పనులు

● మొంథా తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలోనే పనులు ● ఆటోనగర్‌లోని రోడ్లు ఛిద్రం

ఆటోనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జవహర్ ఆటోనగర్‌లోని రోడ్లు ఛిద్రంగా మారాయి. వంద అడుగుల రోడ్డుతోపాటు అంతర్గత రోడ్లలో సైతం వర్షపునీరు నిలిచింది. దీంతో వాహన చోదకులతోపాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చిన్నపాటి వర్షానికే ఆటోనగర్‌లోని జిల్లా పరిశ్రమ కేంద్రం కార్యాలయ(డీఐసీ) భవన సముదాయం నీటితో నిండిపోతుంది. దీంతో భవనంలోకి వెళ్లాలంటే సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తాయనే సమాచారం ఉండటంతో అధికారులు డీఐసీ కార్యాలయం వద్ద యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీ పనులు చేపట్టారు. యంత్రం సహాయంతో డ్రెయినేజీలోని పూడికను తీయించారు.

వర్షపునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డీఐసీ కార్యాలయం ప్రాంతంలోని డ్రెయిన్లలో పూడిక తీయించినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. మధు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



సహస్రలింగార్చన చేస్తున్న అర్చకులు, పాల్గొన్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు

దుర్గగుడిలో సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం రాత్రి సహస్ర లింగార్చన సేవ, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలు అత్యంత భక్తి నిష్ఠలతో జరిగాయి. అర్చకులు నమక, చమక పారాయణలతో సహస్రలింగార్చన చేశారు. ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి బృందం సహస్ర లింగార్చనలో బిల్వ పత్రాలు, వివిధ పుష్పాలను సమర్పించారు. మంత్ర పుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద స్వీకరణ చేశారు. ప్రదోష కాలములో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. భక్తులచే ప్రతిరోజూ సాయంత్రం 6.30లకు శ్రీమల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) నిర్వహిస్తున్నారు. సహస్ర లింగార్చనలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. దీపోత్సవలో భక్తులు దీపాలు వెలిగించారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆనవాయితీ ప్రకారం కార్తీక సోమవారం రాత్రి నూతన పూజా మండపంలో అన్నసంతర్పణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు, ఆలయ ఈవో శీనానాయక్‌లు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్తీక సోమవారం సందర్భంగా ఉపవాసం ఉన్న భక్తులు మల్లేశ్వరస్వామి వద్ద దీపారాధన చేసి ఉపవాసం విరమించి అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రి, ఏసీ చెన్ను రంగారావు, ఏఈవోలు సుధారాణి, కె.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను



పూజా కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు

మొగల్రాజపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మనిషి ధర్మబద్ధంగా జీవించడానికి సనాతన ధర్మం ఒక మార్గమని దాని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మొగల్రాజపురం ఆరో డివిజన్ అధ్యక్షుడు పల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో డివిజన్‌లో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ హిందూ ధర్మ పరిరక్షణకు జనసైనికులు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేశారు. కూటమి నాయకులు, స్థానిక మహిళలు, జనసేన వీర మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



శివాలయంలో రామలింగేశ్వరస్వామి



కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గురునానక్ కాలనీ శివాలయంలో ప్రత్యేక పూజలు

భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా గురునానక్ కాలనీ శివాలయంలోని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

జె లగ్జరీ హెయిర్, బ్యూటీ, ఆయుర్వేద సెంటర్ ప్రారంభం



జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద సెంటర్‌ను ప్రారంభిస్తున్న హీరో నవదీప్, నటి దివి, తదితరులు

భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అందానికి ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని హీరో నవదీప్, నటి దివి అన్నారు. గురునానక్ కాలనీ సర్వీస్ రోడ్డు మెక్‌డొనాల్డ్స్ సమీపంలో నూతనంగా జె లగ్జరీ హెయిర్, బ్యూటీ, ఆయుర్వేద సెంటర్‌ను ప్రముఖ హీరో నవదీప్, నటి, బిగ్‌బాస్ బ్యూటీ దివి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రఖ్యాతిగాంచిన జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద సెంటర్ నిర్వాహకులు విజయవాడలో కూడా సేవలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. బ్యూటీ సేవలతోపాటు ఆయుర్వేద సేవలు కూడా ఒకే చోట అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద సెంటర్ నిర్వాహకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాలలో మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉండాలి

అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



గాంధీజీ హై స్కూల్లో ఉన్న పునరావాస కేంద్రంలో అధికారులకు, సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

బెంజిసర్కిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాలన్నీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సోమవారం కృష్ణవేణి స్కూల్‌రోడ్డు, పటమట వీఎంసీ పాఠశాల, సత్యనారాయణపురం, ఏలూరు రోడ్డు, వన్‌టౌన్, గాంధీజీ మున్సిపల్ స్కూల్ ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత కృష్ణవేణి స్కూల్ రోడ్లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్, పటమట, బెంజిసర్కిల్ ప్రాంతాల్లోని వర్షపునీటి నిల్వలు లేకుండా శాశ్వత పరిష్కారంలో భాగంగా నిర్మిస్తున్న అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పటమట వీఎంసీ స్కూల్, సత్యనారాయణపురం ఏకేటీపీ స్కూల్, వన్‌టౌన్ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గాంధీజీ మున్సిపల్ స్కూల్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, వసతులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, సీఈ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, సీఎంహెచ్‌వో కె.అర్జునరావు, సీసీపీ కె.సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్లు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, ఈఈలు పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



యూజీడీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు

భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తూర్పుఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. సోమవారం 11వ డివిజన్‌లోని కరణంగారి బజార్ ఏరియాలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. ఆయన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యలను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావం వల్ల రానున్న రెండు, మూడు రోజులు జిల్లాలో విస్తారంగా వర్షాలు, ఈదురుగాలులు సంభవిస్తాయని తెలిపారు. కొండలపై నివాసాలు ఉండేవారు వర్షాలు తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా ఆయన కోరారు. నగరంలో భూగర్భ డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ డివిజన్‌లోని కరణంగారి బజారులోని భూగర్భ డ్రెయినేజీ సమస్యపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోనేరు రాజేష్, నాదెళ్ల రాజేష్, జాస్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో ఆన్‌లైన్ జర్నల్ విడుదల



జర్నల్ విడుదల చేస్తున్న కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్ తదితరులు

మొగల్రాజపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం రూపొందించిన ఆన్‌లైన్ పత్రికను కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్ సోమవారం విడుదల చేశారు. కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, వివిధ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఐటీ నిపుణులు తమ ప్రాజెక్టు వర్కులను, పరిశోధనా పత్రాలుగా ఈ ఆన్‌లైన్ సంచికలో ప్రచురించుకునే సౌలభ్యం ఉందని చెప్పారు. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ సిస్టం పేరుతో 31077218 ఈ ఐఎస్ఎస్ఎన్ నంబరుతో ఈ జర్నల్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జర్నల్ ప్రచురణ కర్త, సహాయాచార్యులు గడ్డం స్వామాట్ కృష్ణ, సంపాదక మండలి సభ్యులు, కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ డాక్టర్ టిఎస్ రవికిరణ్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మనరంజని, తదితరులు పాల్గొన్నారు.

ఉషారామా కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు

ఉంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలకు భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్-2025 లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్య, సాంకేతిక పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిలో కళాశాల సాధించిన విశేష ఫలితాలకు గుర్తింపుగా బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్ హైటెక్ సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ సీఈవో డి.గణేష్‌నాగ్ చేతులమీదుగా కళాశాల ఎక్స్‌లెన్స్ అవార్డుతోపాటు, కళాశాల ఏఐ విభాగాధిపతి కేపీఎస్‌వీ సత్యశ్రీ జ్యేష్ఠ ఆచార్య అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు రెండు అవార్డులు లభించిన సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

పునరావాస కేంద్రాలు ఇవీ

కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుపాను ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. నగరంలోని మూడు సర్కిల్స్‌లో 35 ప్రాంతాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడ అన్ని మౌలిక సదుపాయాలతోపాటు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేశారు. సర్కిల్ - 1లో 12, సర్కిల్ - 2లో 16, సర్కిల్ - 3లో 7 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి మూడు షిఫ్టులలో అక్కడికి వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సర్కిల్-3 పునరావాస కేంద్రాలు

15వ డివిజన్ 150 సచివాలయం, కృష్ణవేణి స్కూల్ రోడ్డు పటమటలంక, జేఎస్ఆర్ హై స్కూల్, ఇన్‌చార్జి కె.నరసింహారావు 9866996366 ● 15వ డివిజన్ 150 సచివాలయం, కృష్ణవేణి స్కూల్ రోడ్డు పటమటలంక, వీఎంసీ స్కూల్, ఇన్‌చార్జి కె.నరసింహారావు 9866996366 ● 16వ డివిజన్ 283 సచివాలయం, ఎస్ఎస్ఎం స్కూల్ రోడ్డు పటమట, జీడీఈటీ స్కూల్, ఇన్‌చార్జి వీరేంద్ర, ఫోన్ 9866996429 ● 17వ డివిజన్ 79 సచివాలయం, గుడ్‌మార్నింగ్ టీ స్టాల్, సిద్ధం కృష్ణరెడ్డి కమ్యూనిటీ హాలు, ఇన్‌చార్జి ఎం. శివరామకృష్ణ, ఫోన్ 8885191979 ● 18వ డివిజన్ 82 సచివాలయం, రాణిగారితోట, ఇన్‌చార్జి కె.కిషోర్ కుమార్, ఫోన్ 9866996401 ● 20వ డివిజన్ 106 సచివాలయం, వీఎంఆర్ స్కూల్ కృష్ణలంక, ఇన్‌చార్జి కె.వి. ప్రసాద్, ఫోన్ 7995218122 ● 21వ డివిజన్ 106 సచివాలయం, ఏపీఎస్ఆర్ఎం స్కూల్ కృష్ణలంక, ఇన్‌చార్జి పీ. సూర్యప్రకాష్, ఫోన్ 9959918989.

ఏపీ న్యాయవాదుల ఫెడరేషన్ కన్వీనర్‌గా ఏకే బాషా

ఏపీ మానవ హక్కుల కమిటీ చైర్మన్‌గా పిచ్చుక శ్రీనివాస్



ఏకే బాషా, పిచ్చుక శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ న్యాయవాదుల ఫెడరేషన్ కన్వీనర్‌గా బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా నియమితులయ్యారు. ఏపీ మానవ హక్కుల కమిటీ చైర్మన్‌గా బెజవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏకే బాషా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పథకం ద్వారా ఇచ్చే స్టైఫండ్ రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ జీవో ఇచ్చారు కానీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. మరణించిన న్యాయవాదులకు మ్యాచింగ్ ఫండ్ ఇస్తామన్నారని, ఆ జీవోను కూడా అమలు చేయాలని తెలిపారు. ఏపీ మానవ హక్కుల కమిటీ చైర్మన్ పిచ్చుక శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని బార్ అసోసియేషన్‌లను కలుపుకొని మానవ హక్కుల కమిటీ పనిచేస్తుందని తెలిపారు. త్వరలోనే కార్యాచరణ రూపొందించి కమిటీని రాష్ట్రవ్యాప్తంగా పనిచేసే విధంగా తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చుక్కపల్లి భాను, సప్పా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బాలాజీ బుడమేరు పరిశీలన

నందివాడ: మొంథా తుఫాను కారణంగా సోమవారం పుట్టగుంట వద్ద బుడమేరు ప్రాంతాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. అనంతరం నందివాడ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. జనార్థనపురంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ సోమవారం మధ్యాహ్నం నుంచి బుధవారం వరకు తీవ్రరూపం దాల్చుతుందన్నారు. మండల అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లోనే ఉండాలన్నారు. వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఎక్కడ ఏ గ్రామంలోను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు జనాభా లెక్కలు లిస్టులు తయారు చేయాలని సూచించారు. తహసీల్దార్ గురుమూర్తి, ఆర్ఐ గణేష్, డిప్యూటీ ఎంపీడీవో అమీర్ మీర్జా బాషా, ఎస్ఐ శ్రీనివాస్, మండల అధికారులు పాల్గొన్నారు.

మొత్తం అప్రమత్తం

● తుఫాను జోనల్ ప్రత్యేక అధికారి ఆర్‌పీ సిసోడియా ● అధికారులతో సమీక్ష



సీతారామపురంలో నేలవాలుతున్న పంటపొలాలు

మచిలీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తుఫాను జోనల్ ప్రత్యేకఅధికారి, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అన్నారు. తుఫాను అప్రమత్తతపై కలెక్టర్, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లోని మినీసమావేశపు హాలులో సోమవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గర్భిణులు, డయాలసిస్ పేషంట్లను తరలించే విషయంలో అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పునరావాసకేంద్రాల్లోని వారికి ఆహారం, తాగునీరు వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. 3 రోజులపాటు ప్రజలు ఇళ్లలోనే ఉండేలా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. కలెక్టర్ బాలాజీ, జేసీ ఎం నవీన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

పంటపొలాల మునక

మచిలీపట్నం టౌన్: మొంథా తుఫాను ప్రభావంతో బందరు రూరల్ మండలంలో వరి, వేరుశనగ శనగ పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పంట చేతికందే దశలో ఉండగా వేరుశనగ పంటకు భారీ నష్టం వాటిల్లింది. శిరివెళ్లపాలెం, తాళ్లపాలెం, తపసిపూడి, మేకావారిపాలెం, కరగ్రహారం, మంగినపూడి, కొత్తపూడి, గోపువానిపాలెం గ్రామాల్లో దాదాపు 160 ఎకరాల్లో రైతులు వేరుశనగ నాటారు. పంట చేతికందే దశలో ఉండగా భారీ వర్షాలతో పంటకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

వరిపంటకు వర్షం దెబ్బ

బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట విభిన్నరీతుల్లో ఉంది. కొన్ని గ్రామాల్లో పంట చేతికందే దశలో ఉండగా, మరికొన్ని గ్రామాల్లో పొట్ట పోసుకునే దశలో ఉన్నాయి. పలు గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. డ్రెయిన్లకు సరిగా పూడిక తీయక ఈ దుస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లు పొంగుతున్నాయి. సీతారామపురం, ఎస్ఎన్‌గొల్లపాలెం గ్రామాల్లో వరి పంట ముంపునకు గురవుతోంది. వరి పంట చిరుపొట్ట దశలో ఉండటం వల్ల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోతలు కోసే సమయంలో తుఫాను వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరో రెండు రోజులు వర్షం కురుస్తుందన్న సమాచారంతో పంట పొలాలు మరింత కోలుకోలేని నష్టం వాటిల్లే అవకాశాలు ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలిరండి

మొంథా తుపాను దృష్ట్యా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తీర ప్రాతాల ప్రజలు తరలి రావాలని అధికారులు కోరారు. గిలకలదిండిలోని పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ డీకే బాలాజీ, స్పెషల్ ఆఫీసరు అమ్రపాలి, జాయింట్ కలెక్టర్ నవీన్, తహసీల్దార్ మధుసూదనరావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు సందర్శించారు. అలాగే మంగినపూడి, పెదపట్నం పునరావాస కేంద్రాలను తహసీల్దార్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై సత్యనారాయణ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మచిలీపట్నం 50వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సందర్శించారు. పునరావాస కేంద్రాలకు తీర ప్రాంత ప్రజలను గుడిసె వాసులను, పాతకాలం నాటి శిథిలమైన గృహాల్లో నివసించేవారిని తరలింపు చర్యలు చేపట్టారు. చిన్నాపురం జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మాజీ ఎంపిపి , బందరు రూరల్ మండలం అధ్యక్షుడు కాగిత వెంకట్రావు సందర్శించారు. కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ, బందరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు పలువురు టీడీపీ, జనసేన నేతలతో కలిసి సోమవారం పునరావాస కేంద్రాలను సందర్శించారు.



గిలకలదిండి పునరావాస కేంద్రాన్ని సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ అమ్రపాలి, జాయింట్ కలెక్టర్ నవీన్, తహసీల్దార్ మధుసూదనరావు



కృత్తివెన్ను తహసీల్దార్ ఆఫీసులో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్

కృత్తివెన్నులో ముందస్తు జాగ్రత్తలు



కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం- పోడు రహదారిని బ్లాక్ చేసిన ఎస్సై పైడిబాబు

కృత్తివెన్ను: మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు అధికారులు, నేతలు, మరోపక్క రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. సోమవారం తుఫాను ప్రభావం అంతగా లేకపోయినా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార వ్యవస్థ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉదయం కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ మండలంలో పర్యటించి, ఒర్లగొందితిప్పలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించి లోతట్టు గ్రామ ప్రజలతో మాట్లాడారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పోడు, పడతడిక, ఇంతేరు, ఒర్లగొందితిప్ప గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధికారులు, నేతలు అందుబాటులో ఉంటారన్నారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ నెక్కంటి భాస్కరరావు, పార్టీ మండలాధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, కార్యదర్శి యాదంరెడ్డి కొండ, దేవస్థాన ఛైర్మన్ చేకూరి వెంకట్రావు పాల్గొన్నారు.

అప్రమత్తమైన అధికారులు

ఉన్నతాధికారుల పర్యటనల నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి తేలికపాటి వర్షాలు, గాలి ఉండటంతో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలో 6 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు గ్రామ ప్రజలను తరలించారు. అధికారులంతా రేయింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ, పరిస్థితులను సమీక్షిస్తూ జాగ్రత్తలు తీసుకుంటారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శశికుమార్ తెలిపారు. లక్ష్మీపురం నుంచి పోడు వెళ్లే రహదారిపై నీరు అధికంగా చేరి, రోడ్డు మునిగిపోవటంతో ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఎస్సై పైడిబాబు ఆ రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును బ్లాక్ చేశారు. ప్రత్యామ్నాయంగా చందాల రోడ్డును వాహనదారులు వినియోగించుకోవాలని సూచించారు.

రైతులకు తప్పని తిప్పలు

మొంథా తుఫాను ప్రభావంతో తమ పంటలను కాపాడుకొనేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పొట్ట దశలోనున్న వరిపంటకు తుఫాను తీరని నష్టాన్ని మిగిల్చేలా ఉందని, చేసేదేం లేక రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఆక్వా రైతులు మాత్రం తమ చేపలు, రొయ్యల చెరువులను కాపాడుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రెయిన్లు ఇప్పటికే పొంగి పొర్లటంతో చెరువుల్లోని సరుకు బయటకు పోతుందన్న భయంతో చెరువుల చుట్టూ వలలు కడుతున్నారు. నీటిని ఇంజన్లతో బయటకు తోడేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోపక్క వాతావరణం చల్లబడటం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న భయంతో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ కొరత రాకుండా నిరంతరాయంగా రేడియేటర్లు తిప్పేందుకు అదనపు జనరేటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటి కోసం డీజిల్‌ను ముందుగానే తగిన మోతాదులో ఉంచుకుంటున్నారు. మరోవైపు కృత్రిమ ఆక్సిజన్ కోసం ట్యాబ్‌లెట్లు, పౌండర్లను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు తుపాను ప్రభావంతో మత్స్యకారులు తమ చేపల వేటను నిలిపి, బోట్లను ఒడ్డుకు చేర్చారు.



కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్పలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత

నేడు నగరంలో భారీ వర్షపాతం

● కమిషనర్ ధ్యానచంద్ర ● ప్రజలు అత్యవసర సేవల కోసం తప్ప బయటకు రావద్దు

కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో 28న మంగళవారం భారీ వర్షపాతం నమోదవుతుందని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశాల మేరకు, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుఫాను ప్రభావం అక్టోబర్ 28న జిల్లాలో, ముఖ్యంగా నగరంలో సుమారు 168 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిందన్నారు. జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలందరూ తమ ఇళ్లలోనే ఉండాలని విజ్ఞప్తి చేశారు. అన్ని దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని, ప్రజల సురక్షితార్థం ఈ చర్యలన్నారు. ప్రజలు అత్యవసర సేవలకు మాత్రమే (ఆరోగ్య సేవలు, ఆహార సేవలు మొదలైనవి) బయటకు రావాలన్నారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాలు విక్రయాలు వంటి అవసరమైన సేవా కేంద్రాలు మాత్రమే తెరిచి ఉండాలని, అనవసర ట్రాఫిక్ రద్దీని నివారించాలన్నారు. అవసరంలేని ప్రయాణాలు, షాపింగ్, వినోదం, ఉదయపు నడకలు, పార్కుల సందర్శనలు మొదలైనవి పూర్తిగా నివారించాలని ప్రజలని కోరారు. ప్రజలందరూ ఈ హెచ్చరికను గౌరవించి, ప్రజలందరూ జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డిస్ట్రిక్ట్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్: 9154970454, వీఎంసీ కంట్రోల్ రూమ్ 0866-2424172, 2422515,2427485 నంబర్లను సంప్రదించాలన్నారు.

జేసీ నవీన్ పునరావాస కేంద్రాల సందర్శన

మోపిదేవి: మొంథా తుఫాను ప్రభావంతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అధికార వ్యవస్థ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ నవీన్ చెప్పారు. సోమవారం మండలంలోని మోపిదేవి వార్పు ప్రాంతాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలను పరిశీలించారు. మోపిదేవి వార్పు వద్ద మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో 13 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వాటికి ఉద్యోగులను ఇన్‌చార్జులుగా నియమించటం జరిగిందని తహసీల్దార్ హరినాథ్ జేసీకి తెలిపారు. మండల ప్రత్యేకాధికారి హాజీ బేగ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పీ సాయిబాబు, ఎంపీడీవో స్వర్ణభారతి, ఎంఈవో గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



తుఫాను ముప్పు ప్రాంతాల్లో జేసీ పర్యటన

కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు జేసీ ఇలక్కియా, ఆర్డీఓ కావూరి చైతన్య సోమవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జేసీ కొండపల్లిలో పర్యటించి ముంపు పొంచి వున్న ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో, ట్రక్ టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తిరువూరు ఆర్డీఓ కె.మాధురితో కలిసి తిరువూరులోని భగత్‌సింగ్ కాలనీ, గంపలగూడెం పునరావాస కేంద్రం, కట్టలేరు వాగు బ్రిడ్జిని పరిశీలించారు. నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోని విలియమ్స్ పేటను, ఊర చెరువును పరిశీలించగా, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య 46వ వార్డులోని దుర్బల (వల్నరబుల్) భవనాలను, సితార సెంటర్ వద్ద కొండ చరియల ముప్పు వున్న ప్రాంతాలలో పర్యటించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తుఫానును ఎదుర్కొనేందుకు చేసిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పటమట రైతుబజార్

కిక్కిరిసిన రైతుబజార్లు

● రికార్డు స్థాయిలో మధ్యాహ్నానికే సుమారు వెయ్యి టన్నుల అమ్మకం ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

విజయవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మూడు రోజుల పాటు అప్రమత్తత హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని రైతు బజార్లపై స్పష్టంగా ప్రభావం కనిపించింది. సోమవారం ఉదయం నుంచే వినియోగదారులు భారీ సంఖ్యలో బజార్లకు వచ్చి కూరగాయలు కొనుగోళ్లు చేశారు. న్యూస్ ఛానెల్స్ ద్వారా తుఫాను అప్‌డేట్స్ చూసిన ప్రజలు ముందస్తు సన్నాహాల్లో భాగంగా రెండు జిల్లాలోని 22 రైతు బజార్లలో జనాలు బారులు తీరారు. ఎన్టీఆర్ జిల్లాలో 14, కృష్ణా జిల్లాలో 8 రైతు బజార్లలో రద్దీ ప్రభావం ఒకేలా కనిపించింది. నందిగామ, జగ్గయ్యపేట, పటమట, కేదారేశ్వరపేట, కృష్ణలంక, భవానీపురం, మచిలీపట్నం వంటి ప్రాంతాల రైతుబజార్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. సెలవు/పండగ రోజుల్లో కనిపించే రద్దీ కన్నా రెండు మూడు రెట్లు రద్దీ కనిపించింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రద్దీ తగ్గకపోవడం గమనార్హం. మధ్యాహ్నానికే బజార్లలో కూరగాయలు పూర్తిగా అమ్ముడుపోయాయి. సాధారణంగా ప్రతిరోజు తీసుకువచ్చే సరుకు కంటే రెట్టింపు మేర తెచ్చినా సరిపోలేదు. స్టాల్ నిర్వాహకులు అదనంగా నాలుగోవంతు కూరగాయలు తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు. సాధారణ అమ్మకాలతో పోల్చితే సోమవారం రెట్టింపు వ్యాపారం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటున 400 టన్నుల కూరగాయల అమ్మకం జరిగేదని, తుఫాను ప్రభావంతో సోమవారం మధ్యాహ్నానికే సుమారు వెయ్యి టన్నుల కూరగాయలు అమ్ముడుపోయాయని స్టాల్ నిర్వాహకులు తెలిపారు. తుఫాను అంచనాలకు అనుగుణంగా రైతులు, వ్యాపారులు ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల రద్దీకి తగ్గట్టు సరుకును అందించగలిగారు. ప్రజలు మూడు రోజులకు సరిపడా కూరగాయలను తీసుకెళ్లడంతో బజార్లు త్వరగా ఖాళీ అయిపోయాయి.



మధ్యాహ్నానికే ఖాళీగా దర్శనమిస్తున్న రైతుబజార్

బాలికపై లైంగిక దాడికి వృద్ధుడి యత్నం

● పోక్సో కేసు నమోదు

ఉంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుని ఘటన మరువక ముందే కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, నారయ్య అప్పారావుపేటలో మరో ఘటన చోటుచేసుకుంది. 70 ఏళ్ల వయసులో ఉన్న వృద్ధుడు మనవరాలి వయసున్న బాలికపై (9)అత్యాచారానికి యత్నించినట్టు ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్సై ఎన్ లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిమ్మకూరి రత్నం (76) భార్యాపిల్లలెవరూ లేకపోవడంతో ప్రభుత్వ పించన్ డబ్బుతో ఒంటరిగా ఓ పూరిగుడిసెలో జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన 4వ తరగతి చదువుతున్న బాలిక పట్ల ఆదివారం రాత్రి అసభ్యంగా ప్రవర్తించడాన్ని 10వ తరగతి చదువుతున్న బాలిక అక్క (15) గుర్తించింది. వెంటనే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వృద్ధుడిని నిలదీశారు. తానేమీ చేయలేదని వృద్ధుడు బుకాయించాడు. దీంతో తల్లిదండ్రులు బాలికను అడగ్గా తాత తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసునమోదు చేసి వృద్ధుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్సై తెలిపారు.



ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహిస్తున్న ప్రభాకరరావు (ఫైల్)

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో పర్వతారోహకుడు అనుమోలు పేరు


పెనమలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోరంకికి చెందిన పర్వతారోహకుడు అనుమోలు ప్రభాకరరావు పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదైంది. 67 ఏళ్ల వయోజ్ఞుడు ప్రభాకరరావు యూరప్‌లోని 5642 మీటర్ల ఎత్తయిన అత్యున్నత శిఖరం మౌంట్ ఎల్బ్రస్‌ను ఈ యేడాది ఆగస్టు 6న మరో పర్వతారోహకుడు బొబ్బా గోపాలకృష్ణతో కలిసి అధిరోహించినందుకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆయన పేరు నమోదయినట్లు సంస్థ ప్రతినిధులు సోమవారం అనుమోలుకు సమాచారం ఇచ్చారు. రికార్డు పుస్తకాల్లో నమోదయిన అనుమోలుకు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ కూటమి నేతలు అభినందనలు తెలిపారు. అనుమోలు ప్రభాకరరావు 2024లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని, 2024లో ఎవరెస్టు బేస్ క్యాంపును చేరి పర్వతారోహణలో తన సాహసాలను ప్రదర్శించి యువతలో స్ఫూర్తిని నింపారు.

ఎన్టీఆర్ వైద్యసేవలు నేటినుంచి బంద్

● ప్రభుత్వ వైఖరికి నిరసనగా సేవలు బంద్

విజయవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆషా) ఆధ్వర్యంలో 650 ఆసుపత్రుల్లో అన్ని రకాల ఎన్టీఆర్ వైద్య సేవలు ఇప్పటికే నిలిపివేశారు. మంగళవారం నుంచి ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లోను సేవలు నిలిపివేయాలని అసోయేషన్ సోమవారం నిర్ణయం తీసుకుంటూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించాయి. ప్రైవేటు కంటి ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద జరుగుతున్న వైద్య సేవలను నిలిపివేయాలని ఆషా తాజాగా నిర్ణయం తీసుకుంది. స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ సమ్మెకు విశాఖ హెల్త్ సిటీ హాస్పిటల్స్ మద్ధతు ప్రకటించినట్టు తెలిపింది. ఆషా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం వైఖరికి నిరసనగా మిగిలిన ఆసుపత్రులు కూడా మద్ధతు తెలిపాయి.

స్విట్జర్లాండ్ విద్యాయాత్రలో స్కాట్‌స్పైన్ విద్యార్థులు



భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల ఐఐఎంయుఎన్ ఆధ్వర్యంలో ఇటీవల స్విట్జర్లాండ్‌లో విద్యాయాత్ర 2025 జరిగింది. విజయవాడ స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల నుంచి సీఈవో కొడాలి జాహ్నవి, విద్యార్థులు మండవ కృష్ణ ప్రద్యుమ్న (టెన్త్), విట్టికుట్టి వైనవి (టెన్త్), గనిక ప్రణవ్ (9వ తరగతి), గన్నెడ శ్రీరుత్విక (8వ తరగతి) పాల్గొన్నారు. ఇందులో వీరు విశ్వవ్యాప్త నాయకత్వ లక్షణాలు వంటి అంశాలను మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ సీఈఆర్ఎన్, సంయుక్త రాష్ట్రాల ప్రధాన కార్యాలయాలను సందర్శించారు. ప్రస్తుతం జెనీవాలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయం, అంతర్జాతీయ సంస్థలకు స్విట్జర్లాండ్ శాశ్వత ప్రతినిధిగా ఉన్న జుర్గ్ లాబెర్, క్లేర్ వాల్ష్, లారెంట్ వెహర్లి, డేరెన్ టాంగ్ హెంగ్ షిమ్ లను కలుసుకున్నారు. ఏపీ తరపున పాల్గొనడానికి మొట్టమొదటి గొప్ప అవకాశాన్ని పొందింది స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు మాత్రమేనని తెలిపేందుకు ఆనందిస్తున్నట్టు స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులకు యాజమాన్యం, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రభారతి సంస్థల ఛైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, డైరెక్టర్ వీరమాచినేని శాంతి మాట్లాడుతూ ప్రపంచ వేదికపై తమ ప్రతిభను చాటిన విద్యార్థుల నైపుణ్యాలను కొనియాడారు

బాలికతో అసభ్య ప్రవర్తన.. ఇద్దరిపై పోక్సో కేసు

చందర్లపాడు: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి చెందిన బాలికకు విజయవాడకు చెందిన ఒక యువకుడితో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో సదరు యువకుడు సోమవారం ముప్పాళ్ల వచ్చి ఇంట్లో ఉన్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. సమీపంలో ఉన్నవారు గమనించి కేకలేయడంతో పరారయ్యాడు. బాలికను వైద్యం నిమిత్తం నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో యువకుడితో పాటు సహకరించిన మరో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు అమరావతిలో జాబ్‌మేళా

కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్‌డీఏ సౌజన్యంతో అక్టోబరు 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆర్‌వీఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీఐఈఎల్ (ఈనాడు), దుర్గా ఏజెన్సీస్, మాత్రే హ్యూమన్ రిసోర్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్, ప్రింగిల్ ఐటీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూ చెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. వివరాలకు సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్, లేదా శ్రీకర్-9963425999 కాల్ చేయవచ్చు.

మీకు తెలుసా?



వీటితో కాలేయ కొవ్వు

ధూమపానం, మద్యపానం కాలేయ కొవ్వును పెంచుతాయనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఆరోగ్యకరమైన ఆహారంగా భావించే కొన్ని పదార్థాలు కూడా ఇందుకు దోహదపడుతూ ఉంటాయి. కాలేయ కొవ్వును పెంచే ఆ పదార్థాలు ఇవే!

- **కొవ్వు తొలగించని పాల ఉత్పత్తులు:** పాలు, చీజ్, మీగడ పెరుగు పోషకభరితమైనవే! అయితే వీటి పరిమితి మించితే కాలేయానికి చేటు తప్పదు. కొవ్వు తొలగించని పాల ఉత్పత్తులకూ కాలేయ కొవ్వుకూ సంబంధం ఉంటుందనే ఒక అధ్యయనం తాజాగా అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది.
- **బేక్ ఉత్పత్తులు:** ఎక్కువ శాతం బేకరీ ఉత్పత్తులన్నీ శుద్ధి చేసిన పిండి, శుద్ధి చేసిన చక్కెరలతోనే తయారవుతాయి. వీటిలో పోషకాలతో నిండిన పైపొర కొరవడుతుంది. కాబట్టి వీటితో తయారయ్యే బ్రెడ్, పేస్ట్రీలు, మఫిన్లు.. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ ముప్పును పెంచుతాయి. అన్నం, బ్రెడ్, నూడుల్స్ వల్ల జపాన్ మహిళల్లో కాలేయ కొవ్వు పెరిగినట్టు, క్లినికల్ న్యూట్రిషన్‌లో ఒక అధ్యయనం ప్రచురితమైంది.
- **ప్రొటీన్ బార్స్:** నట్స్, సీడ్స్, ఖర్జూరాలు, ఓట్స్.. ఇలా ఆరోగ్యకరమైన పదార్థాలతో తయారయ్యే ప్రొటీన్ బార్స్‌లో కూడా హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లాంటి అనారోగ్యకరమైన తీపిని ఉపయోగిస్తారు. కాబట్టి ప్రొటీన్ బార్స్‌ను అతిగా తినడం వల్ల కాలేయ కొవ్వు ముప్పు కూడా పెరుగుతుంది.
- **నట్స్:** అఫ్లాటాక్సిన్ మౌల్డ్ అనే విషపూరిత ఫంగస్ వేడిగా, తేమగా ఉండే వాతావరణాల్లో వృద్ధి చెందుతుంది. వేరుసెనగ, బాదం, పిస్తా, వాల్‌నట్స్, క్వినోవాల్లో ఈ ఫంగస్ పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి ఈ నట్స్‌ను కొన్న రెండు నెలల్లోపే తినడం మంచిది. అలాగే తినే ముందు వీటిని నీళ్లలో నానబెట్టడం ఉత్తమం.
- **తీపి పానీయాలు:** పండ్ల రసాలు ఆరోగ్యకరమే! కానీ సీసాల్లో దొరికే రెడీమేడ్ పండ్ల రసాల్లో చక్కెరలు అధిక మోతాదుల్లో ఉంటాయి కాబట్టి ఇవి కాలేయ కొవ్వును పెంచుతాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.
- **ఎండిన పండ్లు:** ఎండుద్రాక్ష, ఎండు అప్రికాట్స్, ఎండుఖర్జూరాల్లో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా కాలేయ కొవ్వు పెరిగే అవకాశం ఉంటుంది కాబట్టి వీటిని పరిమితంగా తినాలి.

ఫుట్ కేర్



ముఖం మీద కనబరిచినంత శ్రద్ధ పాదాల మీద కనబరచం. మరీ ముఖ్యంగా కాలి గోళ్లలో చోటుచేసుకునే మార్పులు, సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. కానీ కాలి గోళ్ల ఇన్‌ఫెక్షన్లను అశ్రద్ధ చేయడం అత్యంత ప్రమాదకరం అంటున్నారు పోడియాట్రిక్ సర్జన్, డాక్టర్ నరేంద్రనాథ్ మేడ.

కాలి గోళ్ల సమస్యలు

గుంభనంగా...

గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు.. ఇలా మనందరం ప్రధానమైన అవయవాల ఆరోగ్యం మీదే దృష్టి పెడుతూ ఉంటాం. కానీ కాలి గోళ్ల మీద మనకెప్పుడూ ఆసక్తి ఉండదు. భరించలేని నొప్పి వేధించినప్పుడు, నడక ఇబ్బందికరంగా మారినప్పుడు మాత్రమే మన దృష్టి కాలిగోళ్ల వైపు మళ్లుతుంది. కానీ ఆరోగ్యం గోళ్లలో ప్రతిబింబిస్తూ ఉంటుందని ఎంతమందికి తెలుసు? రంగు మారడం, మందంగా మారిపోవడం లేదా ఆకారంలో మార్పులు చోటుచేసుకోవడం లాంటివి పలు రకాల ఇన్‌ఫెక్షన్లు, కంటికి కనిపించని రుగ్మతలను సూచిస్తాయి.

రంగు మారితే...

ఆరోగ్యకరమైన గోళ్లు నునుపుగా, లేత గులాబీ రంగులో మెరుస్తూ ఉండాలి. అయితే కాలి గోళ్లు పసుపు, గోధుమ రంగు, ఆకుపచ్చగా మారితే వాటిలో ఏదో సమస్య మొదలైందని అర్థం. గోళ్లు రంగు మారడానికి, వాటికి సోకే ఫంగల్ ఇన్‌ఫెక్షన్లే ప్రధాన కారణం. ప్రత్యేకించి గంటల తరబడి బూట్లు వేసుకునే వాళ్లు, లేదా జిమ్స్, ఈత కొలనుల దగ్గరి తడి వాతావరణంలో ఎక్కువ సమయాలు గడిపే వాళ్లలో ఈ సమస్య ఎక్కువ. అయితే గోళ్లు రంగు మారితే దాన్నొక తీవ్రమైన సమస్యగా పరిగణించేవారు ఎంతో తక్కువ. నెయిల్ పాలిష్ వల్ల గోళ్లు రంగు మారి ఉంటాయని కొందరు సర్దుకుపోతూ ఉంటారు. కానీ ఇదే సమస్యను నిర్లక్ష్యం చేస్తే, ఈ ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు మరింత పెరిగి గోళ్లు మరింత మందంగా, పెళుసుగా మారిపోతాయి. కొన్ని తీవ్రమైన పరిస్థితుల్లో ఆ ఇన్‌ఫెక్షన్ గోళ్ల నుంచి, చుట్టూరా ఉన్న చర్మానికి వ్యాపించి, నడక, బూట్లు ధరించడం కష్టమైపోతుంది.

గోరు లోపలకు పెరిగితే...

అత్యంత సాధారణంగా కనిపించే మరొక సమస్య ఇది. గోరు మూలలు కాలి వేలి లోపలకు పెరుగుతూ ఉంటాయి. సాధారణంగా బొటనవేలి గోళ్లలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. బిగుతైన బూట్లు, గోళ్లను సక్రమమైన తీరులో కత్తిరించుకోకపోవడం, గోటికి దెబ్బ తగలడం వల్ల గోరు లోపలకు పెరగడం మొదలుపెడుతుంది. మొదట్లో వేలు కందిపోయి, ఎర్రగా మారి నొప్పి పెట్టడం మొదలుపెడుతుంది. గోరు లోపలకు పెరిగేకొద్దీ, వేలు మొత్తం వాచిపోతుంది. చీము పట్టి, నడక కష్టమైపోతుంది. మధుమేహం, రక్త ప్రసరణ తగ్గడం లేదా వ్యాధినిరోధకశక్తి బలహీనపడడం లాంటి సమస్యలు తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తాయి. కొన్ని సందర్భాల్లో గోళ్లలో కొంత భాగాన్ని తొలగించవలసి వస్తుంది. అరుదుగా కొందర్లో పూర్తి వేలునే తొలగించవలసి రావచ్చు.

గోళ్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం ఎందుకు?

చాలా మంది గోళ్ల సమస్యలను గృహవైద్యాలతో సరిదిద్దే ప్రయత్నం చేస్తూ ఉంటారు. నొప్పి, అసౌకర్యాల నుంచి ఉపశమనం కోసం వెనిగర్‌లో పాదాలను నానబెట్టడం లేదా గోళ్లను కత్తిరించుకోవడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే వీటితో కొంతమేరకు ఉపశమనం లభించవచ్చు. కానీ అసలు సమస్య పరిష్కారం అవక, మరింత తీవ్రమవుతుంది. గోళ్ల ఇన్‌ఫెక్షన్లు వాటంతట అవే మానిపోవనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. వాటికి సరైన వ్యాధినిర్ధారణ, చికిత్సలు అవసరమవుతాయి. గోళ్ల సమస్యలను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లకపోవడానికి మరొక కారణం కూడా ఉంది. కొందరు రంగు మారిన గోళ్లను వైద్యులను చూపించడానికి సిగ్గుపడి, సొంత చికిత్సలతో సరిపెట్టుకుంటూ ఉంటారు. చివరకు సమస్య తీవ్రమైన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లోనే వైద్యులను కలుస్తూ ఉంటారు. అయితే గోళ్లకు సోకే ఇలాంటి సమస్యలను సరిదిద్దడం కోసమే పోడియాట్రిస్ట్‌లు ఉంటారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

> **గోళ్లలో మార్పులు అందుకే...**
>
> గోళ్లు... కాలి వేళ్లకు రక్షణ కల్పించడంతో పాటు, మన ఆరోగ్యాన్నీ, జీవనశైలినీ ప్రతిబింబిస్తాయి. పలు రకాల అనారోగ్య సమస్యలు గోళ్లలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. కాబట్టి ఈ దిగువ మార్పుల మీద ఓ కన్నేసి ఉంచాలి
>
> - **క్లబ్ నెయిల్స్:** సరిపడా ఆక్సిజన్ అందక, గోళ్లు ఉబ్బెత్తుగా మారే సమస్య ఇది. దీన్ని గుండె సమస్యకు సూచనగా భావించాలి
> - **పెళుసుబారితే:** పాదాలకు రక్తప్రసరణ తగ్గినప్పుడు గోళ్లు పెళుసుబారిపోతాయి. కాబట్టి దీన్ని కూడా గుండె సమస్యగా భావించవచ్చు
> - **పసుపు గోళ్లు:** కామెర్ల వ్యాధిలో ఈ లక్షణం కనిపిస్తుంది
> - **నలుపు రంగు గోళ్లు:** ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు సూచన



ఈ జాగ్రత్తలు పాటించాలి

- **పొడిగా, శుభ్రంగా:** ప్రతి రోజూ పాదాలను శుభ్రంగా కడిగి, వేళ్లు, గోళ్ల దగ్గర తడి లేకుండా పొడిగా తుడుచుకోవాలి
- **గోళ్లు కత్తిరించాలి:** మూలలను గుండ్రంగా కత్తిరించుకోకుండా, నేరుగా కత్తిరించుకోవాలి
- **గాలి చొరబడేలా:** పాదాలకు సౌకర్యంగా ఉండేలా, గాలి చొరబడేలా ఉండే బూట్లనే ఎంచుకోవాలి
- **సాక్స్‌లు:** ప్రతి రోజూ సాక్సులు మార్చుకుంటూ ఉంటే, ఫంగస్ వృద్ధి చెందదు
- **నడక:** బహిరంగ ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడం మానేయాలి. మరీ ముఖ్యంగా ఈత కొలనులు అక్కడి లాకర్ రూమ్స్‌లో చెప్పుల్లేకుండా నడవడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకే ముప్పు ఉంటుంది
- **వైద్యులను కలవాలి:** వాపు, నొప్పి కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి
- **పెడిక్యూర్ :** మధుమేహులు, గోళ్లకు ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకినవారు, మెడికేటెడ్ పెడిక్యూర్ కోసం పోడియాట్రిస్ట్‌లను మాత్రమే ఆశ్రయించాలి
- **నెయిల్ ఎక్స్‌టెన్షన్లు:** వీటిలో జిగురు వల్ల గోళ్లకు ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి గోళ్ల సమస్యలు ఉన్నవాళ్లు వీటికి దూరంగా ఉండాలి
- **రక్తం గడ్డకడితే:** ఆరోగ్యవంతులకు గోళ్ల అడుగున ఏర్పడే చిన్నపాటి రక్తపు గడ్డలతో ప్రమాదం ఉండదు. అయితే సమస్య తీవ్రమైనప్పుడు వైద్యులను కలవడానికి వెనకాడకూడదు. అయితే మధుమేహులు గోళ్లకు దెబ్బలు తగిలి, రక్తం గడ్డలు ఏర్పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను కలవడం మంచిది.

పోడియాట్రిస్ట్ అంటే?

పాదాలు, గోళ్లు, దిగువ అవయవాలకు సోకే ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులను నిర్ధారించి చికిత్స చేసే వైద్య నిపుణులనే పోడియాట్రిస్ట్ అంటారు. సాధారణ వైద్యులకు భిన్నంగా పోడియాట్రిస్ట్‌ల దగ్గర ప్రత్యేకించి పాదాలు, గోళ్లకు సంబంధించిన రుగ్మతలను నయయం చేసే అధునాతన వైద్య పరికరాలు, చికిత్సలు అందుబాటులో ఉంటాయి. ఫంగల్, బ్యాక్టీరియల్...వీటిలో గోళ్లకు సోకిన సమస్య ఏదన్నది వీళ్లు మాత్రమే కనిపెట్టగలుగుతారు. దెబ్బ తగలడం వల్ల గోరు దెబ్బ తిందా లేదంటే, దీర్ఘకాల మధుమేహం వల్ల దెబ్బ తిందా అన్నది కూడా ఈ వైద్యులే కనిపెట్టగలుగుతారు. వ్యాధి సోకిన గోళ్లకు యాంటీఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ మందులతో, సున్నితమైన గోటి చికిత్సలతో, లేజర్ థెరపీతో సరిదిద్దుతారు. లోపలకు పెరిగిన గోళ్లను నేర్పుగా కత్తిరించి సమస్యను సరిదిద్దగలుగుతారు. అలాగే సమస్య రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలను కూడా సూచిస్తారు.

డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
హెచ్‌ఒడి అండ్ సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జన్,
పోడియాట్రిక్ సర్జన్,
కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్



మానసిక ప్రశాంతత

ధ్యానం... అమోఘం!

ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సహజం. ఫలితంగా చికాకు, విసుగు, అనాసక్తత ఆవరించి జీవన నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి వీటిని వదిలించుకోవాలంటే మానసిక ప్రశాంతత చేకూర్చుకోవాలి. ఇందుకు అనువైన మార్గం 'ధ్యానం'!

ధ్యానం చేయమంటే, కదలకుండా కూర్చుని చేసే ధ్యానంతో ఒరిగేదేముంది? అనిపిస్తుంది. అసలు అందరూ అలా ఎలా మౌనంగా, నిశ్చలంగా ధ్యానం చేయగలుగుతున్నారు? అందులో ఆనందం ఏముంటుంది? అనే అనుమానమూ వస్తుంది. అయితే ధ్యానం అనేది కదలికలతో కూడుకున్న వ్యాయామం, కార్యక్రమం, చర్య కాదు. మనసు పెట్టి చేయవలసిన క్లిష్టమైన పని అంతకన్నా కాదు. అదొక విశ్రాంత స్థితి. నిద్రను మించిన లోతైన నిద్రావస్థ స్థితి. ఈ స్థితిలో మనసు స్థిరంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడులు, ఆందోళనలు తొలగి మనసు నిర్మలమవుతుంది. ఆ స్థితికి చేరుకోవడాన్నే 'ధ్యానం' అంటారు. వినడానికి తేలికగానే అనిపించినా ఆ స్థితికి చేరుకోవడం అంత తేలిక కాదు. మనసులో చెలరేగే ఆలోచనలను ఆపలేని నిస్సహాయులం మనం. అంతగా మన జీవితాలు లోక సంబంధ అంశాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఆలోచనల సంకెళ్లు మన మనసును స్థిమితంగా ఉండనివ్వవు. కాబట్టి ధ్యాన స్థితికి చేరుకోవలంటే మనసులో చెలరేగే ఆలోచనలను బంధించే సహనం, సాధన అవసరం.

ధ్యాన స్థితికి ఎందుకు చేరుకోలేం?

ధ్యానం ప్రారంభించిన మొదట్లో ముందుకు వెళ్లలేకపోతున్న భావన కలగడం సహజం. ఇందుకు కారణం ధ్యానం మీద మనసు లగ్నం కాకపోవడమే! ఆ లోతైన నిద్రావస్థ స్థితిని ఎలా చేరుకోవాలో అర్థం చేసుకోలేకపోవడమే! అయితే ధ్యానంలోకి చేరుకోవడానికంటే ముందు రెండు అంశాలను అర్థం చేసుకోవాలి. మన మనసు రెండు పనులు చేస్తూ ఉంటుంది. మొదటిది 'గ్రహింపు', రెండవది 'ఆచరింపు'. ధ్యానంలో ఆచరింపు అనే అంశాన్ని నెమ్మదింపజేసి, గ్రహింపును ఉత్తేజితంగా ఉంచాలి. చాలామంది ఈ రెండు అంశాల గురించిన అవగాహన లేకుండానే ధ్యానం సాధన చేయడం మొదలు పెడతారు. ధ్యానం కోసం సిద్ధపడేముందు ఈ విషయాలను తెలుసుకోగలిగితే, అందుకోసం మనసు నిశ్చలంగా మారి, ధ్యాన ప్రక్రియ సులువవుతుంది. గాఢమైన నిద్రావస్థ ధ్యాన స్థితికి చేరుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటంటే....

- **సన్నద్ధం:** ధ్యానం చేయడం కంటే అందుకు సన్నద్ధమవడం కష్టం. అయితే ధ్యానానికి ముందు అందుకు మనసు, శరీరాలను సిద్ధం చేయడం వల్ల ధ్యానం తేలికవుతుంది అని నిపుణులు చెబుతారు.
- **ఊపిరి, శరీరాలను నెమ్మదించాలి:** శ్వాస, మనసు, శరీరం అంతర్గతంగా ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి. శరీరాన్ని విశ్రాంతంగా ఉంచి, శ్వాసను నెమ్మదింపజేస్తే, మనసూ నిశ్చలంగా మారుతుంది. ఈ స్థితిలో నాడీ వ్యవస్థ ప్రేరేపితమవుతుంది. ఫలితంగా ఒత్తిడి తగ్గడం మొదలవుతుంది.

> **మనసు ఆనందంగా :** బాధను మరిచి, ఆనందాన్ని సొంతం చేసుకోవడమే మన మెదడు ప్రధాన ధ్యేయం. ధ్యానం చేసే సమయంలో కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాలి. అంతా సవ్యంగానే ఉందనే భావన మనసులో నింపుకుంటే ధ్యానంలోకి పయనం సాధ్యపడుతుంది. అందుకోసం మీ జీవితంలో జరిగిన మంచి విషయాలను మననం చేసుకోవాలి. అంతా మంచే జరుగుతుందన్న సంతుష్టకరమైన భావన మనసులో నింపుకోవాలి. భగవన్నామస్మరణ కూడా ధ్యానానికి మేలు చేస్తుంది. అలాగే ధ్యానం కోసం నిశ్శద్దమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి. ఫోన్లు, పెంపుడు జంతువులు, పిల్లల వల్ల ధ్యానానికి భంగం కలిగే వీలు లేని ప్రదేశాన్ని ధ్యానానికి కేటాయించాలి.



- **ధ్యానం తేలికగా:** ధ్యాన ముద్రలో కూర్చుని 5 సార్లు ఊపిరి పీల్చి వదలాలి. ముక్కుతో గాలి లోపలికి పీల్చుకుని, నోటి ద్వారా బయటకు వదలాలి. ఊపిరి లోతుగా, దీర్ఘంగా కొనసాగాలి. ఊపిరి పీల్చుకునే సమయంలో వర్తమానంతో కూడిన స్పృహ కలిగి ఉండాలి. ఊపిరి బయటకు వదిలేటప్పుడు కండరాలన్నిటినీ రిలాక్స్ చేయాలి. ఆ సమయంలోనే ఒత్తిడిలు, ఆందోళనలు బయటకు వెళ్లిపోతున్న భావన కలగాలి. ఇలా చేస్తున్నప్పుడు ప్రత్యేకంగా నాలుక, దవడ, కంఠం, నుదుటి మీద మనసు పెట్టాలి.
- **సక్రమ పద్ధతి:** ధ్యానానిక ముందు కొన్ని యోగాసనాలు వేసి శరీరాన్ని తేలికపరచవచ్చు. ధ్యానానికి ఉపకరించే ఆసనాలు.. శేతుబంధాసనం, ధనురాసనం, బాలాసనం, అధోముఖ శవాసనం, అర్థ మత్స్యేంద్రాసనం, ఉత్తనాసనం, శుప్త మత్స్యేంద్రాసనం, పద్మాసనం, శవాసనం. ఈ ఆసనాలు వేసే సమయంలో ఊపిరి పీల్చుకున్నదానికంటే ఎక్కువ సమయంపాటు బయటకు వదలాలి అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఊపిరి పీల్చుకోవడానికి నాలుగు సెకండ్లు పడితే, వదలడానికి ఎనిమిది సెకండ్ల సమయం తీసుకోవాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నెమ్మదిగా సాగాలి.
- **కోరిక బలంగా:** ధ్యానం ఎందుకు చేయదలచుకున్నారో, ఎలాంటి ఫలితం కోరుకుంటున్నారో జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ధ్యానానికి ముందు ఇలాంటి లోతైన ఆలోచన ధ్యాన బలాన్ని పెంచుతుంది. మీ కోరిక మానసిక ప్రశాంతత కాబట్టి, ఆ ఆలోచన దృఢంగా కొనసాగాలి. ముందున్న కొంత సమయాన్ని నేను ధ్యానం మీదే మనసు కేంద్రీకరిస్తాను అనుకోవాలి. ఆ సమయంలో నేను చేయవలసిన పనులు, ఆలోచించదగిన విషయాలు ఏమీ లేవు అని అనుకోవాలి. నేను ధ్యానం మొదలు పెట్టబోతున్నాను. నన్ను ఇబ్బంది పెట్టవద్దు అని మనసుకి చెప్పుకోవాలి.
- **ఉన్నది ఉన్నట్టు స్వీకరించాలి:** ప్రారంభంలో మనసులో ఆలోచనలు చెలరేగి ధ్యానానికి భంగం కలగవచ్చు. ఆ సమయంలో మిమ్మల్ని మీరు విమర్శించుకోకుండా ఆ ఆలోచనలను అంగీకరించి, వాటిని దూరం చేసుకోవడం మీద పట్టు సాధించాలి. స్వీయనింద ధ్యానాన్ని కొనసాగనివ్వదు. కాబట్టి ఉన్నది ఉన్నట్టు స్వీకరించి మెరుగైన ధ్యానం కోసం ఆలోచనల మీద పట్టు సాధించాలి. మనసు మీద పట్టు సాధించేటందుకు సమయం ఇవ్వాలి. మీతో మీరు సహనంతో మసలుకోవాలి.
- **ఏకాగ్రతను అభినందించాలి:** ఏదైనా వస్తువును ఉపయోగిస్తే మనసు లగ్నమవడం తేలికవుతుంది. అలా చేయడం పొరపాటు కాదు. మనసు కేంద్రీకృతమయ్యేవరకూ ఏ వస్తువు మీదైనా మనసు లగ్నం చేయవచ్చు. అయితే ఆ సమయంలో మనసులో చోటుచేసుకునే నెమ్మదితనాన్ని గమనించాలి. ఏకాగ్రత కోసం మనసుకు శిక్షణ ఇచ్చే సమయంలోనే ఆనందాన్ని గ్రహించేలా కూడా మనసు శిక్షణ పొందుతుంది. కాబట్టి ధ్యానంలో పట్టు సాధించడం కోసం ఏదైనా వస్తువును ఉపయోగించుకోవచ్చు. అయితే అది వెలుగు విరజిమ్మేలా ఉండాలి.
- **ధ్యానం నుంచి బయటకు:** ధ్యానం ముగిసిన తర్వాత దాన్లో నుంచి నెమ్మదిగా బయటకు రావడం కూడా నేర్చుకోవాలి. ధ్యానంలో తొందరపాటు తగదు. మనసు విశ్రాంతి పొందనివ్వాలి. మెడ, వేళ్లు కదిలించాలి. ఆ తర్వాత నెమ్మదిగా కళ్లు తెరవాలి.
- **రాతల్లో పెట్టాలి:** ధ్యానం ముగిసిన తర్వాత అనుభవాన్ని అక్షరబద్ధం చేయాలి. అలా చేయడం ద్వారా పురోగతి తెలుస్తుంది. ఎంత సేపు కూర్చుని ఉన్నారు? ధ్యానం ముగిసిన తర్వాత ఎలాంటి అనుభూతి పొందారు? ధ్యానం చేస్తున్నప్పుడు మనసు ఎలా స్పందించింది? అనే విషయాలను కూడా రాయాలి. ధ్యానం ప్రారంభంలో మనసులోకి ఎలాంటి ఆలోచనలు వచ్చాయి? వాటిని మీరెలా అధిగమించారు? అనే విషయాలను రాసుకోగలిగితే, ఆ మెలకువను ఎలా కొనసాగించవచ్చో అర్థమవుతుంది.

అధ్యయనం

గాలి కాలుష్యంతో 'డిమెన్షియా'

గాలి కాలుష్యం వల్ల 2000 నుంచి 2023 మధ్య కాలంలో భారతదేశంలో మరణాల సంఖ్య 14 లక్షలకు పెరిగింది. ఈ ముప్పు గురించిన మరిన్ని ఆసక్తికరమైన వివరాలు...



గాలి కాలుష్యం కేవలం శ్వాసకోస సమస్యలకే పరిమితం కాదని, దీంతో డిమెన్షియా ముప్పు కూడా పొంచి ఉంటుందనీ స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2025 నివేదిక వెల్లడిస్తోంది. గాలి కాలుష్యం ఫలితంగా 2023లో ఆరున్నర లక్షల మంది డిమెన్షియా బారిన పడినట్టు, ప్రపంచవ్యాప్త డిమెన్షియా మరణాలు 29 శాతానికి చేరుకున్నట్టు ఈ నివేదిక పేర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా మెరుగైన వైద్య విధానాలు, పెరిగిన ఆయుర్దాయాల ఫలితంగా, మరీ ముఖ్యంగా వృద్ధులు, గాలిలోని సూక్ష్మ అణువులకు బహిర్గతమవుతూ ఊపిరితిత్తులు, గుండె, మెదడు సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. ఈ సూక్ష్మ కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తప్రవాహంలోకి చొరబడి, అంతిమంగా మెదడుకు చేరుకుంటున్నాయి. అక్కడకు చేరుకున్న ఈ కలుషితాలు ఇన్‌ఫ్లమేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌లను ప్రేరేపిస్తూ, మెదడు కణజాలాన్ని దెబ్బతీస్తూ, నాడీక్షీణతను పెంచుతున్నాయి. ఈ ప్రక్రియ అల్జీమర్స్, వాస్క్యులర్ డిమెన్షియాల ముప్పును పెంచుతోంది. వీటి వల్ల జ్ఞాపకశక్తి క్రమేపీ క్షీణించి, ఇతరుల మీద ఆధారపడే పరిస్థితి పెరుగుతుంది. గాలి కాలుష్యానికి బహిర్గతం అవడం మూలంగా పిల్లల మెదడు ఎదుగుదల, పనితీరు కూడా కుంటుపడుతుందని నివేదిక పేర్కొంటోంది. ఫలితంగా ఆటిజం లాంటి నాడీసంబంధ రుగ్మతలతో పాటు, ఆందోళన, కుంగాబాటు లాంటి మానసిక సమస్యలు కూడా వేధిస్తాయని నివేదిక పేర్కొంటోంది. ధూమపానం, పోషకాహార లోపాలే డిమెన్షియాకు ప్రధాన కారణాలు అయినప్పటికీ, ఇందుకు గాలి కాలుష్యం కూడా దోహదపడుతుందని పరిశోధకులు అంటున్నారు.

సిద్ధాంతం

క్యాన్సర్ కొత్త సిద్ధాంతం... బ్రో హైపోథిసిస్

బిగుతైన బ్రాసరీలతో లింఫ్ స్రావాలకు అంతరాయం ఏర్పడి, రొమ్ముల్లో సమస్యలు తలెత్తవచ్చనే 'బ్రో హైపోథిసిస్' అనే కొత్త సిద్ధాంతం ఇప్పుడు తెరపైకొచ్చింది. దీని గురించి తెలుసుకుందాం!



బిగుతైన లోదుస్తులకూ లింఫ్ స్రావాల అవరోధాలకూ మధ్య సంబంధం ఉందనే 'బ్రో హైపోథిసిస్' అనే ఒక సిద్ధాంతం, క్యాన్సర్ ప్రివెన్షన్ స్టడీ జర్నల్‌లో ప్రచురితమైంది. దీనికి రుజువులు పరిమితంగానే ఉన్నప్పటికీ, ఆకర్షణీయంగా కనిపించే క్రమంలో మహిళలు బిగుతైన, సింథటిక్ డిజైన్లను కలిగిన బ్రాసరీలను ఎంచుకోవడంలో దాగి ఉన్న ఆరోగ్య సమస్యలకు సంబంధించి పలు చర్చలు జరిగాయి. లోదుస్తుల వస్త్రాల్లో హార్మోన్లను అస్తవ్యస్థపరిచే థాలేట్స్, ఫార్మాల్డిహైడ్, సింథటిక్ రంగులు, బిస్ఫినాల్స్ మొదలైన రసాయనాలు దాగి ఉంటాయి. ఇవి దీర్ఘకాలంలో క్యాన్సర్ ముప్పుకు దారి తీస్తాయి. సాధారణంగా బ్రాసరీల తయారీ కోసం పాలియస్టర్, నైలాన్, స్పాండెక్స్ వస్త్రాలనే ఉపయోగిస్తూ ఉంటారు. వీటన్నింట్లో ఈ విషపూరిత రసాయనాలు దాగి ఉంటాయి. ఈ ముప్పు నుంచి తప్పించుకోవడం కోసం, కాటన్, వెదురు, సేంద్రీయ పదార్థాలతో తయారైన బ్రాసరీలనే ఉపయోగించాలి.

అవగాహన

హృద్రోగులు గుడ్లు తినొచ్చా?

వారానికి ఏడు చొప్పున గుడ్లను మితంగా తినడం వల్ల ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో గుండె, రక్తనాళాల సమస్యలు పెరగవనే ఒక విశ్లేషణ మాయో క్లినిక్‌లో ప్రచురితమైంది. మరిన్ని వివరాలు....



సమతులాహారంలో భాగంగా కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు గుడ్లను కూడా తీసుకోవచ్చు. పీచు, అన్‌శాచురేటెడ్ కొవ్వులతో పాటు గుడ్లను మితంగా తిన్నంత కాలం గుండె జబ్బులు దరి చేరే అవకాశాలు తక్కువని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కూడా మరొక విశ్లేషణను ప్రచురించింది. అయితే వారానికి 12 అంతకంటే ఎక్కువ గుడ్లను తినడం వల్ల గుండె జబ్బు ముప్పు కచ్చితంగా పెరుగుతుంది. ప్రత్యేకించి చెడు కొలెస్ట్రాల్ మోతాదులు ఎక్కువగా ఉన్న వ్యక్తుల్లో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది. నిజానికి గుడ్డుతో గుండెకు రక్షణ కల్పించుకోవచ్చు. గుడ్డు జోలికి వెళ్లని వాళ్లతో పోల్చితే, వారానికి పరిమితంగా ఒకటి నుంచి మూడు గుడ్లు తినే వాళ్లలో గుండె జబ్బుల ముప్పు ఎంతో తక్కువగా ఉంటున్నట్టు సూచించే ఒక అధ్యయనం కూడా గ్రీస్‌కు చెందిన యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీలో ప్రచురితమైంది. ఆరోగ్యం కేవలం ఒక పదార్థం మీదే ఆధారపడి ఉండదనీ, పరిపూర్ణ ఆరోగ్యానికి ఆహార, జీవనశైలులు, పోషకాలు దోహదపడతాయని వైద్యులు ఈ అధ్యయనంలో పేర్కొంటున్నారు. ప్రాసెస్ చేసిన పదార్థాలకు బదులుగా గుడ్లను తినడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కానీ గుడ్లను, శాచురేటెడ్ కొవ్వులతో కలిపి తిన్నప్పుడు ఆరోగ్యం మీద ప్రతికూల ప్రభావం పడుతుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

ప్రభుత్వ బ్యాంకుల్లోకి 49% విదేశీ పెట్టుబడులు!

ప్రస్తుత 20% పరిమితిని పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 49 శాతానికి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పెట్టుబడుల పరిమితి అంశాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించిందని.. దీనిపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)ను కూడా అభిప్రాయం కోరినట్లు సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. అయితే, ఈ ప్రతిపాదన ఇంకా కొలిక్కి రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం పీఎస్‌బీల్లో విదేశీ పెట్టుబడుల పరిమితి 20 శాతంగా ఉంది. అంటే, ఈ పరిమితిని రెట్టింపునకు పైగా పెంచాలని కేంద్రం యోచిస్తున్నది. కాగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ప్రస్తుతం 74 శాతం వరకు విదేశీ పెట్టుబడులకు అనుమతి ఉన్న సంగతి విదితమే.

మరిన్ని విదేశీ పెట్టుబడులకు అనుమతివ్వడం ద్వారా దేశంలో పెరుగుతున్న రుణ డిమాండ్‌కు అనుగుణంగా పీఎస్‌బీలు మూలధన నిధులు సమకూర్చుకోగలుగుతాయని కేంద్రం భావిస్తోంది. ఈ పరిమితిని గణనీయంగా పెంచినప్పటికీ, కనీసం 51 శాతం వాటా కలిగి ఉండటం ద్వారా పీఎస్‌బీలపై నియంత్రణాధికారాలను మాత్రం ప్రభుత్వం కలిగి ఉండనుంది. ఈ సెప్టెంబరు 30 నాటికి విదేశీ పెట్టుబడులు అత్యధికంగా కెనరా బ్యాంక్‌లో 12 శాతంగా ఉండగా.. అత్యల్పంగా యూకో బ్యాంక్‌లో దాదాపు సున్నాగా ఉన్నాయి.



12 పీఎస్‌బీలు.. రూ.171 లక్షల కోట్ల ఆస్తులు

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ సహా దేశంలో డజను పీఎస్‌బీలున్నాయి. ఈ మార్చి నాటికి ఈ డజను పీఎస్‌బీల ఆస్తుల మొత్తం విలువ దాదాపు 1.95 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో సుమారు రూ.171 లక్షల కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగ మొత్తం ఆస్తుల్లో 55 శాతానికి సమానమిది.

దేశీ బ్యాంకులపై అమితాసక్తి

గడిచిన కొన్నేళ్లలో దేశీయ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంపై విదేశీ ఇన్వెస్టర్ల ఆసక్తి గణనీయంగా పెరిగింది. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలోకి ఈ మధ్య కాలంలో వచ్చిన భారీ పెట్టుబడులే ఇందుకు నిదర్శనం. ప్రపంచంలో అతిపెద్ద ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజర్ బ్లాక్‌స్టోన్ గ్రూప్.. కేరళకు చెందిన ఫెడరల్ బ్యాంక్‌లో 9.99 శాతం వాటాను రూ.6,196 కోట్లకు దక్కించుకుంది. గల్ఫ్ ప్రాంత బ్యాంకింగ్ దిగ్గజం ఎమిరేట్స్ ఎన్‌డీబీ.. ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 60 శాతం వాటాను రూ.26,853 కోట్లకు చేజిక్కించుకుంది. యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) రూ.13,483 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ మధ్యనే తన వాటాను మరో 5 శాతం మేర పెంచుకుంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజాలైన వార్‌బర్గ్ పింకస్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కలిసి రూ.7,500 కోట్ల పెట్టుబడులు పెట్టాయి.

కాగా, గడిచిన కొన్నేళ్లలో మొండి బకాయిలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా లాభాలు ఆర్జిస్తుండటంతో ప్రభుత్వ బ్యాంకుల్లోనూ పెట్టుబడులకు విదేశీ ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతోంది. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా బ్యాంకింగ్ రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టేందుకు కసరత్తు జరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

'సుప్రీం'లో వొడాఫోన్‌కు ఊరట

ఏజీఆర్‌లపై కేంద్రానికి స్వేచ్ఛ

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పులు, నష్టాలతో కునారిల్లుతున్న వొడాఫోన్ ఐడియాకి సోమవారం సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంపెనీ చెల్లించాల్సిన రూ.5,606 కోట్ల సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) నిర్ణయ అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి వదిలేసింది. వొడాఫోన్ ఇండియా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏజీఆర్ మొత్తాన్ని తిరిగి లెక్కించి, కంపెనీకి ఓదార్పు ప్రకటించేందుకు మార్గం సుగమమైంది. ఈ ఆదేశాలతో సోమవారం బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేరు 3.88 శాతం లాభంతో రూ.9.99 వద్ద ముగిసింది.

పుదుచ్చేరిలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఒలెక్ట్రా విద్యుత్ బస్సుల సేవలు ప్రారంభమయ్యాయి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) తయారు చేసిన 25 ఎలక్ట్రిక్ బస్సులను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కే కైలాశ్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ సంస్థ ఈవీట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్.. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో 12 సంవత్సరాల పాటు నడిపించడంతో పాటు వాటి నిర్వహణను చేపడుతుంది. ఈ ఎలక్ట్రిక్ బస్సులు ఒకసారి చార్జింగ్‌తో 200 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణిస్తాయి.

పీనట్‌బటర్ అండ్ జెల్లీ కంపెనీలో 51% వాటా: హెరిటేజ్ ఫుడ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ తన ప్రీమియం ఐస్ క్రీమ్స్, డిజర్ట్స్ శ్రేణిని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ముంబై కేంద్రంగా పనిచేసే పీనట్‌బటర్ అండ్ జెల్లీ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలో 51 శాతం వాటాను రూ.9 కోట్లకు కొనుగోలు చేస్తోంది. స్కై గేట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ చేతిలో ఉన్న ఈ వాటా కొనుగోలు కోసం త్వరలోనే ఒప్పందం చేసుకోబోతున్నట్టు హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. మిగిలిన 49 శాతం వాటా పీనట్‌బటర్ అండ్ జెల్లీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ల చేతిలోనే ఉంటుంది.

అయితే వచ్చే ఏడాది మార్చి తర్వాత ఈ కంపెనీ ఈక్విటీలో మరో 20 శాతం వాటాను అప్పటి ధర ప్రకారం కొనుగోలు చేసే అవకాశం ఉంచుకున్నట్టు హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. పీనట్‌బటర్ అండ్ జెల్లీ ఆరోగ్యానికి హాని చేయని హై ప్రొటీన్‌తో కూడిన ఐస్ క్రీములు, డిజర్ట్‌ల తయారీలో మంచి పేరుంది. పంచదార లేకుండా సంప్రదాయ తీపి పదార్థాలతో విరిగిన పాల నుంచి తీసే ప్రొటీన్‌తో తయారు చేసే ఈ ఉత్పత్తులను పీనట్‌బటర్.. 'గెట్ ఏ వే' బ్రాండ్ పేరుతో విక్రయిస్తోంది.

పెట్రో ఎగుమతులను మించనున్న ఎలక్ట్రానిక్స్

ఐఫోన్ల ఎగుమతులతో మరింత దన్ను

న్యూఢిల్లీ: భారత్ నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఉపకరణాల ఎగుమతులు శరవేగంతో పెరుగుతున్నాయి. గత మూడేళ్లలో దేశం నుంచి వీటి ఎగుమతులు 63 శాతం పెరిగి 2,350 కోట్ల డాలర్ల నుంచి 3,850 కోట్ల డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనూ మన దేశం నుంచి 2,220 కోట్ల డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, ఉపకరణాలు ఎగుమతయ్యాయి. ఇందులో సగానికిపైగా వాటా యాపిల్ ఐఫోన్లదే ఉండడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతి 42 శాతం పెరిగింది. ఇదే వృద్ధి రేటు కొనసాగితే, 2022-23తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి వీటి ఎగుమతులు రెట్టింపై పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులను మించి పోతాయని అంచనా.

ఎగుమతుల లక్ష్యం సాధిస్తాం: అమెజాన్ ఇండియా

భారత్ నుంచి 2030 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 8,000 కోట్ల డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని సాధిస్తామని అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఇందులో ఇప్పటికే 2,000 కోట్ల డాలర్ల ఎగుమతులు పూర్తి చేసినట్టు అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ఇండియా ప్రధాన అధికారి శ్రీనిధి కాల్వపూడి చెప్పారు. గత పదేళ్లలో తమ ప్లాట్‌ఫామ్ ద్వారా దేశీయ ఎగుమతిదారులు అంతర్జాతీయ కస్టమర్లకు 75 కోట్లకు పైగా దేశీయ ఉత్పత్తులను విక్రయించినట్టు తెలిపారు.

ఏపీలో క్రాంప్టన్ గ్రీవ్స్‌కు రూ.445 కోట్ల కాంట్రాక్టు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ నవ్య, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి కార్పొరేషన్ (నరెడ్ క్యాప్) నుంచి రూ.445.03 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (సీజీసీఈఎల్) వెల్లడించింది. కాంట్రాక్టులో భాగంగా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద 40,000 గృహాల్లో సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ నెలకొల్పాల్సి ఉంటుందని తెలిపింది. ఈపీసీ విధానంలో చేపట్టే ఈ కాంట్రాక్టు కింద ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఇళ్లపై 2 కిలోవాట్ సామర్థ్యం గల ఆన్ గ్రిడ్ రూఫ్ టాప్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,480 ▼	1,14,100 ▼	1,69,000 ▼
విజయవాడ	1,25,000 ▼	1,18,000 ▼	1,49,000 ▼
విశాఖపట్నం	1,25,400 ▼	1,14,500 ▼	1,70,000 ▼
రాజమండ్రి	1,24,470 ▼	1,14,100 ▼	1,51,000 ▼
ప్రొద్దుటూరు	1,23,000 ▼	1,13,160 ▼	1,53,000 ▼
ముంబై	1,21,077 ▼	1,10,907 ▼	1,45,031 ▼

సీనియర్ సిటిజన్స్ కోసం హైదరాబాద్‌లో రెండు ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్స్ కోసం హైదరాబాద్‌లో రెండు రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. కొలంబియా పసిఫిక్‌కు చెందిన సెరీన్ కమ్యూనిటీస్, ప్రతిమ గ్రూప్‌తో కలిసి రూ.400 కోట్లతో ఈ రెండు నివాస ప్రాజెక్టులు చేపడుతున్నాయి. ఇందులో సెరీన్ బిల్వానీవన్ పేరుతో ఒక హౌసింగ్ ప్రాజెక్టును శంకర్‌పల్లిలో 265 నివాసాలతో ఏర్పాటు చేస్తారు. వీటి ధర ఒక్కోటి రూ.60 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. కాగా రెండో ప్రాజెక్టును త్వరలోనే ప్రకటించనున్నారు.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	565	విజయవాడ	575
వరంగల్	567	గోదావరి	575
చిత్తూరు	593	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ.	72



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	112
కర్నూలు	117	నెల్లూరు	117
విశాఖపట్నం	119		
గోదావరి	123	అనంతపురం	117

విజయ మెడికల్ కేర్‌తో న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విశాఖపట్నం కేంద్రంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విజయ మెడికల్ సెంటర్‌తో డయాగ్నోస్టిక్ చెయిన్ న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద రాబోయే 60 రోజుల వ్యవధిలో ఉభయ సంస్థల సేవలను విజయ మెడికల్ సెంటర్ బ్రాండ్ కింద సమీకృతం చేయనున్నట్టు ప్రకటించాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 18 జిల్లాల్లో ఉభయ సంస్థలు సేవలందిస్తుండగా రాబోయే రెండేళ్లలో మొత్తం 59 జిల్లాలకు సేవలు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. న్యూబర్గ్‌కు చెందిన అనుభవం, నాలుగు దశాబ్దాల విజయ విశ్వసనీయ వారసత్వం రోగులకు సమర్థవంతమైన సేవలందించేందుకు దోహదపడుతాయని పేర్కొన్నాయి. విజయ మెడికల్ ప్రస్తుతం ఏపీలోని 8 నగరాల్లో 18 కేంద్రాల ద్వారా పాథాలజీ, రేడియాలజీ, మాలిక్యులర్ ఇమేజింగ్ సర్వీసులు అందిస్తోంది. కాగా న్యూబర్గ్ తెలుగు రాష్ట్రాల్లోని 10 నగరాల్లో పాథాలజీ ల్యాబ్స్‌తో పాటు కలెక్షన్ సెంటర్లను నిర్వహిస్తోంది.

సెన్సెక్స్ 567 పాయింట్లు అప్

ఇంట్రాడేలో 26,000 ఎగువకు నిఫ్టీ

ముంబై: అమెరికా-చైనా వాణిజ్య ఒప్పందంపై ఆశావహం, యూఎస్ ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ సూచీలూ సోమవారం లాభాల్లో పయనించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులూ ఇందుకు దోహదపడ్డాయి. ఒక దశలో 720 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 566.96 పాయింట్ల లాభంతో 84,778.84 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,000 ఎగువకు చేరిన నిఫ్టీ.. 170.90 పాయింట్ల వృద్ధితో 25,966.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 రాణించాయి.

- బంగారం, వెండి ధరలు మరింత తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములకు రూ.700 తగ్గుదలతో రూ.1,25,900కు దిగివచ్చింది. కిలో వెండి ఏకంగా రూ.4,250 తగ్గి రూ.1,51,250కు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 4,015 డాలర్లకు, సిల్వర్ 47.60 డాలర్లకు దిగివచ్చాయి.

లెన్స్‌కార్ట్ ఐపీఓ ధరల శ్రేణి రూ.382-402

కళ్ల జోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ రూ.7,278 కోట్ల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 31న ప్రారంభమై నవంబరు 4న ముగియనుంది. ఐపీఓలో విక్రయించే షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.382-402గా నిర్ణయించింది.

స్పోర్ట్స్



లిఫ్టర్ ప్రీతిస్మితకు 'రికార్డు' స్వర్ణం

మనామా (బహ్రెయిన్): ఆసియా యూత్ క్రీడల్లో భారత లిఫ్టర్ ప్రీతిస్మిత బోయ్ ప్రపంచ రికార్డుతో పసిడి పతకం సాధించింది. బాలికల 44 కిలోల కేటగిరీలో 16 ఏళ్ల ప్రీతిస్మిత మొత్తం 158 (66+92) కిలోల బరువునెత్తి అగ్రస్థానంలో నిలిచింది. కాగా, క్లీన్ అండ్ జర్క్‌లో 92 కిలోల బరువునెత్తిన బోయ్ యూత్ క్రీడల్లో ప్రపంచ రికార్డుతో పసిడి దక్కించుకోగా.. స్నాచ్‌లో 66 కిలోలు లిఫ్ట్ చేసి రజతం సొంతం చేసుకొంది. చైనా అథ్లెట్ వు జిహోంగ్ 156 (68+88) కిలోలతో రజతం, వియత్నాం లిఫ్టర్ దావో తి యన్ 141 (64+77) కిలోలతో కాంస్యం సాధించారు.

గాయంతో సీజన్ మొత్తానికి సింధు దూరం



న్యూఢిల్లీ: తెలుగమ్మాయి పీవీ సింధు పాదం గాయంతో ఈ సీజన్‌లోని మిగిలిన అన్ని టోర్నమెంట్ల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. వైద్యుల సలహా మేరకు తగిన విశ్రాంతి తీసుకుంటున్నానని, అందుకే మిగిలిన బీడబ్ల్యూఎఫ్ టోర్నీల్లో ఆడలేకపోతున్నానని తెలిపింది. 'అథ్లెట్ల ప్రయాణంలో గాయాలు సాధారణమే. ఓపికను, సామర్థ్యాన్ని గాయాలు పరీక్షిస్తుంటాయి. తిరిగి బలంగా పునరాగమనం చేస్తా. ప్రస్తుతం వైద్యులు, నిపుణుల పర్యవేక్షణలో చికిత్సతో పాటు అవసరమైన శిక్షణ కూడా తీసుకుంటున్నా' అని సింధు తెలిపింది. ఇక, చివరగా సింధు గత డిసెంబరులో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ ఓపెన్ టైటిల్ గెలిచింది.

శ్రేయా‌స్‌కు తీవ్ర గాయం

- ప్లీహంలో అంతర్గత రక్తస్రావం
- ఐసీయూలో చికిత్స, అనంతరం ప్రత్యేక వార్డుకు తరలింపు
- సిడ్నీ ఆస్పత్రిలో అయ్యర్



సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో తీవ్రంగా గాయపడిన శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో అలెక్స్ క్యారీ క్యాచ్‌ను అందుకుని కింద పడే క్రమంలో అతడి ఎడమ మోచేయి పక్కటెముకలకు బలంగా తాకింది. దీంతో విపరీతమైన నొప్పితో విలవిల్లాడిన శ్రేయాస్ మైదానం వీడాడు. మెరుగైన చికిత్స కోసం వెంటనే అయ్యర్‌ను ఆస్పత్రికి తరలించారు. 'స్కానింగ్ పరీక్షలో పక్కటెముకల వద్ద ప్లీహానికి తీవ్రగాయమై, అంతర్గతంగా రక్తస్రావమైనట్టు కూడా తేలింది. పరిస్థితి విషమించకముందే తనను ఐసీయూలో చేర్చాం. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో పాటు వేగంగా కోలుకుంటున్నాడు. బీసీసీఐ వైద్య బృందం కూడా శ్రేయాస్ గాయంపై సిడ్నీ, భారత్‌లోని స్పెషలిస్ట్‌లను నిరంతరం సంప్రదిస్తోంది. టీమ్ డాక్టర్ కూడా శ్రేయాస్‌తో పాటు సిడ్నీ ఆస్పత్రిలోనే ఉండి రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తున్నాడు. వారం రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలి' అని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు శ్రేయాస్ ఆరోగ్యంలో పురోగతి కనిపించడంతో సోమవారం అతడిని ఐసీయూ నుంచి డిశ్చార్జి చేసి ప్రత్యేక వార్డుకు మార్చినట్టు సమాచారం.



బరిలోకి ఎప్పుడో?

వన్డే జట్టులో మాత్రమే ఉన్న శ్రేయాస్ అయ్యర్ తిరిగి బరిలోకి ఎప్పుడు దిగుతాడనే సందేహాలు నెలకొన్నాయి. ప్రాథమికంగా శ్రేయాస్‌కు మూడు వారాల విశ్రాంతి అవసరముంటుందని భావించారు. కానీ తాజా పరిస్థితుల నేపథ్యంలో తను బ్యాట్ పట్టేందుకు మరింత సమయం పట్టవచ్చని సమాచారం. నవంబరు 30 నుంచి దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఉంది. అప్పటి వరకు కోలుకుంటాడా? అనేది చెప్పలేం. మరోవైపు భారత్‌కు వచ్చాక నేరుగా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ (సీఓఈ)లో చేరనున్నాడు.

ఆలస్యం అయ్యుంటే..?

శ్రేయాస్ గాయం తీవ్రతను సరిగ్గా అంచనా వేసిన బీసీసీఐ వైద్య బృందం అతడిని పెనుప్రమాదం నుంచి తప్పించింది. లేకుంటే పరిస్థితి విషమంగా మారేది. మైదానం నుంచి పెవిలియన్‌కు రాగానే అయ్యర్ గాయాన్ని మెడికల్ సిబ్బంది, ఫిజియో పరిశీలించారు. అంతలోనే అతను స్పృహ కోల్పోవడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించారు. లేనిపక్షంలో క్రికెటర్ ప్రాణాల మీదికి వచ్చివుండేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. రక్తస్రావం ఆగకపోతే ఇన్‌ఫెక్షన్ ప్రమాదం ఉంటుంది కాబట్టి ఐసీయూలోనే రెండు రోజుల పాటు ఉంచారు. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్న శ్రేయాస్‌కు అండగా సిడ్నీలోని అతడి స్నేహితులు ఆస్పత్రిలోనే ఉన్నారు. అలాగే తల్లిదండ్రులు సైతం వీసా ప్రక్రియ పూర్తికాగానే ఆస్ట్రేలియాకు పయనం కానున్నారు. పూర్తిగా కోలుకున్న తర్వాతే అయ్యర్‌ను భారత్‌కు పంపాలనే ఆలోచనలో బోర్డు ఉంది.



ఫైనల్లో దబాంగ్ ఢిల్లీ

న్యూఢిల్లీ: దబాంగ్ ఢిల్లీ ప్రొ కబడ్డీ (పీకేఎల్) సీజన్-12లో ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం హోరాహోరీగా జరిగిన క్వాలిఫయర్-1లో ఢిల్లీ-పుణెరి పల్టన్ జట్లు నిర్ణీత సమయం ముగిసేసరికి 34-34తో సమంగా నిలవడంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఫలితం తేల్చేందుకు టైబ్రేకర్ నిర్వహించగా ఢిల్లీ 6-4తో పుణెరిను ఓడించి ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన పుణెరి జట్టు మంగళవారం జరిగే ఎలిమినేటర్-3లో గెలిచిన జట్టుతో బుధవారం జరగనున్న క్వాలిఫయర్-2లో తలపడనుంది. అంతకుముందు జరిగిన ఎలిమినేటర్-2లో పట్నా పైరేట్స్ 46-37తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ఆట ద్వితీయార్థంలో బెంగళూరు రైడర్ శుభమ్ ఒకే రైడ్‌లో ఏడు పాయింట్లు సాధించి పీకేఎల్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. మంగళవారం జరిగే ఎలిమినేటర్-3 మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో పట్నా ఆడుతుంది.

7 నెలల గర్భవతి..145 కిలోలు ఎత్తి!

ఢిల్లీ కానిస్టేబుల్ అరుదైన ఘనత



న్యూఢిల్లీ: సంకల్ప బలం ఉండాలేగానీ.. సాధ్యం కానిదేమీలేదని ఓ కానిస్టేబుల్ నిరూపించింది. ఏడు నెలల గర్భిణి అయినా.. పోటీల్లో పాల్గొని ఏకంగా 145 కిలోల బరువునెత్తి ఔరా అనిపించింది. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిల భారత పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్‌లో ఢిల్లీ కానిస్టేబుల్ సోనికా యాదవ్ ఈ ఫీట్ చేసింది. పవర్ లిఫ్టింగ్‌లోని స్క్వాట్స్‌లో 125 కిలోలు ఎత్తిన సోనిక.. బెంచ్ ప్రెస్‌లో 80 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 145 కిలోలు ఎత్తి కాంస్యం సాధించింది. లూసీ మార్టిన్స్ అనే లిఫ్టర్ గర్భిణిగా ఇలాంటి ఫీట్ చేసినట్టు తాను నెట్‌లో వెదికి తెలుసుకొన్నట్టు యాదవ్ చెప్పింది. సోషల్ మీడియాలో మార్టిన్స్‌ను వెదికి ఆమె సూచనలు, సలహాలతో సాధన చేసినట్టు తెలిపింది. ప్రతి విషయంలోనూ డాక్టర్ల సలహాలను పాటించినట్టు పేర్కొంది.

ప్రతీకా రావల్ అవుట్



షఫాలీ

- జట్టులోకి షఫాలీ వర్మ
- మహిళల వన్డే వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో కీలక సెమీఫైనల్‌కు ముందు భారత్‌కు గట్టి ఝలక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ప్రతీకా రావల్ గాయం కారణంగా టోర్నీకి దూరమైంది. ఆమె స్థానంలో మరో ఓపెనర్ షఫాలీ వర్మను తీసుకున్నారు. ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన భారత్ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ప్రతీకా గాయపడింది. బౌండరీ లైన్ దగ్గర బంతిని ఆపే క్రమంలో కుడి చీలమండ మెలిక పడడంతోపాటు మోకాలికి కూడా గాయమైంది. దీంతో పెవిలియన్‌కు చేరిన రావల్‌ను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

రంజీలకు వర్షం దెబ్బ

- 25 ఓవర్లే సాధ్యమైన హైదరాబాద్ మ్యాచ్
- ఆంధ్ర ఆటలో ఒక్క బంతీ పడని వైనం

పుదుచ్చేరి: తెలుగు రాష్ట్రాల రంజీ మ్యాచ్‌ల మూడోరోజు వరుణుడు అడ్డు తగిలాడు. దీంతో పుదుచ్చేరితో హైదరాబాద్, బరోడాతో ఆంధ్ర జట్లు తలపడుతున్న మ్యాచ్‌లు డ్రా దిశగా సాగుతున్నాయి. కేవలం 25 ఓవర్లపాటు సాగిన మూడో రోజు ఆటలో పున్నయ్య (3/10)తోపాటు మిగతా బౌలర్లు రాణించడంతో.. గ్రూప్-డిలో పుదుచ్చేరితో రంజీలో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 25/1తో ఆట కొనసాగించిన పుదుచ్చేరి 92/8తో కష్టాల్లో పడింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 435 పరుగులు చేసింది. కాగా, వర్షం కారణంగా గ్రూప్-ఎలో ఆంధ్ర-బరోడా మధ్య ఆట పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. బరోడా తొలి ఇన్నింగ్స్‌లో 363 పరుగులు సాధించగా.. ఆంధ్ర 43/2 స్కోరు చేసింది. ఈ మ్యాచ్ విజయనగరంలో జరుగుతోంది.



సుజీత్ పసిడిపట్టు

అండర్-23 వరల్డ్ రెజ్లింగ్

నోవి సాడ్ (సెర్బియా): అండర్-23 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత అథ్లెట్ సుజీత్ కల్కల్ స్వర్ణం సాధించాడు. సోమవారం జరిగిన పురుషుల 65 కిలోల ఫైనల్లో కల్కల్ 10-0తో ఉమిడ్‌జోన్ జలోలోవ్ (ఉజ్బెకిస్థాన్)పై విజయం సాధించాడు. 4 నిమిషాల 53 సెకన్లపాటు సాగిన బౌట్‌లో ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కల్కల్ టెక్నికల్ సుపీరియారిటీతో గెలిచాడు. ఈ క్రమంలో అండర్-23లో వరల్డ్ టైటిల్ నెగ్గిన నాలుగో భారత ఆటగాడిగా నిలిచాడు. ఇదే టోర్నీలో గతేడాది కాంస్యం దక్కించుకొన్న కల్కల్.. ఈసారి పసిడి పతకాన్ని ముద్దాడాడు. 2022, 2025లో అండర్-23 ఆసియా టైటిళ్లు సాధించాడు.



బరిలోకి బవుమా

జోహాన్నె‌స్‌బర్గ్: గాయం నుంచి కోలుకున్న దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా భారత పర్యటనకు సిద్ధమయ్యాడు. దీంతో వచ్చే నెల 14 నుంచి భారత్‌లో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు అతడి నాయకత్వంలో జట్టు బరిలోకి దిగనున్నట్టు క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ) సోమవారం ప్రకటించింది. కోల్‌కతా, గువాహతిలో ఈ టెస్టులు జరుగుతాయి. ఇటీవల పాక్‌తో జరిగిన టెస్టు సిరీస్‌కు గాయం కారణంగా బవుమా దూరమయ్యాడు. ఆ సిరీస్‌లో పాల్గొన్న మెజారిటీ ఆటగాళ్లనే భారత పర్యటనకు ఎంపిక చేశారు. అంతకన్నా ముందు నవంబరు 2 నుంచి భారత్ 'ఎ' టీమ్‌తో దక్షిణాఫ్రికా ఆడనుంది.

జట్టు: బవుమా (కెప్టెన్), మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్, వెరీనె, బ్రెవిస్, హమ్జా, డి జోర్జి, బాష్, ముల్డర్, జాన్సెన్, కేశవ్, ముత్తుస్వామి, రబాడ, హార్మర్.

అవినీతి కట్టడి అందరి బాధ్యత

» ఏసీబీ డీజీ అతుల్ సింగ్.. విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అవినీతిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్ జనరల్(డీజీ) అతుల్ సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం నుంచి నవంబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాలను విజయవాడ నుంచి వర్చువల్‌గా ఆయన 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సోమవారం ప్రారంభించారు. 'విజిలెన్స్ అవర్ షేర్డ్ రెస్పాన్సిబిలిటీ' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఏసీబీ సిబ్బంది ప్రజల్లోకి వెళ్లి అవగాహన పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అవినీతి నిర్మూలనకు విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రతిజ్ఞలు చేయించాలన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) సూచనల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ డీజీ అతుల్ సింగ్ తెలిపారు. లంచాల కోసం ఎవరు పీడించినా ఏసీబీకి సమాచారం ఇవ్వాలన్నారు.

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కీర్తి చేకూరి

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో స్వతంత్ర మహిళా డైరెక్టర్‌గా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కీర్తి గతంలో ట్రాన్స్‌కో జేఎండీగా విధులు నిర్వహించారు.

మొత్తం యంత్రాంగం కృషికి దక్కిన గుర్తింపు

» విశాఖకు గూగుల్‌పై అమితాబ్ కాంత్ స్పందనకు లోకేశ్ ప్రతిస్పందన

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ పెట్టుబడులపై నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ హర్షం వెలిబుచ్చుతూ ఎక్స్‌లో స్పందించారు. దానిపై మంత్రి లోకేశ్ స్పందించారు. ఇంత భారీ పెట్టుబడులను సాధించిన ఘనత మొత్తం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి దక్కుతుందని, కేంద్రం నుంచి అద్భుతమైన సహకారం అందడం కూడా ఈ భారీ విజయానికి దోహదపడిందని లోకేశ్ పేర్కొన్నారు. విజనరీ చంద్రబాబు సారథ్యంలో అసాధ్యమైన ఆలోచనలను బిలియన్ డాలర్ల వాస్తవంగా మారుస్తున్నామన్నారు.

వైసీపీ వ్యవస్థీకృత నేరగాళ్ల ఫేక్ ప్రచారం

ఆంధ్రప్రదేశ్ రోడ్ల దుస్థితి అంటూ వైసీపీ సోషల్ మీడియాలో వేరే రాష్ట్రాలకు చెందిన పాత ఫొటోలతో అసత్య ప్రచారం చేస్తున్నారంటూ మంత్రి లోకేశ్ మండిపడ్డారు. 'నిన్న గురుకుల పాఠశాల... నేడు రోడ్లు... వైసీపీ హాబిచ్యువల్ అఫెండర్స్ మరోసారి ఫేక్ ప్రచారానికి దిగారు. ఏపీలో రోడ్ల పరిస్థితి అంటూ వేరే రాష్ట్రానికి చెందిన ఫొటోలతో అసత్య ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో సురక్షిత డ్రైవింగ్‌పై ప్రజలను చైతన్యపరిచేందుకు గుజరాత్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి 2022లో చేసిన పోస్టును వైసీపీ ఫేకూలు ఏపీ రోడ్లుగా చిత్రీకరిస్తూ అధ్వాన్న రోడ్ల కారణంగా స్కూలు బాలికపై బురదపడినట్లు వైసీపీ పేటీఎం బ్యాచ్ ప్రచారం చేస్తోంది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవు' అంటూ మంత్రి లోకేశ్ ఎక్స్‌లో హెచ్చరించారు.

వైసీపీ శవ రాజకీయాలు: ఎమ్మెల్సీ ఆలపాటి

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంపై వైసీపీ, జగన్ మీడియా శవ రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ రెడ్డి నీచ శవ రాజకీయాలు పరాకాష్ఠకు చేరాయి. ప్రభుత్వ విధానాలపై రాజకీయం చేయడంలో తప్పులేదు. కానీ దుర్ఘటనలు, మరణాలపై రాజకీయం చేయడం దారుణం' అని మండిపడ్డారు.

డిగ్రీ తుది దశ అడ్మిషన్లకు గడువు పెంపు

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో డిగ్రీ తుది దశ అడ్మిషన్ల షెడ్యూలును ఉన్నత విద్యా మండలి సవరించింది. కొత్త షెడ్యూలు ప్రకారం... విద్యార్థులు ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబరు 2 వరకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు. 4న సీట్లు కేటాయింపు జరుగుతుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు 4 నుంచి 7 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలి.

ఇదేం వారధి బాబోయ్!





గుంతలు పడి... కంకరు లేచిపోయి... ఇనుప చువ్వలు పైకి తేలి కనిపిస్తున్నది కనకదుర్గ వారధి. విజయవాడలోకి ప్రవేశించేందుకు, విజయవాడ నుంచి గుంటూరు జిల్లాలోకి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ వంతెన దుస్థితిని పట్టించుకునే వారు కరువయ్యారు.

'స్పీడు' పెరిగింది!

» పారిశ్రామిక ప్రగతిలో ఏపీ జోరు

» మోదీ వేగానికి చంద్రబాబు తోడు

» 'ఆంధ్రజ్యోతి'తో ఎన్ఐసీడీసీ చైర్మన్ సైనీ

(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)

పారిశ్రామిక ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ జోరుగా ముందుకెళుతోందని జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) చైర్మన్ రజత్ కుమార్ సైనీ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ 'మేకిన్ ఇండియా' స్వప్నం సాకారంలో ఏపీ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సత్వర చర్యల వల్ల కృష్ణపట్నం, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లు వచ్చే మూడేళ్లలోపే పూర్తి స్థాయి ఉత్పాదక కేంద్రాలుగా మారుతాయని అన్నారు. పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సోమవారం ఢిల్లీలో 'ఆంధ్రజ్యోతి'తో రజత్ కుమార్ సైనీ మాట్లాడారు. భూసేకరణలో సమస్యల్ని పరిష్కరించి స్థానికులకు నష్టపరిహారం చెల్లించడం, రహదారుల నిర్మాణం, విద్యుత్, నీరు కేటాయించడంతో పాటు ఇతర మౌలిక వసరులను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వేగంగా చర్యలు తీసుకున్నందువల్లే ఈ మూడు పారిశ్రామిక కారిడార్లు కార్యరూపం దాల్చాయని చెప్పారు. రజత్ కుమార్ సైనీ ఇంకా ఏమన్నారంటే..



గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉన్నంతకాలం ఈ కారిడార్లపై దృష్టి సారించలేదు. టెండర్లకే మూడు సంవత్సరాలు పట్టింది. 2020లో కృష్ణపట్నం ప్రాజెక్టు చేపడితే 2023లో టెండర్లు కేటాయించారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 ఆగస్టులో ప్రాజెక్టుకు ఆమోదం లభిస్తే 2025 జూలై లోపే టెండర్లు కేటాయించారు. ప్రభుత్వం మారడం వల్ల విధాన నిర్ణయాలు వేగంగా అమలయ్యాయి. గుజరాత్‌లోని ధొలేరాలో సెమీకండక్టర్ పరిశ్రమ ఉంది. ఏపీకి కూడా సెమీ కండక్టర్ పరిశ్రమ వచ్చే అవకాశం ఉంది. విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీలో పారిశ్రామిక కారిడార్లపై పారిశ్రామికవేత్తల దృష్టి తప్పక మళ్లుతుంది.

డ్రోన్ రాజధానిగా ఏపీ

కర్నూలులోని ఓర్వకల్లులో నవంబరులో పనులు ప్రారంభమవుతాయి. ఇక్కడ డ్రోన్ సిటీ దేశంలోనే కాదు, ప్రపంచంలోనే పెద్దది. భారతదేశానికి డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ మారనుంది. స్వదేశీ టెక్నాలజీతో అత్యాధునిక డ్రోన్‌లను ఇక్కడ తయారు చేస్తారు. హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ కింద 2621 ఎకరాల్లో అభివృద్ధి చెందుతున్న ఓర్వకల్లు నోడ్ ఇతర రెండు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తుంది. కృష్ణపట్నం రేవుకు ఈ కారిడార్ ముఖద్వారంగా ఉంటుంది. హైదరాబాద్, కడప విమానాశ్రయాలు దగ్గర్లోనే ఉంటాయి. కృష్ణపట్నంలో కూడా వేగంగా పనులు జరుగుతున్నాయి. దాదాపు 30 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే మూడు నెలల్లో రహదారులతో సహా అన్ని సౌకర్యాలతో 500 ఎకరాలు సిద్ధం చేసి పారిశ్రామిక వేత్తలకు కేటాయిస్తాం. నాయుడుపేట గ్రీన్ ఫీల్డ్ రహదారి అక్కడకు సమీపంలోనే ఉంటుంది. అలాగే చెన్నై విమానాశ్రయం 300 కి.మీ దూరంలో ఉంటుంది. శ్రీసిటీ, గ్రీన్ ఫీల్డ్ రహదారి, కృష్ణపట్నంతో అనేక అవకాశాలు వస్తాయి. ఇప్పటికే అక్కడ పెద్ద ప్రాజెక్టులు అనేకం ఉన్నాయి. చాలా ప్రైవేట్ సంస్థలు పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసిపెట్టుకున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా 'క్రిస్' సిటీ 10,800 ఎకరాల్లో మూడు దశలుగా అభివృద్ధి చెందుతోంది. అదొక అభివృద్ధి కూడలిగా మారుతుంది. కృష్ణపట్నం ఓడరేవు వాణిజ్య కూడలిగా మారనుంది. పరిశ్రమలకు ఈ ప్రాంతం అత్యంత అనువైనదిగా మారనుంది. వైజాగ్-చెన్నై కారిడార్‌లో భాగంగా 2,595 ఎకరాల్లో అభివృద్ధి చెందుతున్న కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతం కడప విమానాశ్రయానికి సమీపంలోనే ఉంటుంది. తిరుపతి, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాలతో పాటు జాతీయ రహదారులు, రైల్వే అనుసంధానం వల్ల ఈ పారిశ్రామిక ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. పారిశ్రామిక అభివృద్ధితో రాయలసీమ ముఖచిత్రం మారుతుంది.

ఉత్పాదక కేంద్రంగా దేశం

పారిశ్రామిక వేత్తలకు పెద్దఎత్తున భూమి, సబ్సిడీ, సదుపాయాలు కల్పించడం కొత్త కాదు. ప్రపంచం అంతటా ఇదే సూత్రం అమలవుతుంది. ఒక భారీ పరిశ్రమ వస్తే దాని ప్రభావం అన్ని రంగాలపైనా, ప్రజల జీవన ప్రమాణాలపై పడుతుంది. భారత దేశం సర్వీసు, మార్కెట్ కే పరిమితం కాకుండా ఉత్పాదక కేంద్రంగా మారడమే మన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికవేత్తల దృష్టి భారత్‌పై పడింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లలో పారిశ్రామిక వాతావరణం ఎంతో అనుకూలంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో కూడా పరిస్థితులు ఎంతో మెరుగయ్యాయి!

తదుపరి దర్యాప్తు అక్కర్లేదు

» ప్రత్యేక కోర్టులో వివేకా హత్య కేసు నిందితుల వెల్లడి

» కోర్టు ఆదేశిస్తే విచారణ జరుపుతామన్న సీబీఐ

» దీనిపై మెమో దాఖలుచేస్తామని నివేదన

» విచారణ రేపటికి వాయిదా

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదని ఈ కేసులో నిందితులుగా ఉన్న గంగిరెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే సీబీఐ మాత్రం కోర్టు ఆదేశిస్తే తదుపరి దర్యాప్తు చేస్తామని పునరుద్ఘాటించింది. తన తండ్రి హత్య కేసు దర్యాప్తును సీబీఐ అసంపూర్ణంగా వదిలేసిందని.. ఇంకా చాలా అంశాలు వెలుగుచూడాల్సిన అవసరం ఉందని.. తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సీబీఐ కోర్టు స్పెషల్ ప్రిన్సిపల్ జడ్జి టి.రఘురాం సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.గౌతమ్ వాదనలు వినిపించారు. సునీత పిటిషన్‌పై తేల్చడానికి సుప్రీంకోర్టు సమయం నిర్దేశించిన నేపథ్యంలో ఈ నెల 27లోపు కౌంటర్లు దాఖలు చేయాలని నిందితులు టి.గంగిరెడ్డి (ఏ1), సునీల్ యాదవ్(ఏ2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ3), దస్తగిరి (ఏ4-అప్రూవర్), దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి (ఏ5), గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ6), వైఎస్ భాస్కర్‌రెడ్డి (ఏ7), కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి (ఏ8)తోపాటు సీబీఐకి కూడా కోర్టు ఈ నెల 23న ఆదేశాలు జారీచేసింది. అయితే గంగిరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి మాత్రమే కౌంటర్లు దాఖలు చేశారు. సునీత పిటిషన్‌ను కొట్టివేయాలని.. తదుపరి దర్యాప్తు అవసరం లేదని వారు పేర్కొన్నారు. కోర్టు ఆదేశిస్తే తదుపరి దర్యాప్తు చేస్తామని లేకపోతే లేదని సీబీఐ తెలిపింది. ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయబోమని.. మెమో దాఖలు చేస్తామని సీబీఐ తరఫు న్యాయవాది వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ అంశంపై తదుపరి విచారణను బుధవారాని(29వ తేదీ)కి వాయిదా వేశారు.

రాయితీ బకాయిలు విడుదల చేయాలి

» లేదంటే భాగస్వామ్య సదస్సు బహిష్కరణ

» ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల నోటీసు

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తమకు రావాల్సిన పారిశ్రామిక రాయితీ బకాయిలను ఈనెలాఖరుకల్లా 100 శాతం విడుదల చేయాలని, లేకుంటే నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సును బహిష్కరిస్తామని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈమేరకు జేఏసీ ప్రతినిధులు అనార్ బాబు, రాజశేఖర్, సత్యానందరావు, త్రిమూర్తులు, విజయ్ సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్ శుభం బన్సాల్, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. రాయితీలు ఇవ్వకపోతే సదస్సు వద్ద నిరాహార దీక్షలు చేపడతామన్నారు. జేఏసీ డిమాండ్లను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతామని బన్సాల్ హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం జిల్లాలో జేఏసీ నాయకుడు భక్తవత్సలం బృందం ఆ జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సమంత మా ఇంటి బంగారం



సమంత అభిమానులకు ఆనందం కలిగించే వార్త ఇది. తన సొంత నిర్మాణ సంస్థ త్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌లో కొత్త సినిమాని ప్రారంభించినట్లు సమంత ప్రకటించారు. ఈ చిత్రానికి 'మా ఇంటి బంగారం' అనే టైటిల్‌ని ఖరారు చేశామని, సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక, ఆశీర్వాదాలతో ప్రాజెక్టు మొదలైందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో సమంత, దిగంత్, గుల్షన్ దేవయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, సమంత, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ ప్రారంభమైందని, మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. బ్లాక్‌బస్టర్ హిట్ 'ఓ బేబీ' తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రమిది.


పునరాగమనం ఆనందాన్నిస్తోంది



"'బ్రహ్మ' సినిమా తర్వాత 'జటాధర'తో తెలుగు చిత్రపరిశ్రమలోకి తిరిగి అడుగుపెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో డబ్బుపై అత్యాశ ఉండే శోభ అనే మహిళ పాత్రలో నటించాను. ఎలాగైనా సరే ధనవంతురాలిని అవ్వాలనే క్యారెక్టర్ ఇది. అంతేకాదు సినిమాలో నాది కీలకమైన పాత్ర కూడా' అని చెప్పారు శిల్పా శిరోద్కర్. సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా దర్శకద్వయం వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రమిది. ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా శిల్పా శిరోద్కర్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- సుధీర్ బాబుతో కలసి పనిచేయడం గొప్ప అనుభవం. ఆయన ఎంతో అంకితభావంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. నేటి తరం నటుల నుంచి చాలా నేర్చుకోవచ్చు.
- సుధీర్ బాబు మాకు బంధువే అయినప్పటికీ సెట్‌లో మేమిద్దరం ప్రొఫెషనల్‌గానే ఉండేవాళ్లం. మహేశ్ బాబుగారు ఈ చిత్రం ట్రైలర్‌ని ఆవిష్కరించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన పరిశ్రమలోకి నన్ను ఆహ్వానించడం చెప్పలేనంత సంతోషం కలిగించింది.
- గతంతో పోల్చితే, తెలుగు చిత్ర పరిశ్రమ చాలా అభివృద్ధి చెందింది. కంటెంట్ పరంగా, టెక్నికల్ పరంగా చాలా అడ్వాన్స్ అయ్యాము.
- 'జటాధర' ఒక సూపర్ నేచురల్ థ్రిల్లర్. ఇందులో అద్భుతమైన సన్నివేశాలు ఉంటాయి. భావోద్వేగాలు కూడా అంతే అద్భుతంగా పండాయి. మంచి సంగీతం ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే చిత్రమిది.
- వెంకట్, అభిషేక్ మంచి క్లారిటీ ఉన్న దర్శకులు. నటీ, నటుల నుంచి ఏం కావాలో వాళ్లకి తెలుసు. నాకు రొమాంటిక్ కామెడీలు అంటే చాలా ఇష్టం. మంచి సినిమాలు చేయడమే నా కల.

నేను వచ్చినాక ఒక్కటే జోన్




మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటు అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జాతర' ట్రైలర్ వచ్చేసింది. రవితేజ అభిమానులు ఆశించే అసలు, సిసలైన మాస్ వేడుకలా ట్రైలర్ ఉంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, పంచ్ డైలాగులు అదిరిపోయాయి. "ఇన్నాళ్లు నువ్వు నా లిమిట్‌లోకి రాక నీ దందా నడిచింది. నేను రైల్వే పోలీస్ కాదు... క్రిమినల్ పోలీస్.. రైల్వేలో ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్, నార్త్ జోన్, సౌత్ జోన్‌లు ఉంటాయి.. నేను వచ్చినాక ఒక్కటే జోన్.. వార్ జోన్" అనే రవితేజ పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. కథానాయకుడు, ప్రతి నాయకుడి మధ్య ఉత్కంఠభరితమైన సంఘర్షణ నేపథ్యంలో ట్రైలర్‌ని రూపొందించిన తీరు ఆకట్టుకుంటోంది. వాణిజ్య అంశాలతో నిండిన పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రానికి హామీ ఇచ్చేలా 'మాస్ జాతర' ట్రైలర్ ఉంది. నవీన్‌చంద్ర మరోసారి శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించారు. భాను భోగవరపు తెరకెక్కించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈనెల 31న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

మంచి మ్యూజికల్ హిట్ అవుతుంది

\- సురేశ్ బాబు



'సినిమాపై ప్రేమతో మధుర శ్రీధర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి నిర్మాతగా మారారు. ఆయన ప్రయత్నం ఎప్పుడూ విఫలమవలేదు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా పాటలు బాగున్నాయి. ఈ సినిమా మంచి మ్యూజికల్ హిట్ కావాలి' అని ఆకాంక్షించారు నిర్మాత సురేశ్ బాబు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. నవంబరు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన వేడుకలో 'తెలుసా నీ కోసమే...' అంటూ సాగే గీతాన్ని నిర్మాత సురేశ్ బాబు ఆవిష్కరించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సందేశం ఇచ్చేలా చిత్ర కథ ఉండదు. ఆద్యంతం వినోదాత్మకంగానే సాగుతుంది' అని చెప్పారు. మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, వెన్నెల కిశోర్, అభినవ్ మంచి పాత్రలు పోషించారు' అని అన్నారు.




సరికొత్త ప్రేమ కథ



దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. ధన్యబాలకృష్ణన్ కథానాయిక. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బేనర్‌పై జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. సోమవారం నిర్వహించిన వేడుకలో మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సురేశ్ బాబు మాట్లాడుతూ 'అనిల్ చాలా అద్భుతంగా కథ రాశారు. తప్పకుండా సినిమా విజయవంతం అవుతుంది' అని ఆకాంక్షించారు. మాజీ సీబీఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'యువత ఏది చేసినా ప్యాషన్‌తో చేయమని చెబుతుంటాను. దేవన్‌ని చూసిన తర్వాత ఎలాగైనా అతన్ని సపోర్ట్ చేయాలనిపించింది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. దేవన్ మాట్లాడుతూ 'నిజాయితీగా సినిమా తీస్తే అందరూ సపోర్ట్ చేస్తారని 'కృష్ణ లీల' మరోసారి రుజువు చేసింది' అని చెప్పారు.

విడుదల ఖరారు



అల్లరి నరేశ్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన '12ఏ రైల్వే కాలనీ' సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈమేరకు నవంబరు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలియజేస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంతో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు.

ముంబైలో ఏఐ చలనచిత్రోత్సవాలు

ఇప్పటివరకూ మనం ఎన్నో చలనచిత్రోత్సవాలను చూశాం. త్వరలో పూర్తిగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతతో రూపొందిన సినిమాలతో ఓ చలనచిత్రోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముంబై వేదిక కాబోతోంది. ఇండియాలోనే అతి పెద్ద ఏఐ ఫిల్మ్ హ్యాకథాన్ ఈ నెల 31 నుంచి నవంబర్ 2 వరకూ మూడు రోజుల పాటు జరగనుంది. లోకల్ హోస్ట్ అనే సంస్థ నిర్వహిస్తోన్న ఈ పోటీలో భారతదేశం నలుమూలల నుంచీ, ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 మంది విడివిడిగా, బృందాలుగా పాల్గొంటారు. పోటీదారులు 48 గంటల్లో ఏఐ సాయంతో లఘు చిత్రాలను రూపొందించాల్సి ఉంటుంది. జోయా అక్తర్, కునాల్ కపూర్, షాకూన్ బాత్రా లాంటి పలువురు బాలీవుడ్ ప్రముఖులు జ్యూరీలో సభ్యులుగా ఉన్నారు. విజేతలకు పురస్కారాలతో పాటు రూ. 10 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. నవంబర్ 2న రాయల్ ఒపేరా హౌస్‌లో రెడ్ కార్పెట్ ఈవెంట్‌ను ఏర్పాటు చేసి, ఏఐ చిత్రాల ప్రీమియర్ స్క్రీనింగ్, అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు బాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవనున్నారు. ఏఐ సాయంతో ఎవరైనా తమ కథను సినిమాగా మలచవచ్చు, ఒక సినిమాకు అవసరమైన కథను, కథనాన్ని అభివృద్ధి చేయడానికి ఏఐ టూల్స్‌ను ఎంత వినూత్నంగా, ప్రభావవంతంగా ఉపయోగించుకోగలం అనేది తెలుసుకోవడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశం అని లోకల్ హోస్ట్ సంస్థ తెలిపింది.

మొంథాపై వార్..

నేటి నుంచి రేషన్ పంపిణీ

» తుఫాను ప్రభావిత 12 జిల్లాల్లో ముందస్తుగా సరఫరా

» ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం: మంత్రి మనోహర్



ఏలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో 12 జిల్లాల్లో.. మంగళవారం నుంచి రేషన్ డిపోల ద్వారా వచ్చే నెలకు సంబంధించి 7లక్షల లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో వరద పరిస్థితులను సమీక్షించేందుకు సోమవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ నుంచి ఎదురయ్యే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రానున్న నాలుగు రోజులకు పెట్రోలు, డీజిల్‌కు ఇబ్బందులు తలెత్తకుండా 3 ఆయిల్ కార్పొరేషన్‌లకు చెందిన 626 బంకుల ద్వారా 35,443 లీటర్ల పెట్రో నిల్వలను సిద్ధం చేశామన్నారు. సమాచార వ్యవస్థకు విఘాతం తలెత్తకుండా మొబైల్ టవర్ల వద్ద జనరేటర్ల నిర్వహణను పౌర సరఫరాల శాఖే పర్యవేక్షిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రారంభమైందని, రైతులకు ఇబ్బంది లేకుండా ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద 30వేల టార్పాలిన్‌లను సిద్ధం చేశామని మంత్రి మనోహర్ తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు 787 మంది గర్భిణులు

» 17 జిల్లాల్లోని ఆస్పత్రుల్లో 551 షెల్టర్లు: మంత్రి సత్యకుమార్



అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పరిస్థితుల ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ప్రసవానికి వారం రోజుల వ్యవధి కలిగిన సుమారు 787 మంది గర్భిణులను సమీప ఆసుపత్రులకు తరలించినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. 17 జిల్లా ల్లో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వర కూ 551 షెల్టర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే తుఫాను సహాయక విధుల్లో పాల్గొనే వారి హాజరును నిశితంగా పరిశీలిస్తున్నామని, జిల్లాలకు పంపిన ప్రామాణిక విధి విధానాలకు అనుగుణంగా అధికారులు, వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ స్పష్టం చేశారు.

సహాయ చర్యల్లో పాల్గొనండి: నడ్డా

న్యూఢిల్లీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆరా తీశారు. సోమవారం రాత్రి ఆయన మంత్రి సత్యకుమార్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా సత్యకుమార్.. 'మొంథాని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వైద్య ఆరోగ్య శాఖ కూడా ముందస్తు జాగ్రత్తతో అవసరమైన చోట్ల ప్రజలకు సేవలందించేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది' అని నడ్డాకు వివరించారు. అనంతరం జేపీ మాట్లాడుతూ... 'పార్టీ అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనాలని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వండి' అని సూచించారు

గిరిజన ప్రాంతాల్లో 89,845 దోమ తెరలు పంపిణీ

అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎంపిక చేసిన గిరిజనుల కుటుంబాలకు రూ.2.30 కోట్ల వ్యయంతో 89,845 దోమ తెరలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గడచిన మూడేళ్లలో అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అధికంగా మలేరియా జ్వరాల కేసులు నమోదయ్యాయని, దీని ప్రాతిపదికన ఆ రెండు జిల్లాల్లో 743 గ్రామాల్లోని గిరిజనులకు.. మన్యం 26,338, అల్లూరి జిల్లాకు 63,507 దోమ తెరలను నెల రోజుల వ్యవధిలో పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రజా భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వండి

» విద్యుత్ పునరుద్ధరణకు పూర్తి ఏర్పాట్లు చేసుకోండి: సీఎస్



అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు అప్రమత్తంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్నారు. విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ సరఫరాకు అంతరా యం తలెత్తిన వెంటనే తక్షణమే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ప్రజాభద్రతకు ప్రాధాన్యతనివ్వాలని, కంట్రోల్ రూములు, కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణతో విద్యుత్ సిబ్బంది పనిచేయాలని కోరారు. కాగా, రాష్ట్రంలోని అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో అత్యవసర వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయని జెన్కో ఎండీ నాగలక్ష్మి సీఎస్‌కు తెలిపారు. విశాఖ, విజయవాడ జోన్లలోని 8 జిల్లాల్లో పునరుద్ధరణకు కావాల్సిన సామగ్రి, సిబ్బందిని సిద్ధంగా ఉంచామని ట్రాన్స్‌కో జెఎండీ ప్రవీణ్ చంద్ తెలిపారు. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ మాట్లాడుతూ... తుఫాను ప్రభావిత జిల్లాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన పునరుద్ధరణకు విస్తృత ఏర్పా ట్లు చేశామని తెలిపారు. 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పంట నష్టం తగ్గించేందుకు చర్యలు

» వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో పంటల రక్షణకు రైతులకు సాంకేతి క సలహాలిచ్చి, నష్టాన్ని తగ్గించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధా న కార్యదర్శి బి. రాజశేఖర్ ఆదేశించారు. వ్యవసా య, ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్థక శాఖల అధిపతులు, జిల్లా అధికారులతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తుఫాన్ ప్రభావిత, సున్నిత గ్రామాలను గుర్తించి పంటల్ని రక్షించే దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమయంలో అధికారుల పనితీరును సమీక్షించడానికి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని, ఫిర్యాదులు అందిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ మాట్లాడుతూ.. తుఫాన్ హెచ్చరికలపై రైతులకు 69 లక్షల అప్రమత్త సందేశా లు పంపినట్లు తెలిపారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గాలులకు అరటి, కూరగాయ చెట్లు పడిపోకుండా స్టాకింగ్ కట్టెల ను ఊతంగా పెట్టాలని రైతులకు సూచించినట్లు తెలిపారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ.. పత్తికి తుఫాన్ తాకిడి ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నేడు, రేపు మిర్చి యార్డుకు సెలవులు

» గుంటూరు రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్కు ఏర్పాటు

తుపాను ప్రభావం దృష్ట్యా ముందు జాగ్రత్తగా ఈ నెల 28, 29 తేదీ (మంగళ, బుధవారం)ల్లో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కి సెలవులు ప్రకటించినట్లు జీఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. తుఫాను కారణంగా జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే, ఈస్టు కోస్టు రైల్వే జోన్‌లు పలు రైళ్లను రద్దు చేశాయి. సోమవారమే కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు తొలుత ప్రకటించినప్పటికీ సాయంత్రానికి వాటిల్లో కొన్నింటిని పునరుద్ధరించారు. రైళ్ల రద్దు దృష్ట్యా గుంటూరు రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్కుని ఏర్పాటు చేశారు.

అవసరంలేని బస్సులు ఆపేయండి: ఎండీ

అమరావతి, గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ప్రయాణీకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని బస్సులు నడిపే విషయంలో సముచిత నిర్ణయాలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు.. ఆర్ఎంలు, బస్ డిపో మేనేజర్లకు ఆదేశాలిచ్చారు. ఆర్టీసీ అధికారులతో సోమవారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రయాణీకుల భద్రతతో పాటు ఆర్టీసీకి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. మొంథా ప్రభావిత ప్రాంతాలకు బస్సులు రద్దు చేసి ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రాంతాలకు సర్వీసులు ఆపేయాలని చెప్పారు. అన్ని డిపోల ఆర్టీసీ అధికారులు స్థానిక పోలీసు, రైల్వే వారితో సమన్వయం చేసుకోవాలన్నారు.

తుఫాన్‌పై ఎన్ని రివ్యూలు చేశారనేది కాదు..

క్షేత్రస్థాయిలో ప్రభావం ఎంతనేదే ముఖ్యం

తిత్లీ, హుద్‌హుద్ అనుభవాలను స్టడీ చేయండి

రియల్ టైంలో ప్రజలకు సమాచారం అందాలి

ప్రతి గంటకూ తుఫాన్‌పై బులిటెన్లు: సీఎం



కలెక్టర్లు, ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

ఆందోళన వద్దు..

అప్రమత్తంగా ఉందాం!

అమరావతి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, అప్రమత్తంగా ఉందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి 10గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో తుఫాన్ ప్రభావంపై వాతావరణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంపై మంగళవారం నుంచి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలపగా.. దీనిపై రియల్‌టైమ్‌లో ప్రజలకు సమాచారం అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ సన్నాహాలు, సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తుఫాన్ సన్నద్ధతపై ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన సమాచారంపైనా సీఎం సమీక్ష చేశారు. అంతకుముందు... ఇదే అంశంపై ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రతి గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేయాలని ఆదేశించారు. తుఫాన్ రక్షణ చర్యల విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుందని, ఆ సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలని చంద్రబాబు కోరారు. ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు పంపి, అవగాహన పెంచాలని, తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్ల అనుభవాన్ని వినియోగించాలని సీఎం సూచించారు. 'రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్ఠం చేయాలి. చెరువులు, కాలువ గట్లు తెగిపోకుండా చూసుకోవాలి. సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా, శాటిలైట్ ఫోన్లు వినియోగించాలి. ప్రత్యేకంగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జనరేటర్లను బ్యాకప్ కోసం వినియోగించాలి. తుఫాన్ వల్ల ఎవ్వరూ ప్రమాదాల బారిన పడకూడదు.

ఒక్క మరణం కూడా సంభవించకూడదు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి" అని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి, జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి లోకేష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం

» సీఎం ఆదేశాలు

'మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలి' అని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. మొంథా తుఫాన్‌పై కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి ప్రాంతాల్లో కొండచరియలు జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జి అధికారుల ను నియమించాలి. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. వలంటరీగా వచ్చే వారిని సహాయ కార్యక్రమాలకు వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశించారు.

చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్

» మంత్రి లోకేశ్‌కు పీఎంవోతో సమన్వయ బాధ్యతలు

మొంథా ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్రమోదీ తనకు ఫోన్ చేసి, అడిగి తెలుసుకున్నారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంవోతో సమన్వయం బాధ్యతను మంత్రి లోకేశ్‌కు సీఎం అప్పగించారు.

సన్నద్ధతపై 83శాతం సంతృప్తి : అధికారులు

అధికారులు ఎన్ని రివ్యూలు చేశారనేది కాదని, క్షేత్రస్థాయిలో ఎంత మేర ప్రభావం చూపిందనేది ముఖ్యమని, దీనికి ప్రజాభిప్రాయాన్ని ప్రాతిపదకగా తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్‌పై ప్రభుత్వ సన్నద్ధత ఎలా ఉందనే అంశంపై సేకరించిన ప్రజాభిప్రాయంలో 83% సంతృప్తి వ్యక్తమైందని అధికారులు వివరించారు. తుఫాన్‌కు సంబంధించి జాగ్రత్తలపై మీమీ ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయా అన్న ప్రశ్నకు 70శాతం మంది అవును.. అని సమాధానమిచ్చారని తెలిపారు. ముందు జాగ్రత్తలపై 74శాతం మంది సంతృప్తిగా ఉన్నారని అధికారులు వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తొలిసారిగా ఈ సిస్టంను ఏర్పాటు చేశామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమాచారం ఆధారంగా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు మైక్‌ల ద్వారా అప్రమత్తం చేసే అవకాశం ఉందని తెలిపారు.

రైలు, విమాన సర్వీసులకు బ్రేక్!

ప్రజా రవాణాపై తుఫాన్ తీవ్ర ప్రభావం

» రాష్ట్ర పరిధిలో నడిచే 100 రైళ్లు రద్దు

» అంతే సంఖ్యలో విమాన సర్వీసులు కూడా..

» ఉదయం లోపు నడిచే వాటికే అనుమతి

విజయవాడ/విశాఖపట్నం/రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ఆందోళన కలిగిస్తోంది. కోస్తా జిల్లాలపై అధిక ప్రభావం అంచనాల నేపథ్యంలో రైల్వే శాఖ మంగళవారం భారీగా రైలు సర్వీసులను రద్దు చేసింది. వీటితో పాటు విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం నుంచి నడిచే దాదాపు 100 మేర విమాన సర్వీసులు రద్దయ్యాయి. విజయవాడ డివిజనల్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో 100కు పైగా రైళ్ల సర్వీసులను అధికారులు రద్దు చేశారు. కోస్తా జిల్లాల మీదుగా నడిచే మొత్తం 95 రైళ్ల సర్వీసులను రద్దు చేసినట్టు విజయవాడ డివిజనల్ రైల్వే తెలిపింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న వారికి 24 గంటలూ రీఫండ్ ఇవ్వటానికి వీలుగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 43 రైళ్లను రద్దు చేశారు. విజయవాడ డివిజనల్ రైల్వే రద్దు చేసిన సర్వీసుల్లో ప్రధానంగా తిరుపతి-విశాఖపట్నం(22708), విజయవాడ-రాజమండ్రి (67262), హైదరాబాద్-విశాఖపట్నం (12728), రేపల్లె-మార్కాపూర్ రోడ్డు (67238), విజయవాడ-ఒంగోలు (67273), కాకినాడ పోర్టు-విశాఖపట్నం(17267),విశాఖపట్నం-రాజమండ్రి(67286), మహబూబ్‌నగర్-విశాఖపట్నం (12862), చెన్నై సెంట్రల్-విశాఖపట్నం(22870), భువనేశ్వర్-బెంగుళూరు(18463), సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), భువనేశ్వర్-సికింద్రాబాద్(17015), లింగంపల్లి-విశాఖపట్నం(12806), కడప-విశాఖ(18522), రాయగడ-గుంటూరు(17244) తదితర సర్వీసులు ఉన్నాయి.

విజయవాడ నుంచి 36 విమాన సర్వీసులు బంద్

సోమవారం రాత్రి విజయవాడ నుంచి విశాఖ వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసు రద్దయింది. ఇక్కడి నుంచి 46 సర్వీసులు నడుస్తుండగా.. మంగళవారం 36 రద్దయ్యాయి. విజయవాడ నుంచి షార్జాకు నడిచే 2సర్వీసులను రద్దు చేసింది. విజయవాడ-విశాఖ మధ్య రెండు, విజయవాడ-బెంగళూరు 2, విజయవాడ-హైదరాబాద్ 2 సర్వీసులను రద్దు చేసింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళ్లే 18 ఇండిగో ఎయిర్‌లైన్స్ సర్వీసులు రద్దయ్యాయి. కేవలం ఉదయం 10.30 గంటల వరకు విమానాలు మాత్రమే నడుస్తాయి. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి మంగళవారం ఉదయం 9.30గంటల లోపు నడిచే సర్వీసులు మాత్రమే యథావిధిగా నడుస్తాయి. తర్వాత ముంబై, తిరుపతి, బెంగుళూరు, చెన్నైలకు వెళ్లే సర్వీసులన్నీ రద్దు చేశారు. విశాఖపట్నం విమానాశ్రయం అధికారులు కూడా విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై సహా దేశంలోని పలు నగరాలకె వెళ్లే మంగళవారం నాటి ఇండిగో, ఎయిరిండియా సర్వీసులన్నింటినీ రద్దు చేశారు. దాదాపు 56 విమాన సర్వీసులకు బ్రేకులు పడ్డాయి. కాగా, తుఫాన్ ముప్పు నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సోమవారం విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియాతో అత్యవసర సమావేశం నిర్వహించారు

రైల్వే ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి

» భూసేకరణ, రాష్ట్ర వాటా నిధులు విడుదలకు ఇబ్బంది లేదు

» రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'రైల్వే ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెంచండి.. భూ సేకరణ, ఇతర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైల్వేకి సహకరిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు రైల్వే అధికారులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతి, నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లపై సచివాలయంలో సోమవారం ఆయన రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుదీర్ఘకాలంగా సాగుతున్న నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్, రాయదుర్గం-తుముకూరు మధ్య రైల్వే లైన్లు.. గుణదల-ముస్తాబాద్ బైపాస్ తదితర ప్రాజెక్టుల పురోగతిపై రైల్వే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టులకు అడ్డంకిగా ఉన్న భూ సేకరణ, నిధులు విడుదల, అనుమతుల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు, తక్షణమే రైల్వే శాఖ చేపట్టాల్సిన చర్యలు, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు-అండర్ బ్రిడ్జిల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సీఎం సమీక్షించారు. ప్రస్తుతం ఏపీలో రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పెట్టుబడులు మౌలిక వసతుల కల్పనపై రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణబాబుకు సీఎం సూచించారు.



పోర్టులకు రైల్వే కనెక్టివిటీ తప్పనిసరి

ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్ రంగాన్ని భారీగా అభివృద్ధి చేయడానికి రైలు కారిడార్ ఎంతో కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న పోర్టులను రైల్వే కనెక్టివిటీతో అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... మూలపేట, విశాఖపట్నం, కాకినాడ, రామాయపట్నం పోర్టులకు రైల్వే కనెక్టివిటీ పెంచాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్-బెంగుళూరు, అమరావతి మీదుగా చెన్నై-హైదరాబాద్ మార్గాల్లో ఎలివేటెడ్ రైల్వే కారిడార్ ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును ఆలోచనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఖరగ్‌పూర్-చెన్నై మధ్య డెడికేటెడ్ కారిడార్, కొత్తగా 1,564 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాలపైనా చంద్రబాబు ఆరా తీశారు. నడికుడి-శ్రీకాళహస్తి మార్గానికి అవసరమైన రూ.27 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వేశాఖ ప్రతిపాదించిన అమరావతి, గన్నవరం నూతన రైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి.. విజయవాడ, గుంటూరులో టెర్మినళ్ల విస్తరణకు సమ్మతి తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి రైల్వే స్టేషన్లను ఐకానిక్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. విజయవాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు వేగవంతం చేయాలని, విశాఖపట్నం స్టేషన్‌ను జ్ఞానాపురం వైపు అభివృద్ధిని చేస్తే ట్రాఫిక్ తగ్గుతుందని రైల్వే అధికారులకు సూచించారు. అమరావతిలో నిర్మించబోయే కొత్తస్టేషన్‌ను వినూత్నంగా తీర్చిదిద్దాలన్నారు. రూ.271కోట్లతో జరుగుతున్న రాజమహేంద్రవరం స్టేషన్ అప్‌గ్రేడ్ పనులను గోదావరి పుష్కరాల నాటికి పూర్తిచేయాని ఆదేశించారు.

టెండర్లలో 'మార్కుల'

మతలబు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ విధానం ఉన్నా.. ఈ మధ్యకాలంలో ఆరోగ్య శాఖ సహా కొన్ని శాఖల్లో దీన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అర్హత కలిగిన కంపెనీలకు టెండర్లు దక్కుతాయనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం క్యూసీబీఎస్ అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే అధికారులు దీన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ముందుగానే ఫిక్సింగ్ చేసుకున్న కంపెనీలకు టెండర్లు దక్కేలా చేస్తున్నారు. పాత ఎల్1 విధానమే బాగుందని, క్యూసీబీఎస్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

సీటీ స్కాన్ టెండర్లలో...

ఆరోగ్య శాఖలోని మెడికల్ కార్పొరేషన్ ఈ నెలలో సీటీ స్కాన్ సేవల నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కింద ఉన్న హిందూపురం, ఆత్మకూరు, తెనాలి, తణుకు, కడప, శ్రీకాకుళం, బాపట్ల, తిరుపతి ఆస్పత్రుల్లో రోగుల కోసం సీటీ స్కాన్ మిషన్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ కోసం టెండర్లు పిలిచింది. ఈ టెండర్ ప్రక్రియలో కూడా క్యూసీబీఎస్ విధానాన్నే అధికారులు అమలు చేశారు. ఈ టెండర్‌కు వంద మార్కులు నిర్ణయించారు. అందులో టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించాలంటే 80 మార్కులు, ఫైనాన్సియల్ బిడ్‌లో 20 మార్కులు రావాలి. టెక్నికల్ బిడ్‌లో 80 మార్కుల కోసం అధికారులే కొన్ని నిబంధనలు నిర్ణయించారు. ఆయా నిబంధనలకు అనుగుణంగా కంపెనీలకు అర్హత ఉంటేనే మార్కులు ఇస్తారు. టెండర్లలో పాల్గొనే కంపెనీకి మూడేళ్ల అనుభవం ఉంటే మూడు మార్కులు, మూడేళ్లకు పైగా ఉంటే ఐదు మార్కులు ఇస్తారు. అలానే ఎన్ఏబీఎల్ లేదా ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ ఉంటే ఐదు మార్కుల ఇస్తారు. అక్రిడిటేషన్ లేకపోతే సున్నా మార్కులు. టర్నోవర్ రూ.10 కోట్ల లోపు ఉంటే ఐదు మార్కులు, రూ.10 కోట్లకు పైన ఉన్న కంపెనీలకు పది మార్కులు వేస్తారు. అలాగే టెండర్లలో పాల్గొనే కంపెనీ వద్ద ఐదుగురు రేడియాలజిస్టులు ఉంటే ఐదు మార్కులు, పది మంది ఉంటే పది మార్కులు, 10 మందికి పైగా ఉంటే 15 మార్కులు, 20 మంది పైగా ఉంటే 20 మార్కులు ఇచ్చేలా నిబంధన పెట్టారు. అత్యంత హాస్యాస్పదం ఏమిటంటే... టెక్నికల్ బిడ్ సమయంలో టెండర్‌లో పాల్గొనే కంపెనీ సీటీ స్కాన్లు ఏవిధంగా చేస్తారో సంపూర్ణ ప్లానింగ్‌ను అధికారులకు వివరించాలి. ప్లానింగ్ ఆధారంగా వారికి 25 మార్కులు ఇస్తారు. అధికారులు ఏదో ఒక కంపెనీతో కుమ్మక్కైయ్యారని చెప్పడానికి ఈ నిబంధన చాలు. టెండర్ దక్కకుండా తప్పించడానికి ఒక్క మార్కు చాలు. కానీ అధికారులు ఏకంగా 25 మార్కులు పెట్టుకుని, ఫిక్సింగ్ చేసుకున్న కంపెనీకి టెండర్ ఇచ్చే లా స్కెచ్ వేశారని స్పష్టంగా అర్థం అవుతోంది. ఇలా క్యూసీబీఎస్ విధానంలో పిలిచే ప్రతి టెండర్‌లో ఇలానే చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎల్1కు, క్యూసీబీఎస్‌కు ఇదీ తేడా..

సాధారణంగా టెండర్ ప్రక్రియలో టెక్నికల్ బిడ్, ఫైనాన్సియల్ బిడ్ ఉంటాయి. టెక్నికల్ బిడ్‌లో క్వాలిఫై అయిన సంస్థలకు సంబంధించిన ఫైనాన్సియల్ బిడ్లు తెరుస్తారు. ఏ కంపెనీ తక్కువ మొత్తానికి వర్క్ చేయడానికి ముందుకు వస్తుందో, ఆ కంపెనీని ఎల్1 సంస్థగా ఎంపిక చేస్తారు. సదరు వర్క్‌ను ఎల్1 కంపెనీలకు కేటాయిస్తారు. కానీ క్యూసీబీఎస్‌లో దీనికి పూర్తిగా విరుద్ధంగా జరుగుతుంది. టెండర్లల్లో పాల్గొనే కంపెనీల టెక్నికల్ అర్హత, టర్నోవర్, ఎక్స్‌పీరియన్స్, కేంద్రం ఇచ్చిన సర్టిఫికెట్లు.. ఇలా ప్రతిదాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత దానికి అనుగుణంగా కంపెనీలకు అధికారులు మార్కులు వేస్తారు. ఏ కంపెనీకి ఎక్కువ మార్కులు వస్తే ఆ కంపెనీకి వర్కులు ఇస్తారు. క్యూసీబీఎస్‌లో టెక్నికల్‌గా అర్హత సాధించాలంటే 70 మార్కులు, ఫైనాన్సియల్‌గా అర్హతకు 30 మార్కులుగా నిర్ణయిస్తారు. టెక్నికల్ అర్హత చాలా కంపెనీలకు సాధ్యం కాని పనిగా మారుతుంది. దీన్నే కొంతమంది అధికారులు క్యాష్ చేసుకుంటున్నారు. కొన్ని కంపెనీలతో ముందుగానే ఫిక్సింగ్ చేసుకుంటున్నారు. టెక్నికల్ అర్హత నిబంధనలను ఆ కంపెనీలకు అనుగుణంగా నిర్ణయించేస్తున్నారు. దీంతో క్యూసీబీఎస్ విధానంలో ఎంత పెద్ద కంపెనీ టెండర్ వేసినా ఏదో ఒక నిబంధనల్లో మార్కులు తగ్గించి ఆయా కంపెనీలను డిస్‌క్వాలిఫై చేస్తున్నారు. దీనివల్ల అధికారులు నిర్ణయించిన కంపెనీలకు టెండర్లు దక్కుతున్నాయి.

రాష్ట్ర డేటా సెంటర్ సలహా మండలి ఏర్పాటు

» అధ్యక్షుడిగా మంత్రి లోకేశ్.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి లోకేశ్ అధ్యక్షతన రాష్ట్ర డేటా సెంటర్ సలహా మండలిని ఏర్పాటు చేస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో హైపర్‌స్కేల్ క్లౌడ్ ప్రొవైడర్స్ డైరెక్టర్ శ్రీకాంత్ కామకోట, డేటా సెంటర్ ఆపరేటర్స్ శరద్ సంఘి, సామ్‌సన్ ఆర్థర్, జితేశ్ కర్లేకర్, లలిత్ ఖన్నా, కల్యాణ్ ముప్పనేని, ఇండస్ట్రీస్ విభాగం నుంచి ఆశిష్ అగర్వాల్, వినాయక్ గాడ్సే, రాజేశ్ చన్నా, విక్రమ్ గన్పోద్ర, దీపక్ శర్మ, అనిష్ షా, జీపీ రాజశేఖర్, ఎం.చంద్రశేఖర్, కేఎస్ సత్యనారాయణ, గీతాంజలి శర్మ, సంజయ్ బాహితో పాటు రాష్ట్ర అధికారులు ప్రఖర్‌జైన్, మల్లవరపు సూర్యతేజ, కాటమనేని భాస్కర్ ఉంటారు.

మద్యం స్కాం కేసులో.. కసిరెడ్డి ప్రాసిక్యూషన్‌కు గ్రీన్‌సిగ్నల్!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి జీత భత్యాలు తీసుకున్నందున ఆయన్ను ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వం అనుమతించాలి. లేదంటే న్యాయపరంగా చిక్కుముడులు ఎదురయ్యే అవకాశముంది. దీంతో వీటిని అధిగమించేందుకు వీలుగా ఆయనపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. సంబంధిత ఉత్తర్వు బహిర్గతం కాకపోయినా.. చట్టపరంగా రాజ్ కసిరెడ్డిని ప్రాసిక్యూట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మద్యం స్కాం కేసు దర్యాప్తు మందకొడిగా సాగుతోందని.. వైసీపీ వర్గాల్లో చర్చ సాగుతున్న తరుణంలో.. ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఉద్యోగులూ అందుబాటులో ఉండండి: ఏపీ ఎన్జీవో నేత విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి అండగా నిలవాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. 'ప్రాణ, ఆస్తి, పంట నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం, కలెక్టర్లు, అధికార యంత్రాంగం అప్రమత్తమై ఉంది. విపత్తుల సమయంలో ఉద్యోగుల పాత్ర కీలకం. మానవతాదృక్పథంతో ప్రజలకు సేవలు అందించాలి. ప్రజలకు భరోసా కల్పించేలా పని చేయాలి' అని విద్యాసాగర్ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.


ఆర్‌టీజీఎస్ నుంచి అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు అనిత, లోకేశ్, అధికారులు


తుఫాన్ హెచ్చరికతో విశాఖ తీరంలో లంగరు వేసిన బోట్లు


శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం బందరువానిపేట తీరంలో సముద్రపు అలల హోరు

హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి మంగళవారం ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా బలపడి, కోస్తాంధ్రకు దగ్గరగా రానుంది. అదేదిశలో పయనించి మంగళవారం రాత్రికి మచిలీపట్నం-విజయనగరం మధ్య కాకినాడ వద్ద తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపాయి. అయితే కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. తుఫాను ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం నుంచి గాలులు గంటకు 45 నుంచి 55 కిలోమీటర్లు, అప్పుడప్పుడు 65 కిమీ వేగంతో వీస్తున్నాయి. తుఫాను తీరం దిశగా వచ్చే క్రమంలో మంగళవారం ఉదయం నుంచి గంటకు 60 నుంచి 70 కిలోమీటర్లు, సాయంత్రం నుంచి గంటకు 90 నుంచి 100- 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. మంగళవారం సాయంత్రం తుఫాన్ తీరం దాటే సమయంలో మధ్య కోస్తా జిల్లాల్లో కుంభవృష్టికి అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడు అంచనా వేశారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఎక్కువగా కృష్ణా, గుంటూరు జిల్లాలపై ప్రభావం ఉంటుందని, దీనికి అనుగుణంగా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోస్తాలో మిగిలిన జిల్లాల్లో భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని తెలిపారు.

రెడ్ అలర్ట్

తుఫాన్ ప్రభావంతో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకూ భారీ నుంచి అతిభారీగా, అక్కడక్కడా కుంభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మంగళ, బుధవారాలు పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉంది. తీవ్ర తుఫాన్ తీరం దాటే ప్రాంతాలు ప్రధానంగా కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సముద్ర అలలు మీటరు ఎత్తు మేర ఎగిసిపడనున్నాయి. బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తిరిగి రావాలని ఐఎండీ హెచ్చరించింది.

పలు జిల్లాలు తడిసిముద్ద..

తుఫాన్ ప్రభావంతో సోమవారం రాత్రి 8గంటల వరకు విశాఖ రూరల్‌లో 92.5, కాపులుప్పాడలో 85.5, మధురవాడలో 83.5, సీతమ్మధారలో 81.2 మిల్లీమీటర్ల వాన కురవగా, రాష్ట్రవ్యాప్తంగా 63 ప్రాంతాల్లో 50 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైంది. విశాఖ ఆర్కే బీచ్‌లో నీరు బాగా ముందుకువచ్చింది. అనకాపల్లి జిల్లాలో సాయంత్రం నుంచి వర్షం మరింత ఎక్కువైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉదయం స్వల్పగాలులతో చిరుజల్లులు కురిశాయి. ఒడిశాలో వర్షాలు కురుస్తుండడంతో ఈ జిల్లాలో జలాశయాలకు వరద పోటెత్తింది. మరోవైపు రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. సాయంత్రం నుంచి ఈదురుగాలుల కూడా మొదలయ్యాయి. పోలాకి మండలంలో అత్యధికంగా 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అల్లూరి జిల్లాలో ఉదయం నుంచి వర్షాలు మొదలయ్యాయి. విజయనగరంలో కడలి కల్లోలంగా మారింది. భోగాపురం మండలం ముక్కాం వద్ద సముద్రం 15 మీటర్లు ముందుకొచ్చింది. భయపడిన మత్స్యకారులు తీరంలో లంగరు వేసిన బోట్లను గృహాల వద్దకు చేర్చారు.

దక్షిణ కోస్తాలో..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వర్షం తీవ్రత పెరిగింది. సూర్యలంక సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో పర్యాటకులపై నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. కుండపోత వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో సోమవారం కారు మబ్బులు కమ్ముకొని జల్లులు ప్రారంభమయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు, నర్సాపురం తీరప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఈదురుగాలులు వీస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సాయంత్రానికి సగటున 6సెంమీ వర్షం కురిసింది. మొగల్తూరులో పర్యాటక రిసార్ట్‌లు, బీచ్ సందర్శనలను నిషేధించారు. ప్రకాశం జిల్లాలో తుఫాన్ ప్రభావం తీవ్రంగానే ఉండనుందని వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తుల సంస్థ రెడ్ అలర్ట్ ప్రకటించాయి. కార్తీక సముద్ర స్నానాలకు పెద్దసంఖ్యలో వచ్చేవారిని దృష్టిలో ఉంచుకుని కొత్తపట్నం, పాకల, ఈతముక్కల, కనపర్తి ఇతర బీచ్‌లు, తీరాలను మూసివేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కృష్ణాజిల్లాలో ఉదయం తేలికపాటి వర్షం ప్రారంభమై, మధ్యాహ్నం తర్వాత అధికమైంది. అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. గుంతకల్లులోని పలు కాలనీల్లో వర్షపు నీరు మోకాళ్లలోతు నిలిచింది. నెల్లూరు జిల్లాలో రోజంతా చినుకులు పడుతూనే ఉన్నాయి.



భయపెడుతున్న భారీ వర్షసూచన..

సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల వరకు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు; కోస్తాలోని మిగిలిన జిల్లాలు; రాయలసీమలో తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, మిగిలిన జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీవ్ర తుఫాన్ 233 మండలాల్లోని 1,419గ్రామాలు, 44 మున్సిపాలిటీల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ అంచనా వేశారు. ఆయా ప్రాంతాల్లో 2,194 పునరావాస శిబిరాలు సిద్ధంగా ఉండగా, అవసరమైన ప్రాంతాల వారిని అక్కడి తరలించడానికి జిల్లాల యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ టీమ్‌ల మోహరింపు

తుఫాన్ సహాయ చర్యల కోసం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ టీమ్‌లు జిల్లాల్లో మోహరించాయి. నెల్లూరు, మచిలీపట్నం, భీమవరం, పిఠాపురం, తాళ్లరేవు, అమలాపురం, శ్రీకాకుళంలలో 30 మంది సభ్యులతోను, అనకాపల్లిలో 35 మందితో ఒక్కో ఎన్డీఆర్‌ఎఫ్ టీమ్ సిద్ధంగా ఉండగా, విశాఖలో 60 మందితో రెండు బృందాలు, కృష్ణా జిల్లా కొండపావులూరులోని 10వ బెటాలియన్‌లో 90 మందితో మూడు బృందాలు రిజర్వ్‌లో ఉన్నాయి. విజయవాడ ఘాట్స్, తిరుపతిలోని బీఎన్ కండ్రిక, ఒంగోలు, అమలాపురం, ఏలూరు, అనకాపల్లిలలో 25 మంది చొప్పున ఒక్కో ఎస్డీఆర్‌ఎఫ్ టీమ్, రాజమండ్రి, బాపట్ల-సూర్యలంక, రాజంపేటలో 30 మంది చొప్పున ఒక్కో టీమ్, విశాఖ, కాకినాడ, తిరుపతిలో 30 మంది చొప్పున ఎస్డీఆర్‌ఎఫ్ టీమ్‌లు రిజర్వ్‌లో ఉన్నాయి.


సోమవారం సాయంత్రం శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం


విజాంపట్నం హార్బర్‌లో మొంథా తుఫాన్ కారణంగా మెరైన్‌బోట్లలో కాలంగడుపుతున్న మత్స్యకారులు


తీర ప్రాంతంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు


కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో నిలిచిపోయిన బోట్లు

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు

సిద్ధంగా ఉండండి

» కాకినాడ కలెక్టర్, అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

» ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో ఉండండి: మంత్రి లోకేశ్



అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో ఎలాంటి అత్యవసర స్థితిని ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండాలంటూ పలువురు మంత్రులు అధికారులను అప్రమత్తం చేశారు. తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను, అత్యాయిక స్థితిలో స్పందించాల్సిన తీరును టెలీకాన్ఫరెన్సులో వివరించారు. ఎలాంటి భయాందోళనలు వద్దని, ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రజలకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నారాయణతో కలసి కాకినాడ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి లోకేశ్, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ మాట్లాడుతూ... 'తుఫాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి. జిల్లా పరిధిలోని 12 మండలాల పరిధిలో తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా చర్యలు చేపట్టాలి. ప్రజలు ఇళ్లల్లో లేని సమయంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలతో ప్రత్యేక భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే ప్రజలను అప్రమత్తం చేయాలి' అని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ కొన్ని సూచనలు చేశారు.

ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడండి: లోకేశ్

'తుఫాను ప్రభావం అధికంగా ఉన్న నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. కాకినాడ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సాయం అందించాలి. కూటమి పార్టీల కేడర్ ఆయా ప్రాంతాల్లో సహాయ చర్యల్లో పాల్గొనాలి. అంటురోగాలు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలి. అంబులెన్సులు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలి. విద్యుత్తు సరఫరా, కమ్యూనికేషన్ సమస్యలు లేకుండా చూడాలి. తుఫాను బాధితులకు సాయం అవసరమైనా వెంటనే స్పందించేందుకు ప్రభుత్వం యంత్రాంగం 24/7 అందుబాటులో ఉంటుంది' అని లోకేశ్ హామీ ఇచ్చారు.

బుడమేరు మళ్లింపు కాలువపై నిఘా పెట్టండి: మంత్రి నిమ్మల

తుఫాను ప్రభావిత జిల్లాల్లోని జల వనరుల శాఖ ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో కాడా స్పెషల్ కమిషనర్ ప్రశాంతి, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులతో కలసి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. 'చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలి. ఎన్‌టీఆర్ జిల్లాలో వర్షపాతాన్ని బట్టి బుడమేరు డైవర్షన్ చానల్‌పై నిఘా ఉంచాలి' అని ఆదేశించారు.



జల దిగ్బంధంలో పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం

కలిదిండి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలూరు జిల్లా కలిదిండిలో ప్రసిద్ధ పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. గర్భగుడిలోకి సైతం నీరు చేరింది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఉదయం గర్భగుడిలో చేరిన నీటిని తోడివేసి భక్తులను అనుమతించారు. అయితే, మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి మళ్లీ నీరు చేరడంతో దర్శనాలను నిలిపివేశారు.

ఉప్పాడ తీరం అల్లకల్లోలం

» కాకినాడ పోర్టులో ఏడో నంబర్ ప్రమాద హెచ్చరిక

కాకినాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈదురుగాలుల తీవ్రత పెరిగింది. కాకినాడలో హైఅలర్ట్ ప్రకటించారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉండడంతో కాకినాడ పోర్టులో ఏడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 2014లో హుద్‌హుద్ తుఫాను తర్వాత ఇక్కడ ఏడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేయడం ఇదే తొలిసారి. పోర్టులో కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేశారు. 16 నౌకలను బెర్త్‌ల నుంచి సముద్రంలోకి తరలించారు. ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. బీచ్ రోడ్డును భారీగా అలలు తాకాయి. కోత నివారణకు అడ్డంగా నిర్మించిన బండరాళ్లు సైతం కదిలించాయి. తుఫాను ప్రభావం కాకినాడ జిల్లాలో 12 మండలాల్లో అధికంగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 12 మండలాల పరిధిలో 67 గ్రామాల్లో నష్టం ఎక్కువగా ఉంటుందని అంచనా. 269 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తీరప్రాంత మండలాల్లో ఉంటున్న 9,500 మందిని పునరావాస శిబిరాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు. తుఫాను తీరం దాటే సమయంలోను, ఆ తర్వాత పెనుగాలుల తీవ్రతకు 2 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉన్నట్లు ట్రాన్స్‌కో అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం 3 వేల స్తంభాలను తెప్పించారు. రాయలసీమ నుంచి విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బంది కలిపి వెయ్యి మందిని జిల్లాకు తరలించారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా వర్షాలు, ఈదురుగాలుల తీవ్రత పెరగడంతో అనేకచోట్ల పంటలు నేలకొరిగాయి. ఇప్పటి వరకు జిల్లాలో 2,295 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా. కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట పరిధిలోని పర్రకాలువ వంతెన దాటుతూ ఆరో తరగతి విద్యార్థి సాయిచరణ్ గల్లంతయ్యాడు. మొత్తం 3.35 లక్షల మందిని తుఫాన్ ప్రభావిత ప్రజలుగా గుర్తించారు. 200 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. 142 మంది గర్భిణులను ఆస్పత్రులకు తరలించారు. కొత్తపల్లి మండలం ఉప్పాడలోని సుబ్బంపేట వద్ద తీరాన్ని జనసేన నేతలతో కలిసి కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పరిశీలించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా ఆయన వెంట ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం హార్బరుపేటలో మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ అప్రమత్తం చేశారు. జోరువానలోను ఆయన మత్స్యకార గ్రామాల్లో పర్యటించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కూడా మత్స్యకార గ్రామాల్లో తిరిగి అందరినీ అప్రమత్తం చేశారు.

తుఫానుపై సన్నద్ధం!

మంత్రులు నారాయణ, నాదెండ్ల, కొండపల్లి సమీక్షలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'మొంథా' తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు తామంతా సన్నద్ధంగా ఉన్నామని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ చెప్పారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో తుఫాన్ ప్రత్యేకాధికారి కృష్ణతేజ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్పలతో మంత్రి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,194 పునరావా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 470 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌ల మూసివేత కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా 1,547 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. అత్యవసర సేవల కోసం మండలానికో బస్సు సిద్ధంగా ఉంచారు. ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రభుత్వ సీఎస్, తుఫాన్ పర్యవేక్షణ జోనల్ ప్రత్యేకాధికారి ఆర్.పి.సిసోడియా, జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 82 తుఫాన్ సహాయక కేంద్రాలు, 11 లంక గ్రామాల్లో ఆహారం, వైద్యం, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొగల్తూరులో పర్యాటక రిసార్ట్‌లు, బీచ్‌ను మూసివేశారు. ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి సిసోడియా తుఫాను ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. కలెక్టర్ నాగరాణితో సమీక్ష నిర్వహించారు. కృష్ణాజిల్లాలో కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, ఎస్పీ విద్యాసాగర్ పలు మండలాల్లో పర్యటించి అధికారులను, ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి మచిలీపట్నంలోని గిలకలదిండిలో పర్యటించారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోలు రూమ్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరిశీలించారు .కోనసీమ జిల్లా ప్రత్యేకాధికారిగా నియమితులైన విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, కలెక్టర్ మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతి క్షేత్రస్థాయిలో పర్యటించి తుఫాను సన్నద్ధత ఏర్పాట్లను సమీక్షించారు. అనకాపల్లి జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు 24 మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. ఉద్యోగుల సెలవులను రద్దు చేశారు. 34 తుఫాన్ ప్రభావిత గ్రామాలను గుర్తించి, 74 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ జిల్లా అధికారులకు సూచనలు చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక కేంద్రాలన్నీ మూసేశారు. బోటు షికారు, టూర్ ప్యాకేజీ బస్సులు కూడా నిలిపివేశారు.

తప్పుడు ప్రచారంతో

భయ పెట్టొద్దు!

» మొంథా తుఫాన్‌పై థంబ్ నెయిల్స్ భయ పెట్టేలా ఉన్నాయి: మంత్రి అనిత

» సోషల్ మీడియా సంయమనం పాటించాలని సూచన

» యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడి

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రంలోని అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని, ప్రజల్లో భయాందోళనలను సృష్టించేలా సోషల్ మీడియాలో నకిలీ ప్రచారాలు చేయవద్దని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు. సంచలన శీర్షికలతో ప్రజల్లో భయభ్రాంతులు సృష్టించడం బాధ్యతా రాహిత్యమేనని తెలిపారు. సహాయక చర్యలకు ప్రభుత్వం పూర్తిగా సన్నద్ధమైందన్నారు. అయితే.. సోషల్ మీడియాలో పాత ఫోటోలు, వీడియోలు భయపెట్టేలా థంబ్ నెయిల్స్‌ను పెట్టి నకిలీ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పదేళ్ల క్రితం విశాఖలో వచ్చిన హుద్‌హుద్ తుఫాను మాదిరిగా.. ప్రస్తుత మొంథా తుఫాను కూడా ఉంటుందనే భయంతో ప్రజలు బీతిల్లుతున్నారని తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే విషయమై అధికార వర్గాలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిందని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి కలెక్టర్లు, ఎస్పీలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో యూట్యూబ్ చానెళ్లు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా సంయమనం పాటించాలని సూచించారు. దురుద్దేశ పూర్వకంగా నకిలీ ప్రచారం చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

పునరావాస కేంద్రాలకు ప్రజలు: అనిత, అనగాని

'తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా పిల్లలు, పెద్దలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నాం. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత స్థానాలకు తరలించాం' అని మంత్రులు అనిత, అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. సోమవారం అమరావతి సచివాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. 'పునరావాస కేంద్రాల్లో ప్రజలకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేస్తున్నాం. ఆర్టీజీఎస్‌లో సీఎం చంద్రబాబు, లోకేశ్ ఉదయం నుంచి కూర్చుని అధికారుల అప్రమత్తతపై సూచనలు చేస్తున్నారు. 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉంది' అని చెప్పారు.


తుఫాను సన్నద్ధతపై జలవనరుల శాఖ సమీక్షలో మంత్రి నిమ్మల, అధికారులు


ఆర్టీజీఎస్ కార్యాలయంలో మంత్రి లోకేశ్, సీఎస్ విజయానంద్


కాకినాడ జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి నారాయణ, అధికారులు


విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలోని స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్‌లో మంత్రి సుభాష్ తదితరులు

జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి చదివి వినిపించారు. 2019 జూన్‌లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. 2023 నవంబరులో గుజరాత్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 24న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం సమావేశమై ఆయన్ను తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడం.. రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి ఉత్తర్వులివ్వడం తెలిసిందే. సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జస్టిస్ రాయ్ కుటుంబ సభ్యులు, అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ, రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథరెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, రిజిస్ట్రార్లు, హైకోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

పట్టుమని 15 మందీ లేరే...!



- రాష్ట్రంలో 12,912 ఏకోపాధ్యాయ స్కూళ్లు
- మొత్తం పాఠశాలల్లో సగటున 138 మంది
- 2024-25 యూడైస్ నివేదికలో వెల్లడి
- జగన్ పాలనలో జీవో 117తో విలీన ప్రక్రియ
- దీంతో ప్రైవేటు బాట పట్టిన విద్యార్థులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగింది. వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి 7 వేలలోపు పాఠశాలలు మాత్రమే ఒకే టీచర్‌తో నడిచాయి. 2024-25 విద్యా సంవత్సరం నాటికి ఆ సంఖ్య 12,912కు చేరింది. ఆ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో 1,97,113 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అంటే సగటున ఒక్కో బడిలో ఉన్నది కేవలం 15 మంది. అదే రాష్ట్రం మొత్తం పరిశీలిస్తే 61,317 పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 84.54 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్నారు. అంటే సగటున ఒక్కో పాఠశాల లేదా జూనియర్ కాలేజీలో 137.88 మంది ఉన్నారు. రాష్ట్ర సగటు 138 అయితే.. ఒకే టీచర్ ఉన్న పాఠశాలలో కేవలం 15 మంది విద్యార్థులే ఉన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన యూడైస్ నివేదికను కేంద్ర విద్యాశాఖ ఇటీవల విడుదల చేసింది. 2024-25లో ఒక్క పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. పది మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 9.8 శాతం, 11 నుంచి 20 మంది ఉన్నవి 12.9 శాతం, 21 నుంచి 30 మంది ఉన్నవి 15.8 శాతం, 101 నుంచి 200 మంది ఉన్నవి 13.7 శాతం, 500 మందిపైగా ఉన్నవి 6.2 శాతం పాఠశాలలు ఉన్నాయి. రాష్ట్రంలో పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో మొత్తం 3,42,721 మంది టీచర్లు ఉన్నారు.

వైసీపీ పాపమే

వైసీపీ ప్రభుత్వంలో చేసిన అడ్డగోలు సంస్కరణల ఫలితంగానే రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు భారీగా పెరిగాయి. జీవో 117తో ప్రభుత్వ పాఠశాల విద్యను జగన్ ప్రభుత్వం నాశనం చేసింది. దాదాపు 4,500 పాఠశాలల్లో 3 నుంచి 5 తరగతులను ఇతర పాఠశాలల్లో విలీనం చేసింది. దీంతో అక్కడ 3-5 తరగతులు చదివే విద్యార్థులు ప్రభుత్వ బడులు మానేసి సమీపంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. దీనిపై అప్పట్లో విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డెక్కినా జగన్ ప్రభుత్వం విలీన ప్రక్రియ ఆపలేదు. పైగా మెగా డీఎస్సీ వేస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఇది ప్రాథమిక పాఠశాలలను తీవ్రంగా దెబ్బతీసింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించే తల్లిదండ్రుల సంఖ్య తగ్గింది. దీంతో అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 20లోపు పడిపోయి ఏకోపాధ్యాయ పాఠశాలలు వేల సంఖ్యకు చేరాయి.

పరకామణిలో చోరీ కేసులో.. రాజీపై సీఐడీ దర్యాప్తు

హైకోర్టు కీలక ఉత్తర్వులు



- నిందితుడు రవికుమార్‌పై రాజీకి అవకాశం లేని సెక్షన్ 409 కింద అభియోగాలు మోపకపోవడం ద్వారా దర్యాప్తు అధికారి, ప్రిసైడింగ్ అధికారి తీవ్ర తప్పిదానికి పాల్పడ్డారని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నాం.
- రికార్డులన్నీ పరిశీలిస్తే 2023 జూన్ 1నాటికే రవికుమార్‌పై క్రిమినల్ చర్యలు ముగించారు. ఆ ఏడాది సెప్టెంబరు 9న కేవలం లాంఛనంగా లోక్ అదాలత్ వద్ద కేసును రాజీ చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. - హైకోర్టు

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల పరకామణిలో చోరీకి సంబంధించి నమోదైన కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంలో టీటీడీ బోర్డు, టీటీడీ అధికారులు, దర్యాప్తు అధికారి(ఐవో), పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) సతీశ్‌కుమార్ పాత్రలపై దర్యాప్తు చేసి.. తదుపరి విచారణ నాటికి సీల్డ్ కవర్‌లో నివేదికను రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ద్వారా తమకు సమర్పించాలని ఆదేశించింది. కేసు దర్యాప్తు కోసం సీఐడీలో డీజీ స్థాయికి తగ్గని అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించాలని స్పష్టం చేసింది. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై డీజీ ర్యాంకు అధికారితో సమగ్ర దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించింది. దర్యాప్తులో తేలిన అంశాల ఆధారంగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రతిపాదించి సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని తెలిపింది. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చాల్సింది ధర్మాసనమేనని.. అందువల్ల ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు ఉత్తర్వుల ప్రతిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సీజ్ చేసి తమకు సమర్పించిన 16 బండిళ్ల రికార్డులను సీఐడీ డీజీకి అందజేయాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలిచ్చింది. చోరీ కేసులో రాజీ ఉత్తర్వులు జారీ చేసిన అప్పటి తిరుపతి మొదటి తరగతి రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వార్షిక రహస్య నివేదిక(ఏసీఆర్)లో ఉత్తర్వుల ప్రతిని పొందుపరచాలని రిజిస్ట్రార్(విజిలెన్స్)ను ఆదేశించింది. న్యాయవ్యవస్థలో పరిపాలనాపరమైన పారదర్శకత, సమగ్రత కోసం సదరు మేజిస్ట్రేట్‌ను తక్షణమే ప్రొటోకాల్ విధుల నుంచి పక్కన పెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకునేందుకు ఉత్తర్వుల ప్రతిని సంబంధిత పరిపాలనా కమిటీ ముందు ఉంచాలని రిజిస్ట్రార్(జ్యుడీషియల్)ను ఆదేశించింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను డిసెంబరు 2వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు.. ఈ వ్యాజ్యంలో తమను ప్రతివాదిగా చేర్చుకుని వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని నిందితుడు రవికుమార్, అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

409 కింద అభియోగాలు మోపాలి

కోర్టు ముందుంచిన రికార్డులను పరిశీలిస్తే... దర్యాప్తు అధికారి, టీటీడీ బోర్డు, టీటీడీ అధికారులు రాజీ ధోరణి, నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారని స్పష్టమవుతోందని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేసును విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకోవడంతో పాటు రాజీ చేసే సమయంలో ప్రిసైడింగ్ అధికారి అనాలోచితంగా వ్యవహరించారని తెలిపారు. 'పెద్ద జీయర్ మఠం తరఫున పరకామణిలో పర్యవేక్షణాధికారి బాధ్యతలు నిర్వర్తించేందుకు రవికుమార్‌ను నియమిస్తూ 1985 అక్టోబరులో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఆయనపై 2023 ఏప్రిల్ 29న చోరీ కేసు నమోదయ్యేనాటికి 38 ఏళ్లుగా పరకామణిలో సేవలు అందిస్తున్నారు. ఆయన ప్రభుత్వ ఉద్యోగి నిర్వచనం పరిధిలోకే వస్తారు. ఈ నేపథ్యంలో రవికుమార్‌పై రాజీకి ఆస్కారం లేని ఐపీసీ సెక్షన్ 409(నేరపూరిత విశ్వాస ఘాతుకం)కింద కేసు పెట్టి దర్యాప్తు ప్రారంభించి ఉండాల్సింది. అదే ఏడాది మే 31న వేసిన చార్జిషీటులో సైతం సెక్షన్ 409 కింద అభియోగాలు మోపి ఉండాల్సింది. అయితే రాజీకి అవకాశమున్న సెక్షన్లు 379, 381 కింద మాత్రమే కేసు పెట్టారు. నిందితుడిపై మోపిన అభియోగాలు సరైనవేనా అనే విషయం పరిశీలించకుండా.. అనాలోచితంగా మేజిస్ట్రేట్ చార్జిషీటును పరిగణనలోకి తీసుకున్నారు. చోరీ కేసులో రవికుమార్‌ను పోలీసులు అరెస్టు చేయలేదు. కేసు డైరీని పరిశీలిస్తే రవికుమార్ ఆస్తులపై క్రైమ్ బ్రాంచ్ గానీ, ఏసీబీ గానీ దర్యాప్తు చేసినట్లుగా ఎలాంటి వివరాలూ లేవు. శ్రీవారికి భక్తులు కానుకలను అర్పిస్తుంటారు. దేవుడే ఆ సొమ్ముకు పూర్తి హక్కుదారు. స్వామి తరఫున టీటీడీ బోర్డు నిర్ణయాలు తీసుకుంటుంది. శ్రీవారి ఆస్తికి అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ ఏవిధంగానూ యజమాని కాలేరు. ఈ నేపథ్యంలో టీటీడీ ఆమోదం లేకుండా చోరీ కేసును రాజీ చేసుకునే అధికారం ఆయనకు లేదు' అని తేల్చిచెప్పారు.


లోతైన విచారణ అవసరం..

రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులను శ్రీవారికి సమర్పిస్తామని 2023 మేలో రెండు దఫాలుగా ప్రతిపాదించారని.. టీటీడీ నిబంధనల ప్రకారం ఆస్తులను బహుమతిగా అంగీకరించడానికి కనీసం 30 రోజుల ముందు పత్రికల్లో ఆ విషయాన్ని ప్రచురించాలని న్యాయమూర్తి గుర్తుచేశారు. 'రికార్డులను పరిశీలిస్తే పేపర్ పబ్లికేషన్ లేకుండానే గిఫ్ట్ డీడ్‌లను స్వీకరించేందుకు ఈవో, జాయింట్ ఈవో ప్రతిపాదించారు. అందుకు టీటీడీ చైర్మన్ అంగీకరించారు. 30 రోజుల ముందు పత్రికా ప్రకటన ఇవ్వాలన్న నిబంధనను పక్కనపెట్టి.. ఆస్తులు స్వీకరించేందుకు అప్పటి టీటీడీ చైర్మన్ అనుమతించడం, ఆ ఉత్తర్వుల్లో రవికుమార్‌పై ఉన్న చోరీ కేసును ప్రస్తావించకపోవడంపై లోతైన విచారణ అవసరం. ఇలా ఎందుకు చేశారనేది దీని వెనకున్న పలువురు వ్యక్తులు, అధికారులకే తెలుసు. ఈ విషయంలో నిజాలు నిగ్గు తేల్చాలంటే లోతైన విచారణ అవసరమని భావిస్తున్నాం' అని న్యాయమూర్తి తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఇదీ కేసు..

2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల పరకామణిలో జరిగిన కుంభకోణంపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలని సమర్పించిన వినతిని టీటీడీ ఈవో పరిగణనలోకి తీసుకోకపోవడంతో జర్నలిస్టు ఎం.శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ చేశారు. పరకామణిలో విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి సీవీ రవికుమార్ డాలర్ల రూపంలో పెద్దఎత్తున నగదు, బంగారాన్ని అపహరించారని, ఈ విషయంలో నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద రవికుమార్‌తో ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్.. రాజీ చేసుకున్నారని అందులో తెలిపారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వ్యవహారంతో ముడిపడి ఉన్న అన్ని రికార్డులను సీఐడీ ద్వారా సీజ్ చేయించడం.. పిటిషనర్ ఇచ్చిన వినతిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని టీటీడీ ఈవోను ఆదేశించడం తెలిసిందే. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా సతీశ్‌కుమార్, రవికుమార్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. అలాగే.. ప్రస్తుత వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయిన ఏపీ సాధు పరిషత్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపించారు. ఇంప్లీడ్ పిటిషన్ వేసినందుకు సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతికి బెదిరింపు ఫోన్స్ వచ్చాయని తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్రం కోసం బాబు 'స్వార్థం'!





(మొదటి పేజీ తరువాయి)

చెబుతారు. ఇప్పుడు... కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ అవే విషయాలను 'నో, మినిస్టర్' పేరుతో రాసిన పుస్తకంలో అక్షరాల్లో పొందుపరిచారు. చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడబోరన్నారు. అప్పట్లో రాష్ట్రం కోసం ఆయన ఏ విధంగా తపన పడేవారో వివరించారు. సుభాష్ ఏపీలో ఎప్పుడూ పనిచేయలేదు. వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ఆర్థిక శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకానమిక్ ఎఫైర్స్ (డీఈఏ) డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ పుస్తకంలో చంద్రబాబు గురించి సుభాష్‌చంద్ర గార్గ్ పేర్కొన్న కొన్ని ఆసక్తికరమైన అంశాలివి...

అన్నీ ఆంధ్రాకే...

1999-2000 కాలంలో ప్రపంచబ్యాంకు ఆమోదించిన మొత్తం ప్రాజెక్టుల్లో 40 శాతం కంటే ఎక్కువగా చంద్రబాబు ఏపీకి తరలించుకుపోయారు. ఆ సమయంలో భారత ప్రభుత్వం, వరల్డ్ బ్యాంకు అన్నీ ఏపీ కోసమే పనిచేస్తున్నాయని అనిపించేది. నాడు వాజపేయి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ కీలక మద్దతుదారుగా ఉంది. దీంతో చంద్రబాబు మాటకు బాగా విలువ ఉండేది. వివిధ ప్రాజెక్టుల కింద ఏపీకి నిధుల కోసం చంద్రబాబు నా రక్తం పీల్చేవారు. తక్కువ ఆదాయం ఉన్న రాష్ట్రాలకు ఉద్దేశించిన ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చౌక రుణాలను కూడా చంద్రబాబు తరలించుకుపోయారు. రాష్ట్రం కోసం అత్యంత స్వార్థపూరితంగా వ్యవహరించేవారు. పాలనా సామర్థ్యం, రాజకీయ చతురతతో చంద్రబాబు కేంద్రం నుంచి ఏపీకి అత్యధిక లబ్ధి చేకూర్చారు.

100 శాతం గ్రాంట్‌గా మార్పు

2001లో ప్రపంచ బ్యాంకుతో 250 మిలియన్ డాలర్ల ఏపీ స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ లోన్(ఎస్‌ఏఎల్)పై చర్చలు జరిగాయి. అందులో... బ్రిటన్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(డీఎఫ్ఐడీ) నుంచి 100 మిలియన్ డాలర్ల గ్రాంట్ కూడా ఒక భాగం. సాధారణంగా రుణ, గ్రాంట్ నిష్పత్తి 70:30 ఉండగా ఏపీ ప్రభుత్వం డీఎఫ్ఐడీతో నేరుగా చర్చించి 100 శాతం గ్రాంట్‌గా మార్చే ప్రయత్నం చేసింది. ఈ ప్రతిపాదనను నేను తీవ్రంగా వ్యతిరేకించాను. నేను తిరస్కరించిన రెండు రోజులకే అదే ఫైలు కేంద్ర ఆర్థిక మంత్రి ఆమోదం పొందింది. ఏపీకి ప్రత్యేక మినహాయింపు ఇస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

పనికి ఆహార పథకంలో భారీ లబ్ధి

గతంలో కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పనికి ఆహార పథకాన్ని కూడా చంద్రబాబు పూర్తిస్థాయిలో వాడుకున్నారు. 2001 సెప్టెంబరు నుంచి 2002 ఏప్రిల్ వరకు కేంద్రం ఈ పథకం కింద రాష్ట్రాలకు 40 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించింది. అందులో ఏపీ ఒక్కటే 21.5 లక్షల టన్నులు అంటే.. 53 శాతం లబ్ధి పొందింది. ఆ తర్వాత మరో 10 లక్షల టన్నులు అదనంగా కూడా కేంద్రం నుంచి పొందింది. అప్పట్లో అన్ని రాష్ట్రాలకు కేంద్ర గ్రాంట్లు 2.6 శాతం మాత్రమే పెరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ వాటా 34 శాతం పెరిగింది. అంటే... చంద్రబాబు అప్పటి పరిస్థితులను రాష్ట్రం కోసం ఎలా వాడుకున్నారో అర్థం చేసుకోవచ్చు.

నన్ను తప్పించాలని చూశారు

ఏపీకి నిధుల మళ్లింపులో నేను పదే పదే అడ్డుపడుతున్నాననే ఆలోచనతో నన్ను డీఈఏ డైరెక్టర్ స్థానం నుంచి తప్పించాలని కూడా చంద్రబాబు ప్రయత్నించారు. అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి జస్వంత్ సింగ్ ప్రైవేట్ సెక్రటరీ వి.శ్రీనివాస్ నాకు ఈ విషయం చెప్పారు. అప్పటి ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి వీఎస్ సంపత్(తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా చేశారు) నన్ను ఆ స్థానం నుంచి తప్పించేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అని ఆరా తీసినట్లు శ్రీనివాస్ నాకు చెప్పారు.

19 వాహనాలు బైక్‌ను తప్పించాయి!

(మొదటి పేజీ తరువాయి)

వర్షం పడుతోంది. రోడ్డుపై పడి ఉన్న బైక్ నలుపు రంగులో ఉంది. చీకట్లో దూరం నుంచి బైక్‌ను గుర్తించలేకపోయాను. దగ్గరకు వచ్చాక బైక్ కనిపించిందని, సడెన్ బ్రేక్ వేస్తే.. వెనుకాల వచ్చే వాహనాలు మా బస్సును ఢీకొట్టి భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించి తప్పని పరిస్థితుల్లో బైక్ పైనుంచి బస్సును పోనిచ్చా." అని డ్రైవర్ లక్ష్మయ్య పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కానీ, అంతకుముందు అదే దారిలో 19కి పైగా బస్సులు, లారీలు రోడ్డుపై పడి ఉన్న బైకును తప్పించుకుని ముందుకు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అంతేకాదు.. ఆ దారిలో వెళ్లిన నలుగురు బస్సు, లారీల డ్రైవర్లను గుర్తించి విచారించగా.. "ఓ బైక్ రోడ్డు పై అడ్డంగా పడి ఉంది. స్పృహ లేకుండా పడిపోయిన ఓ యువకుడిని మరో వ్యక్తి పక్కకు లాగుతున్నట్లు గుర్తించాం. బైక్‌ను తప్పించుకొని ముందుకు వెళ్లిపోయాం." అని పోలీసులకు వివరించారు. అంటే 19కి పైగా వాహనాల డ్రైవర్లు ప్రమాదానికి గురైన యువకులు, రోడ్డుపై పడిన బైక్‌ను గుర్తించి తప్పించుకొని వెళ్లిపోయారు. ఆ డ్రైవర్లకు కనిపించిన బైకును కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ లక్ష్మయ్య గుర్తించ లేకపోయానని చెప్పడం ఎంత వరకు నిజం? అనే దిశగా పోలీసులు విచారణ సాగిస్తున్నారు. బస్సు ప్రమాదానికి లక్ష్మయ్య నిర్లక్ష్యమే కారణమని అనుమానిస్తున్నారు.

నివేదికలు వస్తే కొలిక్కి

కర్నూలు బస్సు ప్రమాదంపై రోడ్డు రవాణా, అగ్నిమాపక శాఖ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్) నుంచి నివేదికలు కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. ఆయా శాఖల అధికారులకు ఇప్పటికే లేఖలు రాశారు. వారి నుంచి నివేదికలు రాగానే దర్యాప్తు ఓ కొలిక్కి వస్తుందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

తమిళనాడు వాసి మృత దేహానికి కర్నూలులో అంత్యక్రియలు

గుండెలవిసేలా రోదించిన తండ్రి



ప్రశాంత్ మృతదేహానికి అంత్యక్రియలు

కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది అగ్ని ఆహుతైన విషయం తెలిసిందే. వారిలో ఒకరు తమిళనాడుకు చెందిన ప్రశాంత్ రాజన్(29). డీఎన్ఏ సరిపోల్చి 18 మంది మృతదేహాలను ఆదివారం కుటుంబీకులకు అప్పగించారు. అయితే, 550 కి.మీ.దూరంలోని స్వస్థలం ధర్మపురి జిల్లా జిత్తన్‌దహళ్లికి రాజన్ మృతదేహాన్ని తీసుకెళ్లే అవకాశం లేక కర్నూలులోనే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా, 'నా కొడుకు ఎక్కడో తమిళనాడులో పుట్టి ఊరుగాని ఊరులో చివరి మజిలీ ముగించాల్సి వచ్చింది. వందల కిలోమీటర్లు దూరం ఉండడంతో అందరూ ఉన్నా అనాథలా సాగనంపాల్సి వస్తోంది దేవుడా' అంటూ తండ్రి రాజన్ గుండెలవిసేలా రోదించారు.

నిర్లక్ష్యం.. ప్రాణాంతకం!

కలవరపెడుతున్న రహదారి ప్రమాదాలు

- సగటున ఏటా 20వేలకు పైగా యాక్సిడెంట్లు
- పదకొండు ఏళ్లలోనే 87,341 మంది మృత్యువాత
- గాయాలపాలైన వారు మరో 2,68,871 మంది
- కనీస చర్యలు చేపట్టని పోలీసు, రవాణా శాఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం రహదారి ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో వేలాది మంది మరణిస్తుండటంతో వారి కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత 11 ఏళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య 2,28,223. వీటిలో 87,341 మంది ప్రాణాలు కోల్పోయారు. 2,68,871 మంది క్షతగాత్రులు కావడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. వీరిలో చాలా మంది కాళ్లు, చేతులు, నడుము వంటి కీలక భాగాలు దెబ్బతిని జీవచ్ఛవాల్లా మిగిలారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాద ఘటనను పరిశీలిస్తే.. మద్యం తాగి, హెల్మెట్ లేకుండా తీవ్ర నిర్లక్ష్యంతో బైక్ నడిపిన ఓ ద్విచక్ర వాహనదారుడు తన చావును కోరి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత అతను నడిపిన వాహనం మరో 19మంది బస్సు ప్రయాణికులను బలి తీసుకుంది. బస్సు డ్రైవర్ అతివేగం కూడా ఈ ప్రమాదానికి మరో కారణంగా కనిపిస్తోంది.

అవగాహన కల్పించడంలో వైఫల్యం

రాష్ట్రంలో రహదారి భద్రతపై అవగాహన పెంచకపోవడంతో పాటు కనీస చర్యలు చేపట్టక పోవడం ప్రమాదాలకు ప్రధాన కారణం. ప్రయాణికులు, వాహనదారుల భద్రత కోసం పోలీసు శాఖలో రోడ్ సేఫ్టీ విభాగం ఉంది. రోడ్ సేఫ్టీ అథారిటీకి డీజీపీ ర్యాంకు అధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అయితే ఈ దీని గురించి తెలిసినవాళ్లు చాలా తక్కువ. వాహనదారులకు రాసే చలానాల సొమ్ములో 40శాతం రోడ్ సేఫ్టీ అథారిటీ ద్వారా ఖర్చు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అయినా కొన్నేళ్లుగా రాష్ట్రంలో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ పోస్టు అంటేనే పనిష్మెంట్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారులు భావిస్తుంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం మినహా రవాణా శాఖ రక్షణ చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కర్నూలులో బస్సు ప్రమాదం జరగ్గానే రాష్ట్రమంతా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వందల బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇన్ని రోజులు కనీస అనుమతులు కూడా లేకుండా బస్సులు రోడ్లపై తిరుగుతున్నా కళ్లు మూసుకున్న ఆర్టీఏ అధికారులు ఇప్పుడు ప్రయాణికుల జాబితా డ్రైవర్ వద్ద లేనందుకు కూడా కేసులు రాస్తున్నారు. వాహనాల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు కేంద్రం రెండేళ్ల క్రితం రూ.6.5 కోట్లు ఇస్తే ఇప్పటికీ అతీగతి లేదు. జీపీఎస్ తప్పనిసరని కేంద్రం చెబుతున్నా అమలు కావట్లేదు. వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయుల్లో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పోలీసు, రవాణా, రోడ్లు భవనాలు, వైద్య ఆరోగ్య, విద్యా శాఖల అధికారులతో పాటు స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఈ కమిటీల్లో నియమించాలి. ఇవి ఎప్పటికప్పుడు సమావేశమై ఇచ్చే నివేదికలు, సూచనల మేరకు చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు వేల ప్రాణాలు నిలుస్తాయి. కానీ 2019 తర్వాత అటువంటి కమిటీలు రాష్ట్రంలో లేవు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా కమిటీల ఏర్పాటు దిశగా ఆలోచన చేయలేదు.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు ఇవీ...

నిర్లక్ష్యం, అతివేగం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి కారణాలతో ఏటా వేలాది మంది మృత్యువాత పడుతున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

పదేళ్లలో మన రాష్ట్రంలో సంభవించిన రోడ్డు ప్రమాదాలు, మృతులు, క్షతగాత్రుల వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2014	23,512	7,862	29,791
2015	23,178	8,114	29,893
2016	23,726	8,543	30,245
2017	22,607	8,111	27,762
2018	19,928	7,416	23,477
2019	20,755	7,834	24,777
2020	17,910	7,059	19,612
2021	19,729	8,053	21,169
2022	20,003	8,214	21,669
2023	18,413	7,977	20,332
2024	18,462	8,158	20,144

అంత్యక్రియలకు వచ్చి.. ప్రమాదం బారిన

- కర్నూలు బస్సు దుర్ఘటనలో మృతి చెందిన గోళ్ల రమేశ్ సహా నలుగురు కుటుంబసభ్యులు
- వీరి అంత్య క్రియలకు వచ్చిన బంధువులు
- బెజవాడకు తిరుగు పయనంలో పేలిన కారు టైర్

జలదంకి, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఒకే కుటుంబంలోని గోళ్ల రమేశ్, అనూష, వీరి బిడ్డలు శశాంత్, మన్వితల అంత్యక్రియలు సోమవారం నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లెలో జరిగాయి. అయితే, ఈ కార్యక్రమంలో పాల్గొని తిరుగుముఖం పట్టిన మృతుల బంధువులు ప్రమాదం బారిన పడ్డారు. విజయవాడకు చెందిన గోళ్ల కృష్ణచైతన్య, సుంచు సుమలత, పులిపాటి నాగమౌనిక, నల్లబోతు భానుప్రియ, డ్రైవర్ వర్రి శ్రీనివాస్‌లు ఈ అంత్యక్రియల్లో పాల్గొని కారులో తిరుగుముఖం పట్టారు. కావలి వైపు వస్తుండగా చినక్రాక, హనుమకొండపాలెం గ్రామాల మధ్య కారు ముందు టైరు పంక్చర్ అయింది. దీంతో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టు గోడను ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతినగా కారులో ఉన్న ఐదుగురికీ గాయాలయ్యాయి. సమీపంలోని వాహనదారులు వెంటనే స్పందించి గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో కావలి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారు విజయవాడ వెళ్లారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.